

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 25-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 139 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి రా.11:23 తదుపరి విదియ, నక్షత్రం: పుష్యమి సా.4:01 తదుపరి ఆశ్లేష, వర్జ్యం తె.4:44 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8:30-9:21, మ.12:47-1:38, అమృతఘడియలు: ఉ.9:48-11:21, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 5:56, సూర్యాస్తమయం: 6:47 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నెల్లూరులో నాణ్యమైన ఇనుప ఖనిజం!

14

- లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో అత్యంత నాణ్యమైన మాగ్నటైట్ ఐరన్ ఓర్ గుర్తింపు
- 21.87 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిక్షేపాలు
- 10 మీటర్ల లోతులోనే ఉన్నట్లు గుర్తించిన సిబ్బంది
- 150-200 మీటర్ల లోతు వరకు డ్రిల్లింగ్‌కు నిర్ణయం
- ముమ్మరంగా పనులు చేపడుతున్న జేఎస్‌డబ్ల్యూ



క్యాబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు, సీఎస్ విజయానంద్

అమరావతిపై కక్షతో..

సింగపూర్‌పై బురద!

వైసీపీ హయాంలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా మంది భయపడ్డారు. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెట్టుబడిదారులనూ జగన్ వెళ్లగొట్టారు. అలాంటి వారిలో లులూ గ్రూప్, అపోలో టైర్స్ కూడా ఉన్నాయి.

- క్యాబినెట్ భేటీలో చంద్రబాబు

జగన్ నిర్వాకం వల్ల ఆ దేశంతో సంబంధాలు దెబ్బతిన్నాయ్: సీఎం

- అవినీతిరహిత దేశాల్లో సింగపూర్‌ది మూడో స్థానం
- అలాంటి దేశంపై స్వార్థరాజకీయంతో ఆరోపణలు
- సత్సంబంధాల పునరుద్ధరణకే అక్కడికి వెళ్తున్నా
- రాష్ట్రంలో పెట్టుబడులకు వారిని ఆహ్వానిస్తాం
- వైసీపీ ఎన్ని తప్పుడు మెయిల్స్ పంపినా రూ.9 వేల కోట్లు సేకరించాం
- ఆ పార్టీ కుట్రలను ఇన్వెస్టర్లు నమ్మడం లేదు
- అక్రమ కట్టడాలను నిర్మించేటప్పుడే కూల్చేయాలి
- అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మంత్రివర్గ సహచరులతో చంద్రబాబు

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై కక్షతో జగన్ సింగపూర్‌పైనా బురదచల్లారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఇప్పుడు సింగపూర్‌తో సంబంధాలు పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో చంద్రబాబు ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'రాష్ట్రం విడిపోయినప్పుడు విభజిత రాష్ట్రానికి అన్ని

మిగతా 13వ పేజీలో...

రూ.79,900 కోట్ల పెట్టుబడులకు ఓకే

- తద్వారా లక్షన్నర ఉద్యోగాలు: మంత్రివర్గం
- ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ పాలసీ 4.0కి ఆమోదం
- ఐటీ, డేటా హబ్‌గా విశాఖ

రేపు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు



దోస్త్ మేరా దోస్త్!

వైసీపీ, బీఆర్ఎస్ అవినాభావ సంబంధం

- రెండుచోట్లా దర్యాప్తుల్లో బయటపడుతున్న విషయాలు
- జగన్ కోసం నాడు షర్మిల ఫోన్ ట్యాపింగ్
- మద్యం కేసులో నిందితులకు 'ట్యాపింగ్' శ్రవణ్‌రావు ఆశ్రయం
- తన దుబాయ్ ఫ్లాటులో ఆతిథ్యం
- లిక్కర్ సొమ్ముతో తెలంగాణలో భూములు కొన్న రాజ్ కసిరెడ్డి
- లావాదేవీలకు నాటి బీఆర్ఎస్ సర్కారు సాయం!?

రాజకీయ పార్టీలు కూటములు కట్టడం మామూలే! లోపాయికారీగా సహకరించుకోవడమూ సహజమే! కానీ... 'పార్ట్‌నర్స్ ఇన్ క్రైమ్' తరహాలో అక్రమాల్లోనూ 'అవిభక్తం'గా కలిసిమెలిసి సాగడమే ఓ విచిత్రం! ఆ రెండు పార్టీలు... తెలంగాణకు చెందిన బీఆర్ఎస్, ఏపీలో జగన్ అధ్యక్షుడిగా ఉన్న వైసీపీ! తెలంగాణలో ఫోన్‌ట్యాపింగ్, ఏపీలో మద్యం స్కామ్‌పై ఒకే సమయంలో వేర్వేరుగా జరుగుతున్న దర్యాప్తుల్లో ఆ రెండు పార్టీల మధ్య లింకులు బయటపడుతుండటం విశేషం!

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

2019 ఎన్నికల్లో టీడీపీని ఓడించేందుకు జగన్‌కు బీఆర్ఎస్ సంపూర్ణంగా సహకరించిందనేది బహిరంగ రహస్యం! ఇక... 2018లో తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని వైసీపీ వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంది. లోపాయికారీగా

మిగతా 14వ పేజీలో...

నా ఫ్లాట్‌కు వచ్చి వెళ్లే వారు!

తెలుగు వాళ్లు అని రానిచ్చాను

వరుణ్, చాణక్య తెలుసు.. సిట్ విచారణలో శ్రవణ్ రావు

14



2

భారతీయుల్ని నియమించుకోవద్దు

- ఉద్యోగాల్లో అమెరికన్లకే ప్రాధాన్యతనివ్వాలి
- కంపెనీలు అంతర్జాతీయ ధోరణిని వదలాలి
- నా పాలనలో ఈ సంస్కృతికి ముగింపు
- సిలికాన్ వ్యాలీలో సరికొత్త దేశభక్తి అవసరం.. ఏఐ సదస్సులో డొనాల్డ్ ట్రంప్



2

ధన్‌ఖడ్‌పై ఒక దశలో అభిశంసన యోచన

- ఆయనపై తీవ్ర ఆగ్రహంతో బీజేపీ నాయకత్వం
- కాంగ్రెస్ పట్ల మెతక వైఖరితో ఉన్నారనే భావన
- ఖర్గేకు సభలో పహల్గామ్ అంశాన్ని లేవనెత్తే అవకాశం ఇవ్వడంపై బీజేపీలో తీవ్ర అభ్యంతరం
- జస్టిస్ శేఖర్ యాదవ్ అంశంలోనూ కేంద్రం కినుక
- ధన్‌ఖడ్‌కు వీడ్కోలు ఇవ్వడానికీ ససేమిరా
- కాంగ్రెస్ ప్రతిపాదించినా స్పందించని వైనం



11

అనిల్ అంబానీ సంస్థలపై ఈడీ దాడులు

- రూ.3000 కోట్ల బ్యాంక్ లోన్ ఫ్రాడ్, నగదు అక్రమ చలామణి ఆరోపణలపై 35 చోట్ల సోదాలు
- 2017-19 నడుమ ఎస్ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని సొమ్ము దారి మళ్లించినట్టు ఆరోపణలు
- పక్కా ప్రణాళికతోనే ప్రజాధనం దోచే వ్యూహం.. ఈడీ ప్రాథమిక విచారణలో వెల్లడి!



టా మ్యుయెన్‌లోని ప్రాచీన ఆలయం

2

థాయిలాండ్, కాంబోడియా ఢీ

- శివాలయాలున్న 'టా మ్యుయెన్' ప్రాంతంపై వివాదం
- బీఎం-21 రాకెట్లు, శతఘ్నులతో కాంబోడియా దాడి
- ఎఫ్-16 ఫైటర్లతో విరుచుకుపడిన థాయిలాండ్
- 'ఖ్మేర్' సామ్రాజ్య ప్రతీకలుగా ఆ ఆలయాలు

రష్యాలో విమాన ప్రమాదం.. 49 మంది దుర్మరణం

- ల్యాండింగ్ క్రమంలో కుప్పకూలిన విమానం
- ప్రతికూల వాతావరణం కారణంగానే..!

2

భూమన భూదందా నిజమే



- స్వర్ణముఖి నది పక్కనే 9 ఎకరాలు కబ్జా
- ప్రహరీ కట్టి కలిపేసుకున్న వైసీపీ నేత
- నిర్ధారించిన రెవెన్యూ శాఖ
- ఆ భూమి విలువ రూ.50 కోట్ల పైమాటే
- భూ కబ్జాపై భూమనకు రెవెన్యూ నోటీసు
- చట్ట ప్రకారం కేసులు: మంత్రి అనగాని

12

ఆ ఇద్దరి వల్లే తొక్కిసలాట!

- ఈ ఘటనకు డీఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డి బాధ్యులు
- ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించలేదు
- టీటీడీ జేఈవో గౌతమిది కూడా వైఫల్యమే
- తిరుపతి తొక్కిసలాటపై న్యాయకమిషన్ నివేదిక
- ఆ ఇద్దరిపై క్రిమినల్ చర్యలకు మంత్రివర్గం నిర్ణయం
- ఐఏఎస్ గౌతమిపై చర్యలు తీసుకునే బాధ్యత జీఏడీకి



ఐపీఎస్ సుబ్బారాయుడు


తిరుపతి ఎస్పీ తప్పేమీ లేదు

- ఐపీఎస్ సుబ్బారాయుడికి న్యాయ కమిషన్ క్లీన్‌చిట్
- కమిషన్ నివేదికను ఆమోదించిన క్యాబినెట్

12

బ్రిటన్‌లో సుంకాల్లేవ్

99% భారత ఉత్పత్తులకు మినహాయింపు!




బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో మోదీ కరచాలనం. ఒప్పంద పత్రాలతో ఇరుదేశాల వాణిజ్య మంత్రులు రెనాల్డ్స్, పీయూష్ గోయల్

- భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
- మోదీ, స్టార్మర్ సమక్షంలో సంతకాలు
- ఒప్పందంతో ఇరుదేశాల మధ్య ఏటా రూ.2.94 లక్షల కోట్ల వ్యాపారం!
- సరికొత్త అధ్యాయాన్ని లిఖించాం
- భారత యువత, రైతులు, ఎంఎస్ఎంఈలకు లబ్ధి: మోదీ
- రానున్న మూడేళ్లలో బ్రిటన్‌కు భారత వ్యవసాయ ఎగుమతుల్లో 20% వృద్ధి!

లండన్, జూలై 24: భారత్-బ్రిటన్ మధ్య వాణిజ్యానికి సంబంధించి చరిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఇరుదేశాలు 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' కుదుర్చుకున్నాయి. 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ)' పేరిట రూపొందించిన ఈ ఒప్పందంపై భారత ప్రధాని

మిగతా 2వ పేజీలో...






అప్పుడలా.. ఇప్పుడిలా..

- నాడు చంద్రబాబును హింసించారు
- ఇప్పుడు మిథున్ కోసం కన్నీరు
- బాబు కష్టాలకు స్నేహా బ్లాక్ మౌనసాక్ష్యం
- ఇదే బ్లాక్‌లో ఇప్పుడు ఎంపీ మిథున్‌రెడ్డి
- బాబు జైలులోకి వెళుతున్న దృశ్యాలు జగన్ మీడియాలో పదేపదే ప్రచారం.. పైశాచికం
- రోజులపాటు గదిలో ఒక కుర్చీ మాత్రమే
- ఒళ్లంతా దద్దుర్లు వచ్చినా చికిత్సలో నిర్లక్ష్యం
- ములాఖత్‌లకు జైలు అధికారుల మెలికలు
- కంటికి శస్త్ర చికిత్సపై నివేదికలూ మార్పు
- మిథున్‌రెడ్డికి అన్ని సౌకర్యాలు
- తాలిబన్లు..టెర్రరిస్టులు అప్పుడు గుర్తులేరా?
- పెద్దిరెడ్డికి నెటిజన్లు, టీడీపీ శ్రేణుల కౌంటర్

14





రాష్ట్రంలో రోడ్లకు మహర్దశ!



- రహదారుల మరమ్మతులకు మరో రూ.500 కోట్లు
- ఇంకో వెయ్యి కోట్లతో 2 వేల కి.మీ. కొత్త రోడ్లు

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారుల నిర్మాణం, విస్తరణ, అభివృద్ధిపై 15 రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ ప్రణాళిక

మిగతా 12వ పేజీలో...

స్వామీ.. నా సర్వస్వం నీకే!

- రూ.3 కోట్ల ఇల్లు, రూ.66లక్షల నగదు
- మాజీ ఐఆర్ఎస్ భాస్కర్‌రావు వీలునామా
- టీటీడీకి పత్రాలను అందజేసిన ట్రస్టీలు


మాజీ ఐఆర్ఎస్ అధికారి ఆస్తి పత్రాలు, చెక్కులను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేస్తున్న ట్రస్టీలు

తిరుమల, జూలై24(ఆంధ్రజ్యోతి): శ్రీవారిపై అచంచలమైన భక్తిని చాటుకున్నారు ఓ రిటైర్డు అధికారి. తన మరణానంతరం ఇంటితో పాటు బ్యాంకు ఖాతాలోని సొమ్ము యావత్తూ స్వామివారికే చెందాలని హైదరాబాద్‌కు చెందిన మాజీ ఐఆర్ఎస్ అధికారి వైవీఎస్ఎస్ భాస్కర్‌రావు వీలునామా రాశారు. ఆరు నెలల కిందట ఆయన కన్నుమూయడంతో.. ఆయన కోరిక మేరకు ఆయన ట్రస్టీలు రూ.3 కోట్ల విలువైన ఇంటి పత్రాలు, రూ.66 లక్షల విరాళాన్ని గురువారం రంగనాయక మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి ట్రస్టీలు దేవరాజ్‌రెడ్డి, సత్యనారాయణ, లోకనాథ్ అందజేశారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతంలో 3,500 చదరపు అడుగుల స్థలంలో ఉన్న 'ఆనందనిలయం' భవనాన్ని ఆధ్యాత్మిక కార్యకలాపాల కోసం ఉపయోగించాలని వీలునామాలో పేర్కొన్నారు. అలాగే, తన బ్యాంకు ఖాతాలో దాచిన సొమ్ములో టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.36 లక్షలు, ఎస్వీ సర్వశ్రేయ, వేదపరిరక్షణ, గోసంరక్షణ, విద్యాదానం, శ్రీవాణి ట్రస్టులకు రూ.6 లక్షల చొప్పున ఇవ్వాలని సూచించారు.

రోజుకు 7 వేల అడుగులతో ఆరోగ్యం మరింత పదిలం

- గుండె జబ్బు నుంచే కాదు...

డిమెన్షియా, డిప్రెషన్ నుంచీ రక్షణ

న్యూఢిల్లీ, జూలై 24: రోజుకు రెండు వేలు కాదు... 7,000 అడుగులు వేయండి. మీ గుండె మాత్రమే కాదు... మీ మానసిక ఆరోగ్యమూ పదిలంగా ఉంటుంది అంటూ 'ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్' పాత్రిక ఓ విశ్లేషణాత్మక వ్యాసాన్ని ప్రచురించింది. సిడ్నీ విశ్వవిద్యాలయం, ఆస్ట్రేలియాలోని ఇతర సంస్థలు, యూకే, స్పెయిన్, నార్వేకు చెందిన పరిశోధకుల బృందం ఈ వ్యాసాన్ని ప్రచురించింది. కేవలం గుండె సంబంధిత సమస్యలపై మాత్రమే కాకుండా మానవ ఆరోగ్య అంశాలన్నింటిపైనా దృష్టి పెడుతూ 1.6 లక్షల మందిపై పరిశోధనలు చేసి 2014-25 మధ్య కాలంలో ప్రచురించిన 88 పరిశోధనా పత్రాలను ఈ బృందం విశ్లేషించింది. నిత్య జీవితంలో అంత చురుకుగా లేని వయోజనులు ఆరోగ్యం కోసం రోజుకు 10 వేల అడుగులు వేయాలని ఒక అనధికారిక సమాచారం ప్రచారంలో ఉంది. కనీసం రెండు వేల అడుగులు వేయాలని గతంలో కొన్ని పరిశోధనలు చెప్పాయి. రోజుకు 7 వేల అడుగులు అన్నది మరింత ఆచరణాత్మకం, ఆరోగ్యకరం అని తాజా వ్యాసం పేర్కొంది. మరణకారక అనారోగ్యాన్ని 47% తగ్గిస్తుందని, గుండె జబ్బు వచ్చే అవకాశాలను 25 శాతం, గుండె జబ్బుతో మరణించే అవకాశాలను 47% తగ్గిస్తుందని వ్యాసం పేర్కొంది. క్యాన్సర్ కారక మరణ ప్రమాదాన్ని 34 శాతం, టైప్ 2 మధుమేహం వ్యాధి వచ్చే అవకాశాన్ని 14% తగ్గిస్తుందని వివరించింది. నిత్యం వేసే ఏడు వేల అడుగులు... చిత్తవైకల్యం(డిమెన్షియా) కలిగే అవకాశాన్ని 38 శాతం, మానసిక కుంగుబాటుకు లోనయ్యే అవకాశాలను 22 శాతం తగ్గిస్తుందని పరిశోధకుల బృందం వివరించింది.

లోకం తీరు



థాయ్‌లాండ్, కాంబోడియా ఢీ

శివాలయాలున్న 'టా మ్యుయెన్' ప్రాంతంపై ముదిరిన వివాదం

బ్యాంకాక్, జూలై 24: ఆగ్నేయాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పురాతన హిందూ ఆలయాలున్న ప్రాంతం కోసం థాయ్‌లాండ్, కాంబోడియా యుద్ధానికి దిగాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదం, కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య ఉప్పూనిప్పుగా ఉన్న పరిస్థితిలో.. కాంబోడియాకు చెందిన డ్రోన్లు వివాదాస్పద ప్రాంతం మీద సంచరించడంతో అగ్గి రాజుకుంది. ఇరు దేశాల సైన్యాలు సరిహద్దుల వెంట పరస్పరం కాల్పులకు దిగాయి. తప్పు మీదంటే మీదంటూ ఇరు దేశాల నేతల ఆరోపణల పర్వం, రాయబారులు, దౌత్యాధికారుల బహిష్కరణ వంటి పరిణామాలు వేగంగా చోటుచేసుకున్నాయి. కొన్ని గంటల్లోనే పరస్పరం దాడులకు దిగాయి. గురువారం థాయ్‌లాండ్‌పై బీఎం-21 రాకెట్లు, శతఘ్నులతో కాంబోడియా దాడులు చేసింది. థాయ్‌లాండ్ కూడా యుద్ధ విమానాలతో విరుచుకుపడింది. ఆరు ఎఫ్-16 యుద్ధ విమానాలతో కాంబోడియాలోని రెండు మిలటరీ స్థావరాలపై దాడి చేసినట్టు థాయ్ రక్షణ శాఖ ప్రతినిధి సురసంత్ కాంగ్‌సిరి ప్రకటించారు. ఇరు దేశాల మధ్య సరిహద్దుల్లో ఆరు చోట్ల కాల్పులు కొనసాగుతున్నట్టు చెప్పారు. కాంబోడియా ప్రయోగించిన శతఘ్ని గుళ్లతో సరిహద్దులో పౌర ఆవాసాలు ధ్వంసం అయ్యాయని, ఒక సైనికుడితోపాటు 11 మంది పౌరులు మరణించారని థాయ్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. మరో ఏడుగురు సైనికులు, 24 మంది పౌరులు గాయపడ్డారని తెలిపింది. ఇక పురాతన ప్రీహ్ విహీర్ ఆలయం సమీపంలో రహదారిపై థాయ్‌లాండ్ యుద్ధ విమానాలు బాంబులు వేశాయని కాంబోడియా రక్షణ శాఖ ప్రకటించింది. "ఒడ్డార్ మీన్‌చే రాష్ట్రంలోని టా మ్యుయెన్ థోమ్, టా క్రాబే ఆలయాల ప్రాంతంలో ఉన్న కాంబోడియా ఆర్మీ స్థావరాలపై థాయ్‌లాండ్ దాడులు చేసింది. తర్వాత ప్రీహ్ విహీర్ ప్రాంతంలోనూ దాడులకు పాల్పడింది. మేం ఎల్లప్పుడూ శాంతియుత పరిష్కారాలనే కోరుకుంటాం. కానీ ఇప్పుడు థాయ్‌లాండ్‌కు దీటుగా జవాబు ఇవ్వడం తప్ప మాకు మరో మార్గం కనిపించడం లేదు" అని కాంబోడియా ప్రధాన మంత్రి హున్ మనెట్ పేర్కొన్నారు. అయితే కాంబోడియాలో మరణాల సంఖ్యపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

దశాబ్దాలుగా సరిహద్దు వివాదం..

థాయ్‌లాండ్, కాంబోడియా దేశాలు అప్పట్లో ఫ్రెంచ్ వలస పాలనలో ఉండేవి. వాటికి స్వాతంత్ర్యం ఇచ్చిన సమయంలో ఇరు దేశాల మధ్య సరిహద్దులను నిర్ధారించారు. అందులో 'టా మ్యుయెన్' ఆలయాల సమూహం, ప్రీహ్ విహీర్ ఆలయం ఉన్న కొంత ప్రాంతం విషయంలో మాత్రం ఇరుదేశాల మధ్య వివాదం నెలకొంది. ఖ్మేర్ సామ్రాజ్య సరిహద్దుల ప్రకారం ఈ ఆలయాల ప్రాంతం తమదేనని కాంబోడియా వాదిస్తుంటే.. కాదు తమ భూభాగమేనని థాయ్‌లాండ్ చెబుతోంది. ప్రస్తుతానికి 'టా మ్యుయెన్' ఆలయాలు థాయ్‌లాండ్ పరిధిలో ఉన్నా.. ప్రీహ్ విహీర్ ఆలయానికి సంబంధించి పలుమార్లు ఉద్రిక్తతలు తలెత్తాయి. 1962లో ప్రీహ్ విహీర్ ఆలయ ప్రాంతం కాంబోడియాదేనంటూ అంతర్జాతీయ కోర్టు (ఐసీజే) తీర్పు ఇచ్చింది. కానీ ఆ ప్రాంతం తమదేనని థాయ్‌లాండ్ పట్టుబట్టింది. ఈ ప్రాంతం కోసం 2008లో ఇరు దేశాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. కాంబోడియా ప్రతిపాదన మేరకు ప్రీహ్ విహీర్ ప్రాంతాన్ని 'ప్రపంచ వారసత్వ సంపద'గా యునెస్కో గుర్తించడంతో వివాదం మరింత ముదిరింది. 2011 ఫిబ్రవరి-ఏప్రిల్ మధ్య చిన్నపాటి యుద్ధం జరిగింది. ఐక్యరాజ్యసమితి జోక్యంతో సద్దుమణిగింది. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య పరిస్థితి ఉప్పూనిప్పుగానే ఉంది. ఇది ఎంతగా అంటే.. కాంబోడియా మాజీ ప్రధానితో అంకుల్ అంటూ మాట్లాడినందుకు థాయ్ ప్రధాని షినవత్రా ఇటీవల పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చింది. ఈ ఏడాది మే నెలలోనూ ఇరు దేశాల సైన్యాలు పరస్పరం కాల్పులకు పాల్పడ్డాయి. కాంబోడియాకు చెందిన ఒక సైనికుడు మృతిచెందారు. తాజాగా బుధవారం సరిహద్దుల్లో మందుపాతర పేలి ఐదుగురు థాయ్‌లాండ్ సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి కొన్ని రోజుల ముందు కూడా మరోచోట మందుపాతర పేలి ముగ్గురు థాయ్ సైనికులు గాయపడ్డారు. ఈ క్రమంలో కాంబోడియా తమ భూభాగంలోకి చొచ్చుకువచ్చి మరీ మందుపాతరలు పెడుతోందని థాయ్‌లాండ్ ఆరోపిస్తోంది. గురువారం ఉదయం నుంచి పరిస్థితి మరింత ముదిరి పరస్పర దాడుల వరకు వెళ్లింది. 'టా మ్యుయెన్ థోమ్' ఆలయ ప్రాంతంలో కాంబోడియా డ్రోన్ ఒకదాన్ని గుర్తించామని, ఆ తర్వాత ఆరుగురు కాంబోడియా సైనికులు తమ స్థావరం వైపు రావడం చూశామని థాయ్ ఆర్మీ తెలిపింది. థాయ్ సైనికులు గట్టిగా అరుస్తూ హెచ్చరిస్తుండగానే.. కాంబోడియా సైనికులు కాల్పులు జరపడం మొదలుపెట్టారని పేర్కొంది.


ప్రీహ్ విహీర్: 9వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం మధ్య ఒకటో యశోవర్మన్, ఒకటో సూర్యవర్మన్, రెండో సూర్యవర్మన్ రాజులు నిర్మించిన శివాలయం ఇది. డాంగ్రెక్ పర్వత శిఖరంపైన ఉన్న ఈ ఆలయంలో శివుడిని శిఖరేశ్వరుడిగా పిలుస్తారు. సంస్కృత, ఖ్మేర్ లిపిలో ఎన్నో శాసనాలు కూడా ఉన్నాయి.


ప్రసాత్ టా మ్యుయెన్ టోట్: ఇది కూడా శివాలయమే. టా మ్యుయెన్ థోమ్‌కు ఈశాన్య దిశలో 2.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రస్తుతం ఈ ఆలయంలో శివలింగం లేదు. తర్వాతికాలంలో వైష్ణవాలయంగా, బౌద్ధ ఆరామంగా మార్చారు. ఏడో జయవర్మన్ కాలంలో ఆస్పత్రిగా, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు వేదికగా వినియోగించినట్టు ఆధారాలు ఉన్నాయి.

ఖ్మేర్ సామ్రాజ్యం నాటి శివాలయాలు

11వ శతాబ్దంలో ఆగ్నేయాసియాను పాలించిన ఖ్మేర్ హిందూ సామ్రాజ్య ఘనకీర్తిని చాటేలా ఇప్పటికీ నిలిచి ఉన్న ఆలయాలు ఎన్నో. ప్రస్తుతమున్న కాంబోడియా, థాయిలాండ్, లావోస్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాలు కూడా ఖ్మేర్ సామ్రాజ్యంలో భాగంగా ఉండేవి. ఈ మూడు దేశాల మధ్య ఉన్న దట్టమైన అడవులు, డాంగ్రెస్ పర్వత ప్రాంతాన్ని 'ఎమరాల్డ్ ట్రయాంగిల్'గా పిలుస్తారు. అక్కడ 'టా మ్యుయెన్ టెంపుల్ కాంప్లెక్స్'గా పిలిచే మూడు హిందూ ఆలయాల సమూహం ఉంది. 11వ, 12వ శతాబ్దాల్లో నాటి ఖ్మేర్ రాజులువీటిని నిర్మించారు. ప్రస్తుత కాంబోడియాలోని ప్రఖ్యాత అంగ్‌కోర్‌వాట్ ఆలయం నుంచి థాయ్‌లాండ్‌లోని ఫిమై మధ్య ఖ్మేర్ సామ్రాజ్యం నాటి ప్రధాన రహదారిపై ఈ ఆలయాల సమూహం ఉంది. ఈ ఆలయాలపై సంస్కృతం, ఖ్మేర్ లిపిలో నాటి సంగతులెన్నో చెక్కి ఉన్నాయి. వాటిని ఇంకా పూర్తిగా గుర్తించలేదు.



- **'ప్రసాత్ టా మ్యుయెన్ థోమ్':** 11వ శతాబ్దంలో రెండో ఉదయాదిత్యవర్మన్ నిర్మించిన శివాలయం. ప్రస్తుతం థాయ్, కాంబోడియా సరిహద్దుల్లో డాంగ్రెక్ పర్వతంపై ఉంటుంది. చతురస్రాకారపు పీఠంపై శివలింగం ఉంటుంది. పెద్ద గోపురంతో దక్షిణాభిముఖంగా ఆలయం నిర్మించారు.
- ప్రసాత్ టా క్రాబే (క్రాబీ): టా మ్యుయెన్ థోమ్‌కు ఆగ్నేయ దిశలో 12 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో ఉంది. ఈ ఆలయంలో ఉన్న స్వయంభూ శివలింగమని చెబుతారు. ఆలయం, పరిసరాల్లో ఇతర దేవతామూర్తులు కూడా ఉన్నాయి. ఖ్మేర్ సామ్రాజ్యంలో ఇక్కడ ప్రత్యేక, తాంత్రిక పూజలు చేసేవారనే ఆధారాలు ఉన్నాయి.

మోహన్ భాగవత్‌తో ముస్లిం ప్రముఖుల భేటీ

- రెండు మతాల మధ్య చర్చలు జరగాలని నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 24: వివిధ సమస్యల పరిష్కారానికి హిందూ, ముస్లిం మతాల మధ్య చర్చలు జరగాల్సిన అవసరం ఉందని ఇరు మతాల ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ గురువారం ఇక్కడి హరియాణా భవన్‌లో నిర్వహించిన సమావేశంలో దీనిపై అంగీకారం కుదిరింది. ఈ సమావేశానికి ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ హాజరయ్యారు. ఆయన వెంట సీనియర్ నాయకులు కృష్ణన్ గోపాల్, ఇంద్రేష్ కుమార్‌లు ఉన్నారు. ముస్లిం పక్షాన 60 ప్రముఖ ఇమామ్‌లు, ముఫ్తీలు, మదర్సాల మొహత్‌మిమ్‌లు పాల్గొన్నారు. మూడున్నర గంటల పాటు చర్చలు కొనసాగాయి. జాతీయ అంశాలపై చర్చలు జరిగాయని ఇమామ్‌ల ఆర్గనైజేషన్ చీఫ్ ఉమర్ అహ్మద్ ఇల్యాసీ చెప్పారు. మందిరాలు-మసీదులు, పూజారులు-ఇమామ్‌లు, గురుకులాలు-మదర్సాల మధ్య తరచూ సంభాషణలు జరుగుతుండాలని నిర్ణయించినట్టు తెలిపారు. దీనిని ఇమామ్ ఆర్గనైజేషన్-ఆరెస్సెలు ముందుకు తీసుకెళ్తాయని తెలిపారు.

బాంబు పేలుళ్ల కేసులో బాంబే హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే

- విడుదలైన ఖైదీలు మళ్లీ జైలుకు వెళ్లాల్సిన పనిలేదు
- ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 24: బాంబు పేలుళ్ల కేసులోని 12 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై గురువారం సుప్రీంకోర్టు స్టే విధించింది. ఇప్పటికే జైలు నుంచి విడుదలైన నిందితులపై ఈ తీర్పు ప్రభావం చూపబోదని తెలిపింది. 2006లో ముంబైలోని లోకల్ రైళ్లలో జరిగిన ఏడు పేలుళ్ల సంఘటనల్లో 180 మందికిపైగా మరణించిన కేసుల్లో కింది కోర్టు వారికి శిక్షలు విధించింది. హైకోర్టు మాత్రం.. తగిన ఆధారాలు చూపడంలో ప్రాసిక్యూషన్ దారుణంగా విఫలమయినందున నిందితులు నేరం చేశారని నమ్మడం చాలా కష్టమని పేర్కొంటూ ఈ నెల 11న తీర్పు చెప్పింది. దీన్ని సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం మరుసటి రోజునే సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. విచారణ జరిపిన జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ఆ తీర్పుపై స్టే ఇచ్చింది. అయితే విడుదలైన ఖైదీలు మళ్లీ జైలుకు వెళ్లాల్సిన పనిలేదని స్పష్టం చేసింది. ఈ తీర్పును ఇతర కేసుల్లో వాదనలకు ఒక ఉదాహరణగా చూపించకూడదని పేర్కొంది. ఈ తీర్పు పెండింగ్‌లో ఉన్న ఇతర కేసులపై ప్రభావం చూపుతుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పడంతో వాదనల్లో దీనిని ఉదాహరణగా ప్రస్తావించకూడదని ధర్మాసనం తెలిపింది. అందువల్ల ఆ అంశం వరకు మాత్రమే స్టే ఇస్తున్నట్టు పేర్కొంది.

జన్మతః పౌరసత్వం రద్దు ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమే..

- అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు

వాషింగ్టన్, జూలై 24: జన్మతః వచ్చే పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వు.. రాజ్యాంగ విరుద్ధమని ఫెడరల్ అప్పీల్స్ కోర్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా దాని అమలును నిలిపేస్తూ గతంలో దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ మేరకు శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన యూఎస్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు త్రిసభ్య ప్యానెల్ బుధవారం తీర్పు వెలువరించింది. 'అమెరికాలో పుట్టిన చాలా మంది పిల్లలకు పౌరసత్వాన్ని నిరాకరిస్తూ తెచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమని జిల్లా కోర్టు సరిగ్గానే నిర్ధారించింది. మేం కూడా పూర్తిగా అంగీకరిస్తున్నాం' అని పేర్కొంది. అంతకుముందు న్యూహ్యాంప్‌షైర్ ఫెడరల్ కోర్టు ఇదే రకమైన తీర్పునివ్వగా.. దేశాన్ని ప్రభావితం చేసే ఉత్తర్వులను దిగువ కోర్టులు ఇవ్వలేవంటూ సుప్రీంకోర్టు నిషేధాజ్ఞలు విధించింది. అయితే ఈ కేసు సుప్రీంకోర్టు పేర్కొన్న మినహాయింపుల్లో ఒకదానికి కిందకు వస్తుందంటూ తేల్చిన యూఎస్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు తాజా తీర్పునిచ్చింది. ఈ నిర్ణయంపై ట్రంప్ పరిపాలన విభాగం సుప్రీం కోర్టును ఆశ్రయించే అవకాశముంది.

ఉద్యోగాల్లో భారతీయుల్ని నియమించుకోవద్దు

అమెరికన్లకే ప్రాధాన్యతనివ్వాలి: ట్రంప్

వాషింగ్టన్, జూలై 24: టెక్ ఉద్యోగాల్లో అమెరికన్లకే ప్రాధాన్యతనివ్వాలని, భారతీయులను నియమించుకోవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. వాషింగ్టన్‌లో జరిగిన ఏఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ టెక్ సంస్థలకు సున్నితంగా సూచనలు చేశారు. తాను ముందు నుంచి జపిస్తున్న 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. టెక్ కంపెనీల గ్లోబలిస్ట్ మైండ్‌సెట్‌ను ఆయన విమర్శించారు. "ఇప్పుడు విదేశీయులను నియమించుకోవడాన్ని ఆపేయాలి. అమెరికన్లకు ఉద్యోగాలివ్వాలి. అమెరికన్లు తమను పట్టించుకోవడం లేదనే భావనలో ఉన్నారు. దేశంలో లభించే స్వేచ్ఛను వాడుకుంటున్న చాలా టెక్ కంపెనీలు.. ఇతర దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నాయి. నా పాలనలో ఈ సంస్కృతికి ముగింపునిస్తాను" అని వ్యాఖ్యానించారు. అమెరికాకు చెందిన బడా టెక్ కంపెనీలు చైనాలో కంపెనీలను స్థాపిస్తూ.. భారతీయులను ఉద్యోగాల్లో నియమించుకుంటున్నాయని, ఐర్లాండ్‌ను అడ్డుపెట్టుకుని తక్కువ లాభాలు చూపుతూ స్వేచ్ఛను అనుభవిస్తున్నాయని విమర్శించారు. "ఈ విషయం మీకు(టెక్ కంపెనీల యాజమాన్యాలు) తెలుసు. ఇక్కడి(అమెరికా) ప్రజల అవకాశాలను పట్టించుకోవడం లేదు. నిర్లక్ష్యం చేస్తున్నారు. ట్రంప్ పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయి. ఏఐ రేసులో విజయం సాధించాలంటే.. సిలికాన్ వ్యాలీలో సరికొత్త దేశభక్తి అవసరం. ఇక్కడి టెక్ కంపెనీలు దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. మీరూ అదే చేయాలి" అని పిలుపునిచ్చారు.

రష్యాలో విమాన ప్రమాదం.. 49 మంది దుర్మరణం

మాస్కో, జూలై 24: రష్యా తూర్పు సరిహద్దుల్లోని అమూర్‌లో ఓ ప్రయాణికుల విమానం కుప్పకూలిన ఘటనలో 49 మంది దుర్మరణంపాలయ్యారు. వీరిలో 43 మంది ప్రయాణికులు కాగా.. మిగతా ఆరుగురిలో విమాన పైలట్లు, సిబ్బంది ఉన్నారు. మృతుల్లో ఐదుగురు చిన్నారులు కూడా ఉన్నట్లు రష్యా మీడియా పేర్కొంది. ప్రమాదానికి కారణాలేంటనేది ఇంకా తెలియరాలేదని అధికారులు చెప్పారు. పైలట్ తప్పిదమా? లేక.. సాంకేతిక లోపమా? అన్నది దర్యాప్తులో తేలుతుందన్నారు. గురువారం ఉదయం బ్లాగోవెష్‌చెన్స్క్ నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండా ప్రాంతానికి బయలుదేరిన అంగారా ఎయిర్‌లైన్‌కు చెందిన ఏఎన్-24 విమానంతో తొలుత ల్యాండింగ్‌కు ప్రయత్నించగా.. పరిస్థితులు అనుకూలించలేదు. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే క్రమంలో ఏటీసీ నుంచి సిగ్నళ్లు తెగిపోయాయి. దీంతో అధికారులు ఎమర్జెన్సీ సేవలకు సిద్ధమయ్యారు. ఆ తర్వాత ఆ విమానం తన గమ్యస్థానం టిండాకు 15 కిలోమీటర్ల దూరంలో కుప్పకూలినట్లు గుర్తించారు. ఆ ప్రాంతంలో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రమాదం ధాటికి విమానం పూర్తిగా కాలిపోయింది. రెస్క్యూ బృందాలు ఆ ప్రాంతానికి చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ల్యాండింగ్ సమయంలో ప్రతికూల వాతావరణం, పైలట్ తప్పిదం ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

బ్రిటన్‌లో సుంకాల్లేవ్

(మొదటిపేజీ తరువాయి)

నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో గురువారం ఇరుదేశాల వాణిజ్య శాఖల మంత్రులు పీయూష్ గోయెల్, జోనాథన్ రెనాల్డ్స్ సంతకాలు చేశారు. లండన్‌లోని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ అధికారిక నివాసంలో ఈ ఒప్పందం జరిగింది. దీని ద్వారా భారత్-బ్రిటన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడంతోపాటు ఇరు దేశాల మధ్య ఏటా దాదాపు రూ.2.94 లక్షల కోట్ల వాణిజ్యం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2030నాటికి ఇది రూ.9.75 లక్షల కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. 2020లో యూరోపియన్ యూనియన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత బ్రిటన్ చేసుకున్న భారీ వాణిజ్య ఒప్పందం ఇదేకావడం గమనార్హం. మూడేళ్ల చర్చలు జరిగిన తర్వాత ఇరుదేశాలు సీఈటీఏపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందంతో భారత్‌కు చెందిన అన్ని రకాల వస్తువులకు బ్రిటన్ మార్కెట్‌లో ప్రవేశం దక్కడమే గాక, పన్నుల భారం కూడా తప్పనుందని అధికారులు తెలిపారు. 99 శాతం భారతీయ ఉత్పత్తులకు యూకే మార్కెట్‌లో పన్నులు ఉండవని పేర్కొన్నారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ.. "ఇరు దేశాలకు ఇదో చరిత్రాత్మక దినం. పరస్పర చిత్తశుద్ధికి నిదర్శనం.ఇలాంటి శుభసందర్భంలో మీకు స్వాగతం పలకడం నాకెంతో సంతోషంగా ఉంది" అని మోదీకి అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్-బ్రిటన్‌లు సహజ భాగస్వాములని చెప్పారు. ఇరుదేశాలు చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాయన్నారు. తాజా ఒప్పందంతో భారతీయ దుస్తులు, పాదరక్షలు, వజ్రాలు, ఆభరణాలు, సముద్ర ఆహారోత్పత్తులు, ఇంజనీరింగ్ వస్తువులకు యూకే మార్కెట్‌లో మరింత చోటు లభించనుందని పేర్కొన్నారు. "ఈ ఒప్పందం ప్రత్యేకించి భారత యువత, రైతులు, మత్స్యకారులతోపాటు ఎంఎస్ఎంఈ రంగానికి లబ్ధి చేకూర్చుతుంది. అదే సమయంలో యూకేలో తయారయ్యే వైద్య పరికరాలు, ఏరోస్పేస్ విడిభాగాలువంటి ఉత్పత్తులు భారతీయులకు అందుబాటు ధరల్లో లభిస్తాయి" అని మోదీ చెప్పారు. "భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్-2035 లక్ష్యంగా సాగుతున్నాం. ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాల్లో కలిసి సాగుతాం. బ్రిటన్, భారత్ భాగస్వామ్యం కొత్త పుంతలు తొక్కనుంది. ఆరు బ్రిటన్ యూనివర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. ఆర్థిక, సాంకేతిక రంగాల్లోనూ కలిసి పనిచేయాలని నిర్ణయించాం" అని మోదీ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిటన్ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. బ్రిటిష్ గడ్డపై ఖలిస్థానీ అనుకూల శక్తులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని పరోక్షంగా వారికి చురకలంటించారు. ప్రపంచదేశాల మధ్య శాంతిని నెలకొల్పే విషయంలో భారత్-బ్రిటన్‌లు కలిసి ముందుకు సాగుతాయని మోదీ చెప్పారు. స్టార్మర్‌ను భారత పర్యటనకు రావాలని ఆహ్వానించారు.

ఇరుదేశాలకు భారీ ప్రయోజనం: స్టార్మర్

వాణిజ్య ఒప్పందంతో బ్రిటన్, భారత్‌కు భారీ ప్రయోజనాలు కలుగుతాయని స్టార్మర్ చెప్పారు. ఈ ఒప్పందం ఉద్యోగాలకు, వ్యాపారాలకు మంచిదని.. పన్నులు తగ్గిపోతాయని, వాణిజ్యం చౌకగా, వేగంగా, సులభంగా మారుతుందని పేర్కొన్నారు. ఒప్పందం అమల్లోకివస్తే.. యూకే ఉత్పత్తులపై భారత్ ప్రస్తుతం విధిస్తున్న సగటు పన్ను 15 నుంచి 3 శాతానికి తగ్గనుందని బ్రిటన్ అధికారులు తెలిపారు. సాఫ్ట్ డ్రింక్స్, చాక్లెట్లు, కాస్మెటిక్స్, కార్లు, వైద్య పరికరాలు వంటివి బ్రిటన్ నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఈ ఒప్పందం వల్ల విస్కీ, కార్లు, ఇతర ఉత్పత్తులను ఎగుమతి చేసే బ్రిటన్ తయారీదారులకు మేలు చేకూరనుంది. భారత్, బ్రిటన్‌లు రక్షణ పారిశ్రామిక రోడ్‌మ్యాప్‌కు ఆమోదం తెలిపాయి.

ఒప్పందంలో కీలక అంశాలు..

భారత్‌కు చెందిన అనేక వ్యవసాయ ఉత్పత్తులకు యూకే మార్కెట్లో పన్నులు ఉండవు. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పసుపు, మిరియాలు, యాలకులు, శుద్ధిచేసిన ఆహారం, మామిడి గుజ్జు, పచ్చళ్లు, పప్పులు వంటి వాటికి ఎలాంటి పన్నులూ వేయరు. మఖానా, షాహీలిచి, అరకు కాఫీ, కశ్మీరీ కుంకుమపువ్వు వంటివి యూకే మార్కెట్‌లో మరింత ఎక్కువగా అమ్ముడుపోతాయని, తద్వారా సంబంధిత రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు. పన్నులు లేకపోవడంవల్ల మూడేళ్లలో బ్రిటన్‌కు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 20శాతం పెరుగుతాయని అంచనా. డెయిరీ ఉత్పత్తులు, వంట నూనెలను ఈ ఒప్పందం నుంచి మినహాయించారు. ఓట్స్‌కూ పన్ను రాయితీలు లేవు. ఫార్మా, రసాయనాలు, ప్లాస్టిక్స్, క్రీడా ఉత్పత్తులు, బొమ్మలు, వజ్రాలు, ఆభరణాలు వంటి వాటికీ భారీగా లబ్ధి చేకూరనుంది.

ధన్‌ఖడ్‌పై ఒక దశలో అభిశంసన యోచన

న్యూఢిల్లీ, జూలై 24: ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ పట్ల కొన్నాళ్లుగా బీజేపీ తీవ్ర ఆగ్రహంతో ఉందని తెలుస్తోంది. ధన్‌ఖడ్ అనారోగ్య కారణాలతో రాజీనామా చేశానని చెబుతున్నా మొదటి నుంచీ అందరూ వేరే కారణం ఉందని ఊహిస్తూనే ఉన్నారు. దాన్ని బలపరిచే విధంగా బుధవారం మరో సంఘటన జరిగింది. మాజీ ఉప రాష్ట్రపతికి రాజ్యసభ గౌరవప్రదమైన వీడ్కోలు ఇవ్వాలని పార్లమెంటులో సభా వ్యవహారాల సలహా సంఘం సమావేశంలో కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ప్రతిపాదించారు. గురువారం జరిగే తమిళనాడు ఎంపీల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పేరు కూడా చేర్చాలని కోరారు. బీజేపీ మౌనం వహించింది. ఇతర పార్టీలు కూడా ఎందుకో జైరాం ప్రతిపాదనకు మద్దతు తెలపలేదు. దాంతో ధన్‌ఖడ్ వీడ్కోలు లేకుండానే వానప్రస్థానానికి వెళ్లాల్సి వస్తోంది. గత ఏడాది నుంచే బీజేపీకి ఆయనకు మధ్య ఎడం పెరిగినట్లు సమాచారం. పైగా, న్యాయవ్యవస్థపై ఆయన కొద్ది నెలలుగా తీవ్ర స్థాయిలో విరుచుకు పడుతున్నారు. జస్టిస్ వర్మ వ్యవహారం జరిగినపుడూ న్యాయ వ్యవస్థపై కీలక ప్రశ్నలు సంధించారు. ఈ నేపథ్యంలో ఆయనతో ఇబ్బందులు ఉంటాయని గ్రహించిన మోదీ సర్కారు పార్లమెంటు సమావేశాలకు 4 రోజుల ముందు నుంచే ఆయనతో సంప్రదింపులు జరుపుతోంది. పార్టీ అధ్యక్షుడు నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మేఘ్వాల్ రాజ్యసభ చైర్మన్‌గా ఉన్న ధన్‌ఖడ్‌ను కలిశారు. జస్టిస్ వర్మ తొలగింపునకు లోక్‌సభలో తాము పిటిషన్ పెడుతున్నామని, రాజ్యసభలో విపక్షాలుపెట్టే పిటిషన్లను ముందుకు తీసుకెళ్లకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అయితే, సోమవారం కాంగ్రెస్ ఇచ్చిన అభిశంసన నోటీసు విషయంలో ధన్‌ఖడ్ అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. పైగా సభలో పహల్గావ్ దాడి గురించి విపక్ష నేత ఖర్గేకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ప్రభుత్వం తరఫున మాట్లాబోయిన నడ్డాను మాట్లాడనివ్వలేదు. దాంతో నడ్డా తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. జస్టిస్ వర్మపై కాంగ్రెస్ పెట్టిన తీర్మానాన్ని అనుమతిస్తానని ఉపరాష్ట్రపతి అధికారికంగా ప్రకటించడంతో అప్పటికప్పుడు ఆయనను అభిశంసించేందుకు కూడా ఎన్డీఏ పక్షం సన్నద్ధమైందని సమాచారం. ఆయనపై ఒత్తిడి తేవడమే అప్పటికి బీజేపీ లక్ష్యం. మొదట్లో కాంగ్రెస్‌తో ఉప్పునిప్పుగా ఉన్న ధన్‌ఖడ్ వైఖరి గత డిసెంబరు నుంచి మారిందని బీజేపీ భావిస్తోంది. డిసెంబరులో కాంగ్రెస్ ధన్‌ఖడ్ మీద అభిశంసనతీర్మానం పెట్టింది. అయితే, దానిపై చర్చ వరకు తీసుకెళ్లే ఉద్దేశం లేకనే లొసుగులతో తీర్మానాన్ని తయారు చేసింది. దాంతో రాజ్యసభ ఆ తీర్మానాన్ని తిరస్కరించింది. అప్పటి నుంచి ధన్‌ఖడ్ కాంగ్రెస్ పట్ల మెతగ్గా ఉన్నారని పేరొచ్చింది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ యాదవ్‌పై గతంలో కాంగ్రెస్ పెట్టిన అభిశంసన తీర్మానం వ్యవహారాన్ని రచ్చకాకుండా త్వరగా ముగించాలని కేంద్రం అడిగితే ధన్‌ఖడ్ నానుస్తూ వచ్చి సోమవారం నోటీసు చెల్లదని ప్రకటించారు. ఇదీ బీజేపీ ఆగ్రహానికి ఒక కారణం. ఇటీవల రైతుల సమస్యలపై ఒక వేదికపై వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తప్పుబట్టారు. ఇదంతా ఒక ఎజెండా ప్రకారం జరుగుతోందని బీజేపీలో అనుమానాలున్నాయి. దీంతో ఆయనను బలవంతంగా తప్పించినట్లుగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఉపరాష్ట్రపతి హోదాలో గొంతెమ్మ కోర్కెలు కోరారని మీడియాల్లో కథనాలు వచ్చాయి. ఇటీవల అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ భారత్‌కు వచ్చినపుడు ఉపాధ్యక్షుడి హోదాలో ఆయన్ను కలుస్తానని ధన్‌ఖడ్ పట్టుబట్టారట. మంత్రుల కార్యాలయాల్లో రాష్ట్రపతి, ప్రధాని ఫొటోలతోపాటు తన ఫొటో పెట్టాలని డిమాండ్ చేసేవారని, వాహనశ్రేణిలో మెర్సిడెజ్ బెంజ్‌కార్లు కావాలన్నారని కథనాలను ప్రచారం చేశారు. మరోవైపు ఎన్డీఏ కొత్త ఉపరాష్ట్రపతి రేసులో బిహార్ మహా నాయకుడు కర్పూరీ ఠాకూర్ తనయుడు, రాష్ట్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ పేరు గట్టిగా వినవస్తోంది.

ముసురేసింది!

- బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం
- నేడు వాయుగుండంగా మారే అవకాశం
- రానున్న మూడు రోజులూ కోస్తా, సీమల్లో వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తర బంగాళాఖాతం పరిసరాల్లో గురువారం ఏర్పడిన అల్పపీడనం సాయంత్రానికే తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో శుక్రవారం నాటికి మరింత బలపడి వాయుగుండంగా మారనుందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో కోస్తాలో ఎక్కువచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, ఉత్తరకోస్తాలో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాల్లో భారీ వర్షాలు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం ఉత్తరాంధ్రలో అక్కడక్కడా భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

- పోలవరం నుంచి 2,37,203 క్యూసెక్కుల విడుదల

పోలవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. దీంతో గోదావరి నీటిమట్టం గురువారం నాటికి అనూహ్య రీతిలో పెరిగింది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 2,37,203 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

'లేపాక్షి'కి యునెస్కో శాశ్వత గుర్తింపునకు అడుగులు..

- నివేదిక పంపాలని అధికారులకు పర్యాటక శాఖ ఆదేశం


లేపాక్షి వీరభద్రస్వామి ప్రధాన ఆలయం

హిందూపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయానికి యునెస్కో వారసత్వ కట్టడంగా శాశ్వత గుర్తింపు కోసం నామినేషన్ డోసియర్‌ను తయారుచేసి, నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి తక్షణం పంపాలని పర్యాటక శాఖ అదనపు కార్యదర్శి నరసింహారెడ్డి స్థానిక అధికారులకు ఆదేశాలు జారీచేశారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండల కేంద్రంలోని ఈ ఆలయానికి ఈ నెలాఖరులో జరిగే యునెస్కో సమావేశంలో ప్రపంచ వారసత్వ కట్టడంగా శాశ్వత గుర్తింపు తెచ్చేందుకు తగిన ఆధారాలు, ఫొటోలను వెంటనే పర్యాటకశాఖ అధికారులకు పంపాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. శిల్పకళలు, చిత్రకళలకు నిలయమైన లేపాక్షి.. గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా వెలుగొందుతోంది. ఇప్పటికే ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో తాత్కాలిక గుర్తింపు పొందింది. దీనిని 2026, 2027, 2028లో నామినేషన్ డోసియర్‌లో ప్రాథమిక అంచనా కోసం వెంటనే నివేదికలు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఢిల్లీలో ఉన్న ప్రపంచ వారసత్వ విభాగం డైరెక్టర్, ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు నామినేషన్ డోసియర్‌ను పంపనున్నారు. నివేదికలో ఆలయ వివరాలు, ఫొటోలను పొందుపరుస్తారు.

7 పంపులు.. 2,532 క్యూసెక్కులు

హంద్రీనీవాలో కృష్ణమ్మ పరుగులు


- లైనింగ్ పనులతో పెరిగిన కాలువల సామర్థ్యం
- జీడిపల్లి జలాశయానికి చేరిన జలాలు
- త్వరలోనే కుప్పం బ్రాంచి కెనాల్‌కు నీరు
- సాకారమవుతున్న చంద్రబాబు సంకల్పం

నాడు | నేడు


2024 సెప్టెంబరు 21న కర్నూలు జిల్లా పత్తికొండ సమీపంలో హంద్రీనీవా ప్రధాన కాలువ దుస్థితి. గట్టుపై దట్టంగా అలుముకున్న ముళ్ల పొదల మధ్య కృష్ణా జలాల ప్రవాహం


కూటమి ప్రభుత్వం వచ్చాక విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేయడంతో సాఫీగా సాగిపోతున్న కృష్ణా జలాలు

కర్నూలు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జీవనాడి హంద్రీనీవా ప్రధాన కాలువను విస్తరించి పూర్తిస్థాయి ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెంచాలనే సీఎం చంద్రబాబు సంకల్పం సాకారం అవుతోంది. గురువారం నాటికి నంద్యాల జిల్లా బ్రాహ్మణకొట్కూరు సమీపంలో హంద్రీనీవా పంపింగ్ స్టేషన్ (పీఎస్-2) నుంచి ఏడు పంపుల ద్వారా కృష్ణా జలాలను ఎత్తిపోస్తున్నారు. 2,532 క్యూసెక్కులను లిఫ్ట్ చేస్తున్నారు. ఈ స్థాయిలో నీటిని తీసుకోవడం ఇదే ప్రథమం. శ్రీశైలం ఎగువన 40 టీఎంసీలు ఎత్తిపోసి ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లోని 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల మందికి తాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో 1985-90 మధ్యలో అప్పటి సీఎం ఎన్టీఆర్ హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. 2004 తరువాత పనుల్లో వేగం పుంజుకుంది. 2012 నాటికి ఫేజ్-1 కింద ప్రధాన కాలువ, లిఫ్టులు, జలాశయాలు పూర్తిచేసి ట్రైల్‌రన్ వేశారు. 3,850 క్యూసెక్కులు ఎత్తిపోయాలన్నది లక్ష్యం కాగా 1,800 నుంచి 2 వేల క్యూసెక్కులకు మించి తీసుకోలేని పరిస్థితి ఉండేది. పూర్తి సామర్థ్యంతో నీటిని ఎత్తిపోయాలని 2017-18లో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.1,030 కోట్లతో విస్తరణ చేపడితే, వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆపేసింది. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఫేజ్-1 కింద నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 0/0 నుంచి 216.300 కిలోమీటర్ల వరకు, ఫేజ్-2 కింద 216.300 కిలోమీటర్ల నుంచి చిత్తూరు జిల్లాలో 400.500 కిలోమీటర్ల వరకు ప్రధాన కాలువతోపాటు కుప్పం, పుంగనూరు బ్రాంచి కెనాల్ విస్తరణను రూ.1,970 కోట్లతో చేపట్టారు. మార్చి 15న మొదలు పెట్టి జూలై 15 నాటికి 120 రోజుల్లో కాలువ విస్తరణలో భాగంగా మట్టి పనులు 90-95 శాతం, లైనింగ్, షాట్‌క్రెటింగ్ పనులు 45 శాతం పూర్తిచేసి రికార్డు నెలకొల్పారు. ఈ నెల 17న సీఎం చంద్రబాబు కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి పంపులు ఆన్ చేశారు. హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేశారు. మొదట ఒక పంపును మాత్రమే ఆన్ చేసి 336 క్యూసెక్కులు ఎత్తిపోశారు. క్రమంగా గురువారం నాటికి దానిని ఏడు పంపులకు పెంచారు. త్వరలోనే 12 పంపుల ద్వారా 3,850 క్యూసెక్కులు ఎత్తిపోసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం తెల్లవారు జామున అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయానికి కృష్ణా జలాలు చేరుకున్నాయి. 10-15 రోజుల్లో శ్రీసత్యసాయి జిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లి జలాశయానికి జలాలు చేరుతాయి. అక్కడి నుంచి కుప్పం, పుంగనూరు బ్రాంచి కాలువకు కూడా నీటిని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు హంద్రీనీవా ప్రాజెక్టు అనంతపురం సీఈ నాగరాజు, కర్నూలు సర్కిల్-1 ఎస్‌ఈ పాండురంగయ్య తెలిపారు.


హంద్రీనీవా ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్ (పీఎస్)-2 నుంచి ఏడు పంపుల ద్వారా కృష్ణా జలాల ఎత్తిపోత

ఆగస్టు 2, 3 తేదీల్లో విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాతకోత్సవాలు

- హాజరుకానున్న గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్


ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ వీసీ ఆచార్య నాగభూషణం తదితరులు

గుంటూరు (విద్య) జూలై 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని వడ్లమూడిలో ఉన్న విజ్ఞాన్ విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవం ఆగస్టు 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య పి. నాగభూషణ్ గురువారం వెల్లడించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రాలను యూనివర్సిటీలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆచార్య పి. నాగభూషణ్ మాట్లాడుతూ... ఆగస్టు 3వ తేదీన విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవాలను కలిపి సంయుక్తంగా నిర్వహిసున్నట్లు తెలిపారు. ఆగస్టు 2న జరిగే స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ హాజరవుతున్నారని తెలిపారు. గౌరవ అతిథులుగా హైదరాబాద్‌లోని ఐ ల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమాండూరి రామాచారి హాజరవుతున్నారని, వీరికి గౌరవ డాక్టరేట్‌లు అందజేయనున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు డిగ్రీలు అందజేయనున్నట్లు వివరించారు. వేడుకల్లో బ్రాంచ్‌ల వారీగా అత్యుత్తమ ప్రతిభ చూపిన 26 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తామన్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ అజయ్ రస్తోగి


తిరుమల ఆలయం ముందు జస్టిస్ అజయ్ రస్తోగి

తిరుమల, జూలై 24(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుమల
శ్రీ TT శాఖ, తిరుమల
Roc.No.TTD-14023(31)/17/2024-AEO (VQC)- TTD
పని పేరు: VQC-II, తిరుమల వద్ద పని చేయుటకు 24 నెలలు (02 సంవత్సరాలు) కాలానికి కాలానుగతంగా శాఖ ద్వారా కేటాయించబడిన విధంగా తిరుమల, VQC-II కంపార్ట్‌మెంట్ వద్ద Q-లైన్లు నిర్వహించు విధుల కొరకు VQC-II, TTD, తిరుమల వద్ద పనులు నిర్వర్తించుటకు 23 నంబర్ల నైపుణ్యం లేని పని సిబ్బంది సరఫరా. NIT డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 24.07.2025న సా.5.00 గం.లకు. NIT డౌన్‌లోడ్ ముగింపు తేది: 05.08.2025న మ.1.00 గం.లకు. నియమనిబంధనలతో కలుపుకుని తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు http://tender.apeprocurement.gov.in కు లాగాన్ కాగలరు. విచారణ కొరకు ఫోన్ నం: 0877-22263758/ 2263592, 9849575952లను సంప్రదించగలరు.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.143), Dt: 24.07.2025 సం/- కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
సుమారు రూ. 206.33 లక్షల విలువ గల పనులకు అనగా నిట్ నెం.19 to 35/ఇ.ఇ/ఆర్ & బి/నరసరావుపేట/2025-26, తేది: 19.07.2025 ద్వారా ఆహ్వానించబడుచున్నవి. వివరములు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.apeprocurement.gov.in నందు ది.28.07.2025, సా.3గం.ల నుండి 11.08.2025, సా.3గం.ల వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజన్, నరసరావుపేట
DIPR RO.No: 17087/CL/ADVT/1/1/2021-22, తేది: 24.07.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నం.60 to 74/TO/2025-26, తేది: 23.07.2025
కృష్ణా జిల్లా పరిధిలో ZP 12% DW, ZP 15th Finance నిధుల నుండి త్రాగునీటి సరఫరా పని నిర్మాణమును (5 ప్యాకేజీ) గాను పనులు & CC Drains 10 పనులు మంజూరు కాబడిన మొత్తం 15 పనులకు గానూ రూ.231.70 లక్షల అంచనాతో చేపట్టుటకు టెండర్లు కోరడమైనది. టెండరు డాక్యుమెంట్లు ది.29.07.2025 ఉ.11 గం.ల నుండి అందుబాటులో వుండును. వివరాలను https://tender.apeprocurement.gov.in నందు చూడగలరు. ఫోన్: 9100121319.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స. విభాగము, మచిలీపట్నం
DIPR RO.No: 17092/CL/ADVT/1/1/2021-22 తేది: 24.07.2025

DEPARTMENT OF TECHNICAL EDUCATION (On behalf of APSCHE)
APEAPCET-2025 ADMISSIONS (M.P.C STREAM)
FINAL PHASE NOTIFICATION
CERTIFICATE VERIFICATION & OPTION EXERCISING FOR WEB BASED COUNSELLING
The qualified and eligible candidates of APEAPCET-2025 desirous of seeking admission into B.E/B.Tech Courses are informed that the web counselling process comprising payment of processing fee cum registration, online certificate verification and option entry will be conducted from **27-07-2025 to 01-08-2025**. For detailed notification (containing the list of Help Line Centers, Certificates to be uploaded for online verification and schedule of counselling) visit website **https://cets.apsche.ap.gov.in**
Date: 24-07-2025
Place: Mangalagiri
Sd/- G.Ganesh Kumar, IAS
Convener & DTE

సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి కన్నుమూత


సురేఖ పాణిగ్రాహి

పలాస రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో బడుగు, బలహీనవర్గాల కోసం పోరాటం చేసి అశువులు బాసిన విప్లవ కవి, కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి(83) గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆమె గత కొంత కాలంగా వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన సుబ్బారావు పాణిగ్రాహి 1968లో జరిగిన శ్రీకాకుళం గిరిజన సాయుధ పోరాటంలో మృతి చెందారు. అప్పటి నుంచి సురేఖ పాణిగ్రాహి.. పోరాటాల్లో పాల్గొనకపోయినా తన భర్త అడుగుజాడలు, సైద్ధాంతిక భావాలను అర్థం చేసుకుంటూ జీవనం సాగించారు. సురేఖ పాణిగ్రాహి మృతి పట్ల సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీతో పాటు వివిధ విప్లవ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు ఆమె అంత్యక్రియలు జరగనున్నాయని బంధువులు చెప్పారు. అనంతరం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో సంతాప సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

మావోయిస్టు మోట్టూరు జోగారావు తల్లి మృతి

వజ్రపుకొత్తూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మోట్టూరు జోగారావు తల్లి చిన్నపిల్లమ్మ (85) గురువారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా బాతుపురంలో మృతి చెందారు. ఆమె వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. చిన్నపిల్లమ్మకు ఇద్దరు కుమార్తెలు, నలుగురు కుమారులు కాగా రెండో కుమారుడు జోగారావు 25 ఏళ్ల క్రితం మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

సవాళ్లను స్వీకరించాలి

- ఆసక్తి ఉన్న రంగాల్లో ఎదగాలి
- వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఏపీ టాప్: గవర్నర్ అబ్దుల్ నజీర్


ఎన్జీరంగా వర్సిటీ స్నాతకోత్సవంలో పంజాబ్ ఎన్‌ఆర్‌ఐ కమిషన్ సభ్యుడు వేణుప్రసాద్‌తో కలిసి విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఉంగుటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సవాళ్లను స్వీకరించడం అలవర్చుకోవాలని, ఆసక్తి ఉన్న రంగాలను ఎంపిక చేసుకుని ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర గవర్నర్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవాన్ని కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గవర్నర్ నజీర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించ గా...పంజాబ్ ఎన్‌ఆర్‌ఐ కమిషన్ సభ్యుడు, ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.వేణుప్రసాద్ స్నాతకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా 46 మందికి డాక్టరేట్‌లు, 196 మందికి పోస్ట్‌గ్రాడ్యుయేట్, 1420 మంది గ్రాడ్యుయేట్లకు బంగారు, వెండి పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు.

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఏపీ టాప్

గవర్నర్ నజీర్ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో 8.8 శాతం వృద్ధి రేటు సాధించి 2024-25లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. జనాభా అవసరాలను తీర్చడానికి ఇంకా ఎక్కువ మొత్తంలో ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ జనాభాలో దాదాపు 46.1 శాతం మందికి వ్యవసాయ రంగం జీవనోపాధిని కల్పిస్తోందన్నారు. తృణ ధాన్యాలు, చిరుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించిన భారతదేశం పోషకాహారలోప సమస్యను నివారించడంలో కీలకమైన పప్పు ధాన్యాల ఉత్పత్తిపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిరంతర కృషి ఫలితంగా 2023-24లో 25 మేలైన పంట రకాలు వచ్చాయన్నారు. మార్కెట్ డిమాండ్ మేరకు సరైన పంటలను ఎంపిక చేసి సాగు చేయడం ద్వారా రైతులు మెరుగైన ధరలను పొందాలని సూచించారు.

ఐఐటీలకు దీటుగా..

పంజాబ్ రాష్ట్ర ఎన్‌ఆర్‌ఐ కమిషన్ సభ్యుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎ.వేణుప్రసాద్ మాట్లాడుతూ బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థిగా తాను అభ్యసించిన విద్య ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి, అత్యున్నత సామాజిక సేవకు ఎంతగానో దోహదపడిందన్నారు. విశ్వవిద్యాలయం ఉన్నతమైన ఐఐటీలతో పోటీపడి, వాటికి దీటుగా సత్ఫలితాలు సాధిస్తోందన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రతిభను చాటాలన్నారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు, ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి: సీఐటీయూ

- నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింహారావు డిమాండ్ చేశారు. గుంటూరులో జరుగుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల్లో రెండో రోజు గురువారం ఆయన పాల్గొన్నారు. ఆగస్టు 15వ తేదీ లోపు సంక్షేమ బోర్డు పనిచేయడం ప్రారంభించకపోతే నిరసనలు నిర్వహిస్తామని, సెప్టెంబరు 15న లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద సామూహిక ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు తదతరులు ప్రసంగించారు. కాగా.. మహాసభల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా రమణరావు, ఆర్.వి.నరసింహారావు, కోశాధికారిగా గోపాలరావు, ఉపాధ్యక్షులుగా అనసూయ, రాజ్ గోపాల్, సహాయ కార్యదర్శులుగా సుందరబాబు, అప్పారావుతో పాటు 17 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గాన్ని, 63 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.

ఏపీ ఎయిమ్స్ 2.0

- రైతులకు సమగ్ర సమాచారమిచ్చే యాప్ ఆవిష్కరణ

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు సమగ్ర సమాచారాన్ని అందించే 'ఏపీ ఎయిమ్స్ 2.0' యాప్‌ను వాసర్ ల్యాబ్ అభివృద్ధి చేసింది. గురువారం మంగళగిరిలోని వ్యవసాయ శా సంచాలకుల కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఈ యాప్‌ను ఆవిష్కరించారు. సమాచార సేకరణలో అత్యంత శ్రద్ధ వహించి, రైతులకు సమగ్ర సమాచారం ఇచ్చేలా ఈ యాప్ రూపొందించినట్లు తెలిపారు.వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి క్షేత్రస్థాయిలోని వ్యవసాయ అధికారులకు ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. వచ్చే రబీ సీజన్ నుంచి సమగ్ర సమాచార సేకరణ తర్వాత రైతులకు అందుబాటులోకి వస్తుందన్నారు. వాతావరణం, విత్తనం, మార్కెట్ ధరలు, తదితర సమాచారాన్ని ఈయాప్ ద్వారా రైతులకు అందించనున్నట్లు చెప్పారు.

పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగర శివారు తాడి-దువ్వాడ స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 26, 28, 30 తేదీల్లో విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), రాజమండ్రి-విశాఖ మెము ప్యాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము ప్యాసింజర్ (67286), కాకినాడ-విశాఖ మెము ప్యాసింజర్ (17267), విశాఖ-కాకినాడ మెము ప్యాసింజర్ (17268), ఈ నెల 26, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875)లను రద్దు చేశామని పేర్కొన్నారు.

120 ఏళ్ల నమ్మకం
నమ్మకం, ఐక్యత, వికాసం
మా వారసత్వం



కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ
A Government of India Undertaking
Together We Can

ప్రపంచవ్యాప్త వ్యాపారం ₹25,63,984 కోట్లు 10.98% వృద్ధి
స్థూల అడ్వాన్సులు ₹10,96,329 కోట్లు 12.42% వృద్ధి
గ్లోబల్ డిపాజిట్లు ₹14,67,655 కోట్లు 9.92% వృద్ధి
ఆర్ ఎ ఎం క్రెడిట్ ₹6,30,900 కోట్లు 14.90% వృద్ధి
రిటైల్ క్రెడిట్ ₹2,35,418 కోట్లు 33.92% వృద్ధి
నిర్వహణ లాభం ₹8,554 కోట్లు 12.32% వృద్ధి
నికర లాభం ₹4,752 కోట్లు 21.69% వృద్ధి
ఆస్తులపై రాబడి 1.14% 9 బిపిఎస్ పైకి
పిసిఆర్ 93.17% 395 బిపిఎస్ పైకి
సిఇటి-1 12.29% 24 బిపిఎస్ పైకి
స్థూల ఎన్ పి ఎ 2.69% 145 బిపిఎస్ క్రిందికి
నికర ఎన్ పి ఎ 0.63% 61 బిపిఎస్ క్రిందికి
ఋణ మూల్యం 0.72% 18 బిపిఎస్ క్రిందికి
స్లిప్పేజ్ నిష్పత్తి 0.80% 52 బిపిఎస్ క్రిందికి
Y-o-Y

30 జూన్, 2025 నాడు ముగిసిన త్రైమాసికానికి (స్వతంత్ర / ఏకీకృత) ఆడిట్ చేయబడని (సమీక్షించబడిన) ఆర్థిక ఫలితాలు (₹ కోట్లలో)

క్ర. సం.	వివరాలు	స్వతంత్ర: ముగిసిన త్రైమాసికం 30.06.2025 (ఆడిట్ చేయబడని)	స్వతంత్ర: ముగిసిన త్రైమాసికం 31.03.2025 (ఆడిట్ చేయబడిన)	స్వతంత్ర: ముగిసిన త్రైమాసికం 30.06.2024 (ఆడిట్ చేయబడని)	స్వతంత్ర: ముగిసిన సంవత్సరం 31.03.2025 (ఆడిట్ చేయబడిన)	ఏకీకృత: ముగిసిన త్రైమాసికం 30.06.2025 (ఆడిట్ చేయబడని)	ఏకీకృత: ముగిసిన త్రైమాసికం 31.03.2025 (ఆడిట్ చేయబడిన)	ఏకీకృత: ముగిసిన త్రైమాసికం 30.06.2024 (ఆడిట్ చేయబడని)	ఏకీకృత: ముగిసిన సంవత్సరం 31.03.2025 (ఆడిట్ చేయబడిన)
1	నిర్వహణల నుండి మొత్తం ఆదాయం (నికర)	38063.31	37352.80	34020.23	142207.87	41441.51	40256.19	36965.75	152657.89
2	నికర లాభం/(నష్టం) (పన్ను, అసాధారణమైన మరియు / లేదా అసాధారణ అంశాల ముందు)	6202.03	6451.96	5333.8	22626.67	6500.12	6548.67	5512.32	23228.65
3	పన్నుకు ముందు నికర లాభం/(నష్టం) (అసాధారణమైన మరియు / లేదా అసాధారణ అంశాల తర్వాత)	6202.03	6451.96	5333.8	22626.67	4667.09	6548.67	5512.32	23228.65
4	పన్నుకు తరువాత నికర లాభం / (నష్టం)-(అసాధారణమైన మరియు / లేదా అసాధారణ అంశాల తర్వాత)	4752.03	5002.66	3905.28	17026.67	3194.95	5070.19	4067.51	17539.62
5	ఆ కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం [ఆ కాలానికి లాభం / (నష్టం) కలిగియున్నది (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)]	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి	వివరణ 2 చూడండి
6	చెల్లించిన ఈక్విటీ షేర్ క్యాపిటల్	1814.13	1814.13	1814.13	1814.13	1814.13	1814.13	1814.13	1814.13
7	రిజర్వ్స్ (రీవాల్యుయేషన్ రిజర్వ్ మినహా)				91636.14				97152.80
8	సెక్యూరిటీస్ ప్రీమియం అకౌంట్	13919.01	13919.01	13919.01	13919.01	13983.85	13983.85	13983.85	13983.85
9	నికర విలువ	92822.53	88241.41	78266.24	88241.41	99627.50	93661.92	83535.13	93661.92
10	పెయిడ్-అప్ డెట్ క్యాపిటల్/అవుట్ స్టాండింగ్ డెట్	52989.10	52989.10	41639.10	52989.10				
11	మిగిలి ఉన్న రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్లు	-	-	-	-				
12	డెట్ ఈక్విటీ రేషియో	0.60	0.59	0.49	0.59				
13	ఒక్కో షేర్‌కి సంపాదన (ఒక్కొక్కటి రూ.2/-) (కొనసాగించబడుతున్న మరియు నిలిపివేసిన కార్యకలాపాల కోసం)								
	1. బేసిక్	5.24	5.52	4.31	18.77	3.52	5.59	4.48	19.34
	2. డైల్యూటెడ్	5.24	5.52	4.31	18.77	3.52	5.59	4.48	19.34
14	క్యాపిటల్ రెడెంప్షన్ రిజర్వ్	-	-	-	-	-	-	-	-
15	డిబెంచర్ రెడెంప్షన్ రిజర్వ్	-	-	-	-	-	-	-	-
16	డెట్ సర్వీస్ కవరేజ్ రేషియో	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు
17	ఇంటరెస్ట్ సర్వీస్ కవరేజ్ రేషియో	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు	వర్తించదు

గమనిక:
1. 2015, సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్లు మరియు కావలసిన వాటిని తెలియజేయుట) నియమావళులలోని నియమావళి 33 మరియు నియమావళి 52 కింద స్టాక్ ఎక్స్ ఛేంజెస్ తో త్రైమాసిక / వార్షిక ఆర్థిక ఫలితాల యొక్క సవివరమైన నమూనా నుండి పై సమాచారం గ్రహించబడింది. త్రైమాసిక / వార్షిక ఆర్థిక ఫలితాల యొక్క సవివరమైన పూర్తి నమూనా స్టాక్ ఎక్స్ ఛేంజెస్ యొక్క వెబ్ సైట్లలో (BSE: www.bseindia.com మరియు NSE: www.nseindia.com) మరియు బ్యాంక్ వెబ్ సైట్ లో (www.canarabank.com) లభించును.
2. మొత్తం సమగ్ర ఆదాయం మరియు ఇతర సమగ్ర ఆదాయానికి సంబంధించిన సమాచారం ఇండ్ ఏఎస్ (Ind AS) ఇంకనూ బ్యాంకుకు వర్తించనందున ఇవ్వబడలేదు.

స్థలం: బెంగళూరు
తేది : 24.07.2025
ఎస్ కె మజుందార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
భవేంద్ర కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
హర్దీప్ సింగ్ అహ్లూవాలియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
కె. సత్యనారాయణ రాజు ఎమ్‌డి & సిఇఓ
వివరణాత్మక ఆర్థిక ఫలితాల కోసం స్కాన్ చేయండి

1 బ్యాంక్ నంబరు 1800 1030 | www.canarabank.com
నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్: https://cybercrime.gov.in | నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్: 1930

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బలపడుతున్న బంధం

మాల్దీవుల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రెండురోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఆ దేశంలో కాలూనుతున్నారు. మాల్దీవుల్లో మోదీ పర్యటన ఇది మూడవసారి కావచ్చునుగానీ, జూలై 26నాటి ఆరుపదుల స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు భారత ప్రధానిని ఆ దేశాధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఎంచుకోవడం విశేషమైన పరిణామం. రెండేళ్ళక్రితం ముయిజ్జు అధికారంలోకి రావడానికి ఎన్నికల ప్రచారంలో ఆయన ఎత్తుకున్న 'ఇండియా అవుట్' నినాదం ఉపకరించిన విషయం తెలిసిందే. గెలిచిన తరువాత కూడా ఆయన భారత్ విషయంలో దూకుడుగానే వ్యవహరించారు. మాటలతో, చేతలతో స్పష్టమైన భారతవ్యతిరేక వైఖరిని తీసుకున్న ముయిజ్జు, చైనాతో చేయీచేయీకలిపారు. ఇప్పుడు మోదీని ఆహ్వానించినంత మాత్రాన ముయిజ్జు మారిన మనిషని గట్టిగా చెప్పలేం కానీ, అవసరాల్లోనూ ఆదుకుంటున్న భారత్‌ను కాదనగలిగేస్థితిలో తాను లేనన్న వాస్తవం ఆయనకు తెలిసొస్తున్నట్టు ఉంది.


మాల్దీవుల స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా భారత జెండాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో అక్కడి మేధావులు కొందరు ఆక్షేపిస్తున్నారట. భారతప్రధాని మనసుదోచుకోవడానికి ముయిజ్జు ప్రభుత్వం కాస్త ఎక్కువగానే హడావుడి చేస్తున్నదని వారి అభిప్రాయం. భారత్‌ను పక్కనబెట్టి, చైనా, గల్ఫ్ దేశాలమీద ఆధారపడి రాజ్యపాలన చేసుకోగలనని ఆయన ఆదిలో గట్టిగా నమ్మాడు. కానీ, భౌగోళికంగా అత్యంత సన్నిహితంగా ఉన్న ఒక అతిపెద్ద దేశాన్ని, ఓ బలమైన వాణిజ్య, అభివృద్ధి భాగస్వామిని కాదని, సంబంధాలు వదులుకొని తన దేశాన్ని నడపడం అసాధ్యమన్న విషయాన్ని ఆయన అనతికాలంలోనే గ్రహించాడు.

ముయిజ్జుతో మొదట్లో ఘర్షణాత్మక వైఖరి అవలంబించిన భారత్ కూడా, దానివల్ల ప్రజలను దూరం చేసుకోవడం వినా మరో ప్రయోజనం లేదని అర్థంచేసుకుంది. సహాయసహకారాలతో, సర్దుబాటుతో ముయిజ్జును దారికి తెచ్చుకుంది. భారత్–మాల్దీవుల మధ్య ఒప్పందాలూ అవగాహనలు చక్కగా సవ్యంగా ఉన్నాయని, వాటిమీద ఏ అభ్యంతరాలు, అనుమానాలూ అక్కరలేదని ఈ మధ్యనే ముయిజ్జు ఓ ప్రకటన చేస్తే, మాజీ మంత్రి ఒకరు గతాన్ని గుర్తుచేస్తూ ఘాటుగా విరుచుకుపడ్డారు. మాల్దీవుల మీద భారత్ పెత్తనం చేస్తున్నదనీ, దేశ సార్వభౌత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఆ ఒప్పందాలు దెబ్బతీస్తున్నాయంటూ తాను అధికారంలోకి వస్తూనే భారతదేశం తన సైనికులను ఉపసంహరించుకోవాలంటూ ఒత్తిడి చేసిన విషయాన్ని ఈయన గుర్తుచేశారు. మాటమార్చిన ముయిజ్జు ఇరుదేశాల ప్రజలకూ క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్ వెనుక రాజకీయం ఉండవచ్చును గానీ, ముయిజ్జు చేసిన కీడు చిన్నదేమీ కాదు. కొత్తగా ఎన్నికైన మాల్దీవుల అధ్యక్షుడు భారత్‌లో తొలిపర్యటన జరిపే సంప్రదాయాన్ని కాదని, టర్కీ, చైనాల్లో పర్యటించి, పెట్టుబడులను కోరడంతో పాటు, భారత వ్యతిరేక వ్యాఖ్యలు కూడా చేశారాయన. ఆయన అండచూసుకొనే మాల్దీవుల మంత్రులు కొందరు భారతప్రధాని లక్షద్వీప్ పర్యటన సందర్భంలో అవమానకరమైన వ్యాఖ్యలు చేశారు. లక్షద్వీప్‌ను అద్భుత పర్యాటక కేంద్రంగా ప్రశంసించి, దానిని ప్రోత్సహించమనే రీతిలో మోదీ పోస్టులు ఉండటంతో, దానిని కేంద్రమంత్రులూ బీజేపీ నాయకులూ అందిపుచ్చుకోవడంతో, మాల్దీవుల మంత్రులు కొందరు కుత్సిత వ్యాఖ్యలు చేశారు. ఇది చినికిచినికి గాలివానగా మారి, మనదేశంలోని ప్రముఖులు మాల్దీవులను బహిష్కరించమంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. పర్యాటకమే ప్రధానవనరుగా ఉన్న ఆ ద్వీపదేశానికి ఈ 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' ప్రచారం తీవ్ర నష్టం కలిగించింది. కష్టకాలంలో అదుకుంటాయనుకున్న చైనా, గల్ఫ్‌దేశాలు కూడా గాలికి వదిలేశాయి. ముయిజ్జుకు జ్ఞానోదయం కలిగి, మళ్ళీ భారతదేశంతో సయోధ్య యత్నాలు ఆరంభించడంతో, గత ఏడాది సెప్టెంబర్‌లో భారీ ఆర్థికసాయంతో మాల్దీవులను భారత్ ఆదుకుంది. మౌలికసదుపాయాల భారీ ప్రాజెక్టులతో, అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో మాల్దీవులను మళ్ళీ నిలబెట్టేందుకు ప్రయత్నాలు ఆరంభమైనాయి. ప్రేమలున్నా లేకున్నా ఇరుగూపొరుగూ అన్నాక సయోధ్యతో సాగాల్సిందే. భౌగోళిక, ప్రాంతీయ అవసరాల దృష్ట్యా రెండుదేశాలూ నడుచుకోవాల్సిందే. మోదీ తాజాపర్యటనతో ఇరుదేశాల దౌత్యసంబంధాలు పూర్వస్థితికి చేరుకుంటాయని ఆశించవచ్చు.

తొలి తెలుగు ప్రకృతి చిత్రకారుడు

చిత్రకళలో ప్రకృతి చిత్రలేఖనానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. అందమైన పర్వతాలు, నదులు, అడవులు, చెట్లు వంటి సహజ వాతావరణాన్ని యథావిధిగా ఆవిష్కరించడమే 'ప్రకృతి చిత్రలేఖనం లేదా ల్యాండ్ స్కేప్ ఆర్ట్' అంటారు. ప్రపంచవ్యాప్తంగా– టర్నర్, జాన్ కాన్‌స్టబుల్, విన్సెంట్ వాంగో, పీటర్ బ్రుగేల్.., మనదేశంలో– రాజా రవివర్మ, నందలాల్ బోస్, ఎస్.హెచ్. రజా, జెమినీరాయ్.. వంటి వారు పేరొందిన ప్రకృతి చిత్రకారులు. మన తెలుగు వారి విషయానికి వస్తే భగీరథి, సంజీవదేవ్, కొండిపర్తి శేషగిరిరావు, పేరి రామకృష్ణ, జోగి జగన్నాథరాజు తదితరులున్నారు. వీరిలో సంజీవదేవ్, కొండిపర్తి కాల్పనిక ప్రకృతి చిత్రాలను చిత్రించగా భగీరథి, రామకృష్ణలు సహజసిద్ధ ప్రకృతి చిత్రాలను ఆ పరిసరాల్లో కూర్చొనే చిత్రించేవారు.

భగీరథి ఎక్కువగా పోస్టుకార్డు పరిమాణంలోనే ప్రకృతి చిత్రాల్ని చిత్రించారు. ఈ ప్రత్యేకతతోనే జాతీయస్థాయిలో ఆయన గుర్తింపు పొందారు. ల్యాండ్‌స్కేప్ చిత్రాలను అత్యంత సహజంగా చిత్రించడంతో ఆయనను అందరూ 'ఆంధ్రా టర్నర్' అని పిలిచేవారు. బ్రిటిష్ చిత్రకారుడు ఓ.జే కూల్డ్రే వద్ద దామెర్ల రామారావు, వరదా వెంకటరత్నం, అడవి బాపిరాజు, కవికొండల వెంకటరావులతో పాటు భగీరథి కూడా శిష్యరికం చేసినా వారందరి కంటే భిన్నంగా, సొంత ఆలోచనలతో చిత్రరచన కొనసాగించారు. భగీరథిలో సాటిలేని ప్రతిభ ఉన్నా, ఆయనకు రావాల్సిన గుర్తింపు మాత్రం రాలేదు. నాటి వైశ్రాయ్‌లు, మహారాజులు, జమీందార్లు, కళాభిమానులు ఎందరో ఆయన ప్రతిభను మెచ్చినా, ఆ మెప్పు ఆయన్ను ఆర్థిక సమస్యలు, పేదరికం నుంచి బయటపడేయలేకపోయింది.



భగీరథి గొప్ప ప్రకృతి చిత్రకారుడే కాదు మంచి కవి, తాత్వికుడు, మంచి వక్త. ఆయన కృష్ణ శతకం, జగదంబ శతకం, భావ కుసుమావళి తదితర శతకాలు రచించారు. లార్డ్ మౌంట్ బాటన్, మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ప్రముఖులెందరో భగీరథలోని చిత్ర ప్రతిభను గుర్తించి, ఆయనను సత్కరించారు.

కర్మ సిద్ధాంతాన్ని భగీరథి ఎక్కువగా నమ్మేవారు. శ్రీ బ్రహ్మానంద సరస్వతి స్వామి మహారాజ్ సూచనపై ముంబైలోని 'జంషెట్జీ జియాజీరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్'లో చేరినా, కొన్ని కారణాల వల్ల మూణ్ణెల్లకే రాజమండ్రికి తిరిగొచ్చారు. ఆయనకు చిన్న వయసులోనే రత్నమాణిక్యంతో వివాహం జరిగింది. తన భార్య 'వై' (wi– ఆయన అలా సంబోధించేవారు)కు చిత్రలేఖనంలో శిక్షణనిచ్చి, ఆమెను గొప్ప చిత్రకారిణిగా తీర్చిదిద్దారు.

బతుకుదెరువు కోసం ఆయన గోదావరి బోర్డు స్కూల్లో డ్రాయింగ్, డ్రిల్ టీచరుగా చేరారు. రాజమండ్రి పరిసర ప్రాంతాలైన మండపేట, పుల్లేటికుర్రు, అనపర్తి, జగ్గంపేట, సామర్లకోట వంటి స్కూళ్లలోని పిల్లలకు డ్రాయింగ్ నేర్పేవారు. చిత్రకళపై ఆసక్తితో కన్యాకుమారి, నీలగిరి కొండలు, తిరువాన్కూరు, ఆగ్రా, డుడుమా జలపాతం, పాపికొండలు, అరామపర్వతం, రాయగడ, మత్స్యగుండం, మొగల్రాజపురం తదితర ప్రాంతాలకు వెళ్లి చిత్రాలు గీసేవారు. ల్యాండ్ స్కేప్, రాక్ స్కేప్, హిల్ స్కేప్, వాటర్ స్కేప్, స్కై స్కేప్‌లకు సంబంధించి చిత్రాలను భగీరథి గీశారు.

విజయనగరంలో 1933లో నిర్వహించిన స్వదేశీ చిత్రకళా ప్రదర్శనలో ప్రథమ బహుమతి, 1934లో మరో చిత్రకళా ప్రదర్శనలో బంగారు పతకం గెలుచుకున్నారు. ఆయన తన చిత్రాల్లో లేత రంగుల్ని ఎక్కువగా ఉపయోగించేవారు. ప్రకృతి రమణీయత, సహజత్వంతో నిండిన ఆ చిత్రాలను చూస్తే మనం ఆ ప్రాంతంలో ఉన్నామా? అన్న భావన కలుగకమానదు. భగీరథి గొప్ప ప్రకృతి చిత్రకారుడే కాదు మంచి కవి, తాత్వికుడు, మంచి వక్త. ఆయన కృష్ణ శతకం, జగదంబ శతకం, భావకుసుమావళి తదితర శతకాలు రచించారు. భగవద్గీత సారాన్ని భగీరథి సారంగా 2,500 పద్యాల్లో చెప్పారు. లార్డ్ మౌంట్ బాటన్, మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ప్రముఖులెందరో భగీరథలోని చిత్ర ప్రతిభను గుర్తించి, ఆయనను సత్కరించారు. తన చిత్రకళా ప్రతిభతో చిన్న వయసులోనే ఎంతో ఖ్యాతి గడించిన భగీరథి 1949 నవంబరు 19న (నలభై తొమ్మిదేళ్లకే) కీర్తిశేషులయ్యారు.

ఆయన గీసిన చిత్రాలన్నీ చూపరుల హృదయాల్లో వేదన, తపన, శ్రద్ధ, రసానుభూతి వంటి ఉద్వేగాలను కలిగిస్తాయి. వీరి సూర్యోదయం, చంద్రోదయం చిత్రాలు హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలోను, సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం– హైదరాబాద్, విశాఖ మ్యూజియం, అనపర్తి ఉన్నత పాఠశాలలోనూ ఉన్నాయి. ఇవేకాక 42 చిత్రాలు, 14 అసంపూర్తి చిత్రాలు, ఆల్బమ్స్, డైరీలు, పేపర్ కటింగ్స్ వంటివన్నీ ఆయన మనవరాలు ఎన్.వి.పి.ఎస్.ఎస్. లక్ష్మి సేకరించి భద్రపరిచారు. ఆమె విశ్రాంత ఉపాధ్యాయిని, రచయిత్రి మాత్రమే కాదు తన తాతయ్య లాగా మంచి చిత్రకారిణి కూడా. తన తాతయ్య జీవిత చరిత్రను గ్రంథస్తం చేశారు. ఆయన పేరుతో 'భగీరథి ఆర్ట్ ఫౌండేషన్' అనే సంస్థను స్థాపించి, చిత్రకళాభివృద్ధికి కృషి చేస్తున్నారు. భగీరథి 125వ జయంత్యుత్సవాల సందర్భంగా జూలై 27న రాజమండ్రిలోని గోదారి ఒడ్డున గల 'చందా సత్రం' వేదికగా భగీరథి చరిత్ర గ్రంథాన్ని ఆయన మనవరాలు లక్ష్మి ఆవిష్కరించనున్నారు.

○ సుంకర చలపతిరావు
కళారత్న అవార్డు గ్రహీత

అరణ్యవాసంలోనే విప్లవప్రభాతం!

విప్లవం ఏమిటి? విప్లవ సాధనకు హింస తప్పనిసరి అని విశ్వసిస్తారు. సాయుధ పోరాటంతో విప్లవాన్ని ముడిపెడతారు. విప్లవానికి తుపాకీ ప్రతీక కాదు. ఒక సమాజంలోని ప్రజలు తమ దుస్తర పరిస్థితులపై తిరుగుబాటు చేసి మౌలిక మార్పులు సాధించుకోవడమే విప్లవం. 1970ల్లో భారతీయ యువత తుపాకీని తిరుగులేని విప్లవ సాధనంగా ఆరాధించేది. కారణమేమిటి? భారతీయ ప్రజాస్వామ్యం ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించకపోవడమే. పైగా కమ్యూనిస్టులు తెలంగాణ విప్లవ మార్గాన్ని విడనాడి పార్లమెంటరీ ప్రజాస్వామ్య మార్గానికి మళ్లారు.

నా తరం విద్యార్థులు మార్క్సిజాన్ని, లెనిన్ విప్లవాత్మక కార్యాచరణను అభిమానించేవారు. ఈ ప్రభావాల కారణంగా ఆ నాటి విద్యార్థి లోకం దేశ రాజకీయాల పట్ల తీవ్ర అసంతృప్తితో రగిలిపోతుండేది. 1975 నాటికి మన దేశంలో విప్లవం విజయవంతమవుతుందని విప్లవ కమ్యూనిస్టు పార్టీ నాయకులు పదేపదే ఉద్ఘాటిస్తుండేవారు. అవును, వారి ప్రబోధాలు, ఉద్ఘోషలతో విప్లవం నిజంగానే తుపాకీ గొట్టం ద్వారా వస్తుందని పరిపూర్ణంగా నమ్మేవాళ్లం. మా స్వప్నాలను విప్లవ ఝంఝ ఊపివేస్తుండేది. ఖమ్మంలో విద్యార్థిగా ఉన్నప్పుడు నాకు ఒక తుపాకీని పంపారు. విప్లవోత్సాహంలో ఉన్న నా మిత్రులు కొంతమంది నడిగూడెంలోని ఒక బ్యాంకులో దోపిడీకి పాల్పడి అరెస్టయ్యారు వారి రాజకీయాలు అంతటితో ముగిశాయి. స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఒకరిని హతమార్చేందుకు నా విప్లవ మిత్రులు పథకం రచించారని తెలిసి నేను వారితో విభేదించాను. విప్లవ కార్యకలాపాలకు దూరంగా ఉన్నాను.

మార్క్స్ సిద్ధాంతాన్ని మరింతగా అధ్యయనం చేసేందుకు నేను జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో చేరాను. నా సహచర విద్యార్థులలో అత్యధికులు ఉన్నత, విద్యాధిక వర్గాల వారి విద్యాసంస్థగా పేరుపొందిన (ఢిల్లీలోని) సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి వచ్చినవారే. సుదీర్ఘ చర్చలతో భారత దేశ సమస్యలకు నక్సలైట్ ఉద్యమం పరిష్కారం కాదనే నిర్ణయానికి మేము వచ్చాము. వర్గ సంబంధాలు, వర్గ పోరాటాలను మరింత లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయించుకున్నాం.

సామాజిక ఆధిపత్యాలను, సామాన్యుల అస్తిత్వ పోరాటాల తీరుతెన్నులను మరింతగా అర్థం చేసుకునేందుకు తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజల భాగస్వామ్యాన్ని అవగాహన చేసుకోవడంపై నా దృష్టిని కేంద్రీకరించాను. బెంగాల్‌లోని నక్సల్‌బరీ



నక్సలైట్ ఉద్యమం పరిపూర్ణ ప్రజా ఉద్యమంగా పరిణమించలేదు. పట్టణాలు, నగరాలలోని నక్సల్స్ మద్దతుదారులు మార్క్స్, లెనిన్ గురించి మాట్లాడటం మినహా ఎలాంటి విప్లవ సిద్ధాంతాన్ని అభివృద్ధిపరచలేదు. నక్సలైట్ ఉద్యమాలు ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేయలేకపోయాయి. ఇది ఘనీభవించిన యథార్థం. నక్సలైట్లు తమ ఆయుధాలతో రాజ్యానికి లొంగిపోయి పునరావాసం పొందడానికి ప్రయత్నించాలి.

గ్రామంలో ప్రారంభమైన నక్సలైట్ ఉద్యమం వెనుకబడిన ప్రాంతాలు అయిన ఇల్లందు, శ్రీకాకుళం, కరీంనగర్‌లో కొనసాగింది. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో వలె భూములను పేదలకు పంపిణీ చేశారు. అయితే రైతులు పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయాలలో భాగస్వాములయ్యారు. నాటి ప్రధాని ఇందిర తన మితవాద ప్రత్యర్థులను చిత్తుచేసేందుకు భూ సంస్కరణలను ప్రవేశపెట్టారు. దళితుల సంక్షేమానికి అగ్రప్రాధాన్యమిచ్చారు. అదే సామ్యవాదమని ఉధృతంగా ప్రచారం జరిగింది.

గ్రామాలలో రైతులు వాణిజ్య పంటలు సాగుచేసి ధనవంతులయ్యారు. వారి జీవనశైలి మారింది. విద్యా సదుపాయాల అభివృద్ధితో గ్రామీణ భారతంలో పార్లమెంటరీ రాజకీయాలకు ఇతోధిక ఆదరణ లభించింది. పరిశ్రమల ప్రైవేటీకరణతో కార్మిక వర్గం సైతం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఆదరించింది. కొత్త సాంకేతికతలు, మేనేజ్‌మెంట్ పద్ధతులతో పట్టణీకరణ విస్తరించింది. మొత్తంమీద భారతీయ సమాజం పెట్టుబడిదారీ విధానాన్ని అంగీకరించింది. నగరాలు, పట్టణాలు, గ్రామాలలో ప్రజల ఆలోచనారీతులు మౌలికంగా మారిపోయాయి. ఆస్తుల ఆర్జనకు, బిడ్డల చదువులకు ప్రాధాన్యం పెరిగింది. మార్క్సిస్టులు బూర్జువా విప్లవంగా పేర్కొనే పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం సువ్యవస్థితంగా సుస్థిరమయింది.

ఇదిలా వుంటే నక్సలైట్లు తమ పాత విప్లవ విధానాలనే కొనసాగించారు. ఫలితంగా రైతు కూలీల మద్దతును పొందడంలో విఫలమయ్యారు. ఈ కారణంగా వారికి అరణ్యవాసం అనివార్యమయింది. అడవి బిడ్డలు అయిన ఆదివాసీల మద్దతుతో విప్లవ సాధనకు నక్సల్స్ పూనుకున్నారు. ఆదివాసీల చైతన్యశీలత తమ భూములను ఆక్రమించుకున్న మైదాన ప్రాంతాల రైతులు, వడ్డీ వ్యాపారస్తులు, అటవీశాఖ అధికారులకు వ్యతిరేకంగా సంప్రదాయ పద్ధతులలో పోరాడేందుకు పరిమితమయింది. తుపాకులతో నక్సల్స్ చేసే పోరాటాలు గిరిజనుల మన్ననలు పొందలేకపోయాయి. మైదాన ప్రాంతాల నక్సలైట్ నాయకులే అడవులలోనూ ప్రధాన నాయకులుగా కొనసాగారు. అమాయకులు అయిన ఆదివాసీలు తమ ప్రాంతాలలో జరుగుతున్న వినూత్నరీతుల పోరాటాల గురించి తమలో తాము చర్చించుకున్నారు. పోలీసులు నక్సల్స్ ఉద్యమ వివరాలను గురించి ఆదివాసీల నుంచే తెలుసుకున్నారు. నక్సలైట్ ఉద్యమం తమకు అనుకూలమైనదనే వాస్తవం సైతం ఆ అమాయక ఆదివాసీలకు తెలియదు. కొంతమంది ఆదివాసీలను ఇన్ఫార్మర్లు అనే అభియోగంతో నక్సలైట్లు కాల్చివేయడం జరిగింది. అదే సమయంలో నక్సల్స్ సానుభూతిపరులు అనే మిషతో అమాయక అడవి బిడ్డలను పోలీసులు నానా విధాలుగా హింసించడం, వేధించడం జరిగింది.

నక్సలైట్ ఉద్యమం పరిపూర్ణ ప్రజా ఉద్యమంగా పరిణమించలేదు. తుపాకీ పట్టిన యువజనులు, రాజ్య వ్యవస్థ భద్రతా బలగాల మధ్య సాయుధ పోరాటంగా మారిపోయింది. నక్సలైట్ ఉద్యమాన్ని శాంతిభద్రతల సమస్యగా ప్రభుత్వం పరిగణించింది. పట్టణాలు, నగరాలలో నక్సల్ ఉద్యమానికి మద్దతు నిస్తున్నవారు విప్లవ భావనను ప్రచారం చేస్తూ యువజనులను ఆ ఉద్యమంలో చేరేందుకు ప్రోత్సహించారు. ఇటువంటి రాజకీయ వాతావరణం నుంచి ప్రభవించిందే పౌర హక్కుల ఉద్యమం. పలువురు బుద్ధిజీవులు నక్సలైట్ మేధావులుగా పేరు పొందారు. పట్టణాలు, నగరాలలోని నక్సల్స్ మద్దతుదారులు మార్క్స్, లెనిన్ గురించి మాట్లాడటం మినహా ఎలాంటి విప్లవ సిద్ధాంతాన్ని అభివృద్ధిపరచలేదు.

ప్రపంచ చరిత్రలోనే ఒక మహోన్నత స్ఫూర్తిదాయక జాతీయోద్యమం నుంచి స్వతంత్ర భారతదేశం ప్రభవించింది. సార్వత్రిక వయోజన ఓటుహక్కు పునాదిగా ప్రజాస్వామ్య వ్యవస్థను అభివృద్ధిపరచుకున్నది. రైతులు, రైతు కూలీలు, దళితులు, ఆదివాసులు, వెనుకబడిన కులాలవారు క్రమేణా ఈ ప్రజాస్వామ్య స్రవంతిలో సంలీనమయ్యారు. దళితులు, గిరిజనులు, బీసీలకు సామాజిక న్యాయాన్ని సమకూర్చేందుకు రాజ్యాంగబద్ధమైన భరోసాలు కల్పించారు. నక్సలైట్లు సాధన చేస్తున్న విప్లవం రాజ్య వ్యవస్థపై భారీ ఎత్తున ప్రజల తిరుగుబాటుగా రూపుదాల్చలేదు. నక్సలైట్ ఉద్యమాలు యాభై సంవత్సరాలుగా ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని గానీ, పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను గానీ ప్రభావితం చేయలేకపోయాయి. అయితే తమ సైద్ధాంతిక విశ్వాసాలకుగాను ఎంతో మంది నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలు సామ్యవాద సమాజాల నిర్మాణానికి ఆస్కారం కల్పిస్తాయా? సంశయాస్పదమే. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలు అన్నీ మితవాద విధానాల వైపు మొగ్గుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలను కార్పొరేటీకరణ చేస్తున్నాయి. ఇది ఘనీభవించిన యథార్థం. నక్సలైట్లు తమ ఆయుధాలతో రాజ్యానికి లొంగిపోయి పునరావాసం పొందడానికి ప్రయత్నించాలి. లొంగిపోయిన నక్సల్స్‌కు సౌకర్యవంతమైన పునరావాసం కల్పిస్తామనే హామీతో వారిని పార్లమెంటరీ ప్రజాస్వామిక మార్గం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.



■ ఇనుకొండ తిరుమలి
చరిత్రకారుడు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

మీ ప్రేమాదరణలకు ధన్యవాదాలు!

ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జూలై 19న విశాఖపట్నంలో నిర్వహించిన తలసేమియా అవగాహనా ర్యాలీ ప్రజల్లో నూతన చైతన్యాన్ని నింపింది. తలసేమియా అనేది ఓ మానవీయ సమస్య. ఈ వ్యాధి బాధితులకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో మా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తలసేమియా ర్యాలీ, అత్యంత స్ఫూర్తిదాయకంగా, ప్రజల మనసులను తాకేలా విజయవంతంగా ముగిసింది. ఒక సామాజిక బాధ్యతగా, తలసేమియా వంటి జెనెటిక్ వ్యాధిపై అవగాహన పెంపొందించాలన్న లక్ష్యంతో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, యువత, మహిళలు, డాక్టర్లు, సామాజిక సేవా కార్యకర్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం హర్షణీయం. ఇది మానవతా విలువలకు అద్దం పట్టే ఘట్టం. నిజమైన సామాజిక మార్పు అవగాహన నుంచే ప్రారంభమవుతుంది.



ఈ అవగాహన ర్యాలీలో పాల్గొన్నవారు చూపిన సంఘీభావం, సహకారం తలసేమియా బాధితులకు ఒక ఆశాకిరణం అవుతుంది. జాతీయ స్థాయిలో ఉన్న తలసేమియా బాధితుల సంఖ్య చూస్తే, ఒక నిజమైన అవగాహన ఉద్యమం ఎంత అవసరమో అర్థమవుతుంది. కేవలం చికిత్స ద్వారా కాకుండా ముందస్తు పరీక్షల ద్వారా కూడా నివారించదగిన వ్యాధి తలసేమియా. దీనిపై సామాజికంగా చైతన్యం కలిగించాలన్న ఆవశ్యకతను ఎన్టీఆర్ ట్రస్ట్ గుర్తించి, ఎన్నో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

విశాఖలో జరిగిన తలసేమియా అవగాహనా ర్యాలీ విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

మా బ్లడ్ బ్యాంక్‌లో చాలామంది అమ్మలు చిన్న పిల్లలను పెట్టుకొని వేచి ఉండేవారు. మీరంతా ఇక్కడ ఎందుకు వున్నారని నేను వారిని ప్రశ్నించాను. మా పిల్లలకు బ్లడ్ అవసరం, మాకు ఖర్చు అవుతుంది, అది మేం భరించలేం, తలసేమియా వ్యాధికి మీరు బ్లడ్, మందులు ఏమైనా సప్లై చెయ్యగలరా అని అడిగేవారు. అక్కడ నుంచి పుట్టుకొచ్చింది తలసేమియా పిల్లలను ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆదుకోవాలన్న ఆలోచన. ఈ ట్రస్ట్ ద్వారా ఒక్క తలసేమియా వ్యాధికి మాత్రమే కాదు, పేద ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు 8 లక్షల మందికి పైగా రక్తం అందించాం. ఆరోగ్య శిబిరాలు నిర్మించి, సంజీవిని క్లినిక్‌ల ద్వారా లక్షలాది మందికి ఆరోగ్య సేవలు అందిస్తున్నాం.

తలసేమియా అనేది జన్యుపరమైన రక్త సంబంధిత వ్యాధి. పిల్లల్లో ఎక్కువగా కనిపించే తీవ్రమైన రక్తహీనత. శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి సమర్థంగా లేని కారణంగా, ఈ వ్యాధిగ్రస్తులకు తరచూ రక్తం ఇవ్వాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు తలసేమియా క్యారియర్స్‌గా ఉన్నప్పుడే, శిశువుకు ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇది నిర్ధారణ చేసే మార్గాలు ఉన్నప్పటికీ, అవగాహన లేకపోవడం వల్ల ఇది వ్యాప్తి చెందుతోంది. తలసేమియాను చిన్న పరీక్షతో నిర్ధారించవచ్చు. ఈ వ్యాధిని నిరోధించేందుకు అవసరమైన జాగ్రత్తలు తెలియచేయడమే విశాఖలో నిర్వహించిన ఈ ర్యాలీ ఉద్దేశ్యం.

తలసేమియా రోగులకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ లాభాపేక్షలేని ప్రాతిపదికతో కీలకమైన సహాయాన్ని అందిస్తోంది. హైదరాబాద్‌లో 25 ప్రత్యేక బెడ్స్‌తో తలసేమియా కేర్ సెంటర్‌ను నిర్వహిస్తోంది. మా ట్రస్టు బ్లడ్ షీల్డ్ ప్రోగ్రామ్ ఆర్థికంగా వెనుకబడిన తలసేమియా రోగులకు సురక్షితమైన రక్తం, ఫిల్టర్స్ మందులను ఉచితంగా అందిస్తుంది. ఇది పేదలు, అవసరమైన వారికి 81,610 యూనిట్లను ఇప్పటికే జారీ చేసింది. తలసేమియా బారిన పడిన పిల్లలకు సంవత్సరానికి ఒక బిడ్డకు అయ్యే ఖర్చు వివరాలు పరిశీలిస్తే– రక్త యూనిట్ల ధర రూ.51,000; ల్యూకో–ఫిల్టర్ ఖర్చు రూ.26,000; మందులు రూ.84,000; విటమిన్ సప్లిమెంట్లు రూ.20,000; వైద్య పరీక్ష ఖర్చు రూ. 32,000; ఇతరాలు (రవాణా, ఆహారం మొదలైనవి) రూ.37,000. సంవత్సరానికి సుమారుగా మొత్తం ఖర్చు రూ.2,50,000 అవుతుంది. ప్రతి తలసేమియా రోగికి సంవత్సరానికి 17 సార్లు రక్తమార్పిడి చేయాలి. ఈ పరిస్థితిని అధిగమించడానికి సాధారణ ప్రజలలో అవగాహన పెంచడం తప్పనిసరి. రేపటి తరాలకు ఆరోగ్యకరమైన జీవితం అందించాలన్నదే మా ఎన్టీఆర్ ట్రస్ట్ ధ్యేయం. ఎన్టీఆర్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రజలు చూపిన ఆదరణ, మాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. 'రక్తదానం–ప్రాణదానం' అనే సందేశంతో ముందుకు పోతూ ప్రతి జీవితం విలువైనదని గుర్తు చేస్తూ ఈ జ్ఞాపకాలను చిరకాలం మన హృదయంలో నిలుపుకొందాం. విశాఖ ఒక సముద్రతీర నగరం మాత్రమే కాదు, సమాజాన్ని ప్రేమించే హృదయాలతో నిండిన ప్రదేశం కూడా. తలసేమియా అవగాహనా ర్యాలీ విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను

◆ నారా భువనేశ్వరి
ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ

మద్యం మాటున జగన్నాటకం

మందుబాబుల గొంతుల్లో గరాటాలు పెట్టి, గరళం పోసి, లక్షలాది కుటుంబాల్లో శోకాగ్నులు రగిలించి, జగన్‌రెడ్డి ముఠా దోచుకొన్న రూ. 3,500కోట్లను రాష్ట్ర ప్రభుత్వం 'రెవెన్యూ రికవరీ' చట్టాన్ని అమలు చేసి రికవరీ చేయాలి. ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు చేర్చాలి. హత్యా నేరం కన్నా ఆర్థికనేరం చాలా ప్రమాదకరమని అత్యున్నత న్యాయస్థానం పదే పదే చెబుతున్నది. కాలకూట విషం వంటి మందును తాగించి జనాన్ని రోగాల పాలు జేసి, మద్యం విక్రయాల ద్వారా దండుకున్న వేలకోట్ల రూపాయలను రికవరీ చెయ్యకపోతే చట్టబద్ధమైన పాలనకు ఇక అర్థమేముంటుంది?

మద్యం కుంభకోణం ఒక్కటి చాలు దోపిడీలో జగన్‌రెడ్డి ఎంతటి నేర్పరో చెప్పడానికి. రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, వారి ఆర్థికాన్ని కూడా దెబ్బతీసిన అతి పెద్ద మద్యం స్కామ్ ఇది. మద్యం మారీచుడు జగన్‌రెడ్డికి కఠిన దండనలు పడేలా చూడటమే కాదు– బొక్కిన ప్రతి రూపాయిని రెవెన్యూ రికవరీ చట్టంతో ఖజానాకు చేర్చాలి. విలువలు, విశ్వసనీయతలు అంటూ సుద్దులు చెప్పే జగన్‌రెడ్డి సిట్ వెల్లడించిన అంశాలపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి.



అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని నంగనాచి కబుర్లు చెప్పి, ఆ వాగ్దానాలు అన్నింటికీ మంగళం పాడి, దేశంలో మరెక్కడా కనీవినీ ఎరగని స్థాయిలో మద్య కుంభకోణానికి జగన్‌రెడ్డి పాల్పడ్డారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో నగదు లావాదేవీలకు మాత్రమే అనుమతించి స్వాహా పర్వానికి పాల్పడ్డారు. మోసకారి మాటలతో మద్యం మహమ్మారిని రాష్ట్రం మీదకు వదిలి జనం సొమ్మును, ఆయురారోగ్యాలను దోచారు. జగన్‌రెడ్డి హయాంలో పిచ్చి మందు విక్రయాల విలువ ఏకంగా 43.7శాతం పెరిగింది. విషతుల్యమైన బ్రాండ్లను జనం మీదకు వదలడంతో ఆరోగ్యం దెబ్బతిని వైద్య ఖర్చుల రూపేణా అభాగ్యులు నష్టపోయింది రూ.40వేల కోట్లు ఉంటుందని సమాచారం. ప్రభుత్వ మద్యం మాయ కారణంగా రూ.18వేల కోట్లకు పైగా రాష్ట్ర ఆదాయం కోల్పోగా, మద్యం సరఫరా సంస్థల నుంచి రూ.3,500కోట్ల వరకు కమీషన్లను జగన్ ముఠా దండుకొన్నది.


జగన్ హయాంలో జరిగినంతటి భారీ మద్యం కుంభకోణం దేశంలో ఎక్కడా జరగలేదు. ఈ కుంభకోణంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ అధికారుల బృందం గత ప్రభుత్వ అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేసింది. సిట్ బయటపెట్టిన అంశాలపై సిగ్గుపడాల్సిన జగన్‌రెడ్డి అది వదిలేసి– ఇది రాజకీయ కక్ష సాధింపు అని, లేని లిక్కర్ స్కామ్‌ను ఉన్నట్లు చూపిస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని రూ.43వేల కోట్లు దోపిడీ చేసినట్లు సీబీఐ నిగ్గుతేల్చినప్పుడు కూడా నయా పైసా ఎరుగనని నానా యాగీ చేసిన ఘనుడు జగన్‌రెడ్డి. ప్రజాధనం దోచుకోవడం, ఇతరులు పైకి నెట్టడం ఆయనకి అలవాటుగా మారింది.

మాజీ సీఎం జగన్‌రెడ్డి పాత్ర నేరుగా ఎక్కడా కనిపించక పోయినా, ఆదేశాలు మాత్రం తాడేపల్లి ప్యాలెస్ నుంచే వచ్చాయని, డిస్టిలరీస్ నుంచి లభించిన ముడుపులు మూలవిరాట్‌కే చేరాయని సిట్ నిర్ధారించింది. జగన్ జమానాలో జరిగిన మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ, కీలక నిందితుడు, జగన్‌రెడ్డికి నమ్మిన బంటుగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డేనని, ఎంతోమంది మహిళల తాళిబొట్లు తెంచి రూ.3,500కోట్ల వరకు ముడుపులు మేసి, అందులో పెద్ద మొత్తం సొమ్మును మూల విరాట్‌కి చేర్చింది మిథున్‌రెడ్డేనని సిట్ తేల్చింది. ఏ కంపెనీ ఎంతెంత కమీషన్ ఇచ్చిందీ, ఎవరికి ఎక్కడ చెల్లించిందీ, ముడుపులు ఏయే రూపాల్లో అందిందీ కూడా కోర్టుకు సమర్పించిన చార్జిషీటులో తెలియజేసింది. డిస్టిలరీలను భయపెట్టి ముడుపులను మొదట 12శాతం నుంచి తర్వాత 20శాతానికి పెంచేశారని, డిస్టిలరీల నుంచి, సరఫరాదారుల నుంచి వచ్చే ముడుపులను జగన్‌కు ముట్టజెప్పారని సిట్ స్పష్టం చేసింది. నెలకు రూ.50–60 కోట్ల చొప్పున ఆయనకు అందాయని, మొత్తం రూ.3,500 కోట్లు ముడుపుల రూపంలో వసూలు చేశారని, అందుకు పకడ్బందీ ప్రణాళికలు వేశారని, డబ్బులు ఎక్కడెక్కడికి వెళ్లాయో దర్యాప్తు సంస్థలకు అంతు చిక్కకుండా వివిధ మార్గాల్లో మళ్లించారని సిట్ విచారణలో వెల్లడి అయింది.

మద్యం కుంభకోణం ఒక్కటి చాలు, దోపిడీలో జగన్‌రెడ్డి ఎంతటి నేర్పరో చెప్పడానికి. రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, వారి ఆర్థికాన్ని కూడా దెబ్బతీసిన అతి పెద్ద మద్యం స్కామ్ ఇది. ప్రముఖ బ్రాండ్లను రాష్ట్రం నుంచి తరిమేసి, జగన్ ముఠా డిస్టిలరీల నుంచే అడ్డమైన బ్రాండ్ల మద్యాన్ని కొనిపించి అభాగ్యుల జీవితాలతో మృత్యు క్రీడలాడింది జగన్ ప్రభుత్వం. వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకొని వైసీపీ నాయకుల ఎన్నికల ఖర్చుకూ రూ.250 నుంచి 300 కోట్లు పంపిణీ చేశారని, అక్రమంగా వచ్చిన వందల కోట్ల రూపాయల మొత్తాన్ని ఇతర రాష్ట్రాలకు హవాలా ద్వారా తరలించారని సిట్ విచారణలో వెల్లడయింది. అధికారంలో ఉండి ఇంత నీచానికి, పాల్పడతారా? ఈ స్థాయిలో వ్యవస్థీకృత నేరం చెయ్యడానికి సిగ్గు అనిపించడం లేదా? మద్య మారీచుడు జగన్‌రెడ్డికి కఠిన దండనలు పడేలా చూడటమే కాదు– బొక్కిన ప్రతి రూపాయిని రెవెన్యూ రికవరీ చట్టంతో ఖజానాకు చేర్చాలి. ఆ సొమ్మును గరళ మద్యానికి బలైన కుటుంబాల సంక్షేమానికి వినియోగించి బాధితులకు న్యాయం చెయ్యాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉన్నది.

రాష్ట్రానికి, ప్రజలకు భారీ ఆదాయ నష్టం చేసిన తీవ్రమైన నేరస్థులు జైలు గదులలో ప్రత్యేక సదుపాయాల కోసం ఇచ్చే పిటిషన్లను స్వీకరించే ముందు కోర్టులు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. అవినీతిపరులైన నేరస్థులకు వారి మోసాల కారణంగా ప్రత్యేక సెల్ ఉండకూడదు. కోర్టు ముందు హాజరైన ప్రతి ఒక్కరికీ సెక్షన్ కింద రిమాండ్ ఒకేలా ఉంటుంది. స్కామ్‌లలో పాల్గొన్న వ్యక్తులకు ప్రత్యేక ట్రీట్మెంట్ ఇవ్వడానికి వారు దేశభక్తులు కాదు, ప్రజాధనం దోపిడీ చేసినవారు. వారికి రాచమర్యాదలు అవసరం లేదు. మద్యం కుంభకోణంలో బిగ్ బాస్ ఎవరు అనేది ప్రజలకు అర్థమయింది. విలువలు, విశ్వసనీయతలు అంటూ సుద్దులు చెప్పే జగన్‌రెడ్డి– సిట్ వెల్లడించిన అంశాలపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి.

● యనమల రామకృష్ణుడు
తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు





బోనాలతో మహిళల ప్రదర్శన

చౌడేశ్వరీదేవికి భక్తితో బోనాలు


మంగళగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీదేవి జన్మ దినోత్సవం అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం, ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కుప్పురావుకాలనీ ఐదో లైనులో సంఘం కోశాధికారి అల్లక నమశ్శివాయ ఇంటి నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మహిళలు బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా గండాలయపేటలోని శ్రీతాతోద్రి పోలేరమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో చౌడేశ్వరి అమ్మవారికి భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, మంగళగిరి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బల్లా వెంకటరమణ, అల్లక తాతారావు, అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మాడిశెట్టి శివశంకరరావు, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్, నక్కిన చినవెంకటరాయుడు, పృథ్వీ రవి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ద్రోన్లు డౌటే

సొమ్ము చెల్లించినా అందని వైనం

- ◆ 121 డ్రోన్లకు 48 మాత్రమే పంపిణీ
- ◆ చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖ

వ్యవసాయంలో యాంత్రీకరణ గణనీయంగా పెరుగుతోంది. ఆధునిక సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెరిగిన కూలి రేట్లు, కూలీల కొరతను అధిగమించేలా.. సాగుదారులకు ఊరట లభించేలా.. స్థానికంగా పలువురు ఉపాధి పొందేలా.. వ్యవసాయ యాంత్రీకరణ జరగాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన డ్రోన్లతో సాగు చేపట్టేలా రైతుల్లో అవగాహన పెంచుతోంది. ఆయా డ్రోన్లను సబ్సిడీపై అందిస్తోంది. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో డ్రోన్లను సంఘాలకు అందజేయడంపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది.



జిల్లాల వారీగా డ్రోన్ల పంపిణీ ఇలా..

జిల్లా	లక్ష్యం	పంపిణీ
పల్నాడు	43	14
గుంటూరు	42	21
బాపట్ల	36	13

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ పద్ధతులను ఆధునికీకరించడం.. ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం యాంత్రీకరణను వేగవంతం చేస్తోంది. పురుగు మందులు పిచి కారితో పాటు ఎరువులు చల్లేందుకు డ్రోన్లు అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు అటు ఖర్చులు, ఇటు కూలీల బాధలు తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంతోకాలంగా స్థోమత ఉన్న రైతులు పలువురు డ్రోన్లను వినియోగిస్తూ సాగులో లబ్ధి పొందుతున్నారు. అయితే అందరూ వ్యక్తిగతంగా డ్రోన్లను సమకూర్చుకునే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో సబ్సిడీపై అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రోన్ల వినియోగంపై ఆయా గ్రామాల్లోని రైతు సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చి తద్వారా కొందరికి ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంది. ఎరువులు, పురుగు మందుల పిచికారిలో డ్రోన్లను విరివిగా వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. 80 శాతం సబ్సిడీపై డ్రోన్లు పంపిణీకి ఆదేశాలు జారీ చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే 121 డ్రోన్లను

(మిగతా 6లో)

ఐదు లారీలకు రూ.12 లక్షలు

మరో 14 గ్రానైట్ లారీల లెక్కతేల్చని అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రానైట్ అక్రమ రవాణాపై వాణిజ్య పనులు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న గ్రానైట్ లారీలపై దాడి చేసి తనిఖీలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో ఇటీవల పల్నాడు జిల్లా పరిధిలో 19 లారీలను అధికారులు సీజ్ చేశారు. వీటిలో ఐదు లారీల నుంచి గ్రానైట్ విలువ ఆధారంగా సుమారు రూ.12 లక్షలు జరిమానా వసూలు చేశారు. 14 లారీలకు సంబంధించి ఇంకా వసూలు కాలేదని అధికారులు తెలిపారు. ఆయా లారీలకు సంబంధించి గ్రానైట్ సంస్థలకు నోటీసులు జారీ చేశారు. లారీలో ఎంత విలువైన గ్రానైట్ ఉందో అంతే మొత్తంలో పన్ను చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. గ్రానైట్ విలువపై 18 శాతం పన్ను చెల్లిస్తామని రాజకీయ నేతలతో అధికారులపై అక్రమార్కులు ఒత్తిడి తెస్తున్నారు. అయితే గ్రానైట్ విలువ ఆధారంగా పన్ను చెల్లించాల్సిందేనని అధికారులు తేల్చి చెబుతున్నారు. లేకుంటే స్వాధీనం చేసుకున్న గ్రానైట్‌ను వేలం ద్వారా విక్రయిస్తామంటున్నారు.



అరచేతిలో పుర సేవలు!
● సేవా మిత్ర మాదిరి.. పుర మిత్ర మొబైల్ యాప్ ● మొత్తం 150 రకాల సేవలు ● సచివాలయ సిబ్బంది స్పెషల్ డ్రైవ్
8

తిలాపాపం తలా ఎంత..?
● రూ.40 కోట్ల భూ అక్రమ రిజిస్ట్రేషన్‌పై పునర్విచారణ ● రంగంలోకి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ ● జిల్లా రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో నేటి నుంచి విచారణ

'తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా' చేయూత
● 110 ప్రభుత్వ పాఠశాలలకు రూ. 6 లక్షల లబ్ధి
6

నీట మునిగిన వెద వరి

కన్నీటి పర్యంతమవుతున్న రైతులు



గొడవర్రులో నీట మునిగిన వెద పొలాలు

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జూలై 24 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే ముందస్తుగా వెద పద్ధతిలో సాగు చేసిన వరికి మాత్రం నష్టం చేకూర్చుతున్నాయి. వెద వరి పైరు నీట మునిగి రైతులకు నష్టాలను మిగిల్చింది. గతంలో మిర్చి సాగు చేసిన రైతులు ఈ ఏడాది వరి సాగు చేపట్టారు. ఈ క్రమంలో గొడవర్రు గ్రామంలో 20 రోజుల క్రితం వర్షం జల్లులు కురవడంతో వెద పద్ధతిలో వరి సాగుకు శ్రీకారం చుట్టారు. మొలకెత్తి దశలో పైరు ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో భారీ వర్షాలతో గ్రామంలో లోతట్టులో ఉన్న పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. మూడు రోజులుగా వాన నీటిలోనే పైరు నీటమునిగి ఉంది. దీంతో పైరు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లోని నీటిని బయటకు పంపేందుకు కూడా వీలులేకుండా డ్రెయిన్లు పూడిపోయాయని రైతులు వాపోతున్నారు. డ్రెయిన్లలో పూడిక తీసి ఉంటే పొలాల్లోని నీరు బయటకు వెళ్లి పంటలను కాపాడుకునే అవకాశం ఉండేదని రైతుల చెప్తున్నారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో 500 ఎకరాలకు పైగా పంటలు నీట మునగడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

నృసింహాలయంలో శ్రావణమాస పూజలు

ఆలయంలో ఉచితంగా వరలక్ష్మి వ్రతాలు

మంగళగిరి సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ కోగంటి సునీల్‌కుమార్ తెలిపారు. 25న రాజ్యలక్ష్మీ అమ్మవారికి స్వర్ణ కవచాలంకారం, ఆగస్టు 1న వేకువజామున స్వామివారికి స్వాతీ నక్షత్ర తిరువంజనం, శుక్రవారం అమ్మవారికి తిరువంజనం, 3న ఉత్సవమూర్తులకు సామూహిక పంచామృతాభిషేకాలు, శాంతి కల్యాణం, సహస్ర నామార్చన, 8న వేకువజాము అమ్మవారికి తిరువంజనం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 9న శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి తామర పుష్పాలతో సహస్ర నామార్చన, తిరువంజనం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, 17న సామూహిక సుదర్శన లక్ష్మీనరసింహ హోమం, శాంతి కల్యాణం, 19న స్వామి వారికి ఏకాదశి తిరువంజనం, 22న అమ్మవారికి తిరువంజనం, పంచామృతాభిషేకాలు జరుగుతాయని చెప్పారు. శ్రావణమాస సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రీసర్వే గ్రామాల్లో ఎల్‌పీఎంలు

రైతులు దరఖాస్తులు చేసుకుంటే మార్పు



గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో రైతులందరికి వ్యక్తిగత ల్యాండ్ పార్సిల్ నెంబర్లు(ఎల్‌పీఎం) ఇచ్చినట్లు జాయింట్ కలెక్టర్ భార్గవతేజ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 16 మండలాల్లో రీసర్వే జరిగిన గ్రామాల్లో 1147 జాయింట్ ఎల్‌పీఎంలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆయా నంబర్లను రైతులు వారి వ్యక్తిగత ఎల్‌పీఎంలుగా మార్చుకునేందుకు ఆన్‌లైన్‌లో పట్టా సబ్ డివిజన్ ప్రక్రియ ద్వారా గతంలో నిర్దేశిత రుసుము చెల్లించాల్సి ఉండేదన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సబ్ డివిజన్ రుసుమును 31 వరకు మినహాయించిం దన్నారు. ఈ నేపథ్యంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలో ఉన్న రైతులు ఆన్‌లైన్ పట్టా సబ్ డివిజన్ కోసం సచివాలయాల్లో అర్జీ దాఖలు చేసుకుంటే ప్రత్యేక ఎల్‌పీఎంని ఏర్పాటు చేసి వెబ్‌ల్యాం డ్‌లో నమోదు చేస్తామన్నారు. జాయింట్ ఎల్‌పీ నంబరుగా ఉంటే సదరు రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాల లబ్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఖాతాదారులు వెంటనే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆహా.. అమరావతి!
8



పీ-4తో పేదరిక నిర్మూలన

నారాకోడూరు గ్రామసభలో కలెక్టర్ నాగలక్ష్మి

చేబ్రోలు(పొన్నూరుటౌన్), జూలై 24 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పీ-4 పథకాన్ని అమలు చేస్తుందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో గురువారం జరిగిన గ్రామసభలో కలెక్టర్ సమక్షంలో బంగారు కుటుంబాల సమస్యలను చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగా పీ-4 కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూపకల్పన చేశారన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలను గుర్తించి వారి అవసరాలను తీర్చేదిద్ది బంగారు కుటుంబాలుగా మార్చేందుకు మార్గదర్శకులతో అనుసంధానం చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. బంగారు కుటుంబాల్లోని వ్యక్తుల విద్య, వైద్యం, ఆర్థిక సమస్యలు పరిష్కరించేలా మార్గదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో 217 బంగారు కుటుంబాలకు ఇప్పటివరకు 25 కుటుంబాలను మార్గదర్శులతో అనుసంధానం చేసినట్లు చెప్పారు. మిగిలిన కుటుంబాలకు కూడా త్వరలోనే మార్గదర్శులను గుర్తించి అనుసంధానం చేస్తామన్నారు. నీడ్ అసెస్మెంట్ సర్వే ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని ఇంకా మిగిలి ఉన్నవారు దరఖాస్తులు అందజేస్తే వారిని కూడా బంగారు కుటుంబ లబ్ధిదారులుగా గుర్తిస్తామన్నారు.



బంగారు కుటుంబం లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

బంగారు కుటుంబాలతో కలెక్టర్

గొడవర్రు మంచాల గ్రామాల్లో మార్గదర్శులతో అనుసంధానమైన బంగారు కుటుంబాలను కలెక్టర్ స్వయంగా కలిశారు. వారికి అందుతున్న సౌకర్యాలు, ఇతర అంశాలపై చర్చించారు. గ్రామాల పర్యటనకు విచ్చేసిన కలెక్టర్‌కు గ్రామస్థులు డ్రెయిన్ల నిర్మాణం చెపట్టాలని, దోమల బెడదను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సబ్ కలెక్టర్ సంజనసింహ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధిక అధికారి వందనం, ఎంపీడీవో ఊహరాణి, తాహసీల్దారు శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి కార్యాలయం వెంగళాయపాలెం గ్రామం, శివశంకరీ దేవాలయం దగ్గర, గుంటూరు రూరల్ (మం) గుంటూరు
గుంటూరు : 99854 03281, 99854 11219, మంగళగిరి : 98484 11050, 99854 03281,
బాపట్ల : 9985411227, 99854 03281, పొన్నూరు : 985411227, 99854 03281,
తెనాలి : 9985411227, 9985402292, 99854 03281, రేపల్లె : 9985411227, 99854 03281,
సత్తెనపల్లి : 99854 77867, 99854 03281, పిడుగురాళ్ళ : 99854 01330, 99854 03281,
మాచర్ల : 99854 01690, 99854 03281, నరసరావుపేట : 99854 11226, 9985401330, 99854 03281,
చిలకలూరిపేట : 99854 11220, 99854 11219, వినుకొండ : 99854 03900, 99854 11219, అమరావతి : 99854 03281



శుభకార్యానికి వెళ్తుండగా.. ప్రమాదం

● అదుపు తప్పి పల్టీ కొట్టిన కారు
● ఐదుగురికి తీవ్రగాయాలు
● జీఎంసీ ఉద్యోగి భార్య, ద్విచక్ర వాహనదారుడి పరిస్థితి విషమం



చెక్కవాగు వద్ద పల్టీ కొట్టిన కారు

ఆటోలో క్షతగాత్రులు లక్ష్మి, మల్లికార్జున్, సంఘవిని వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు

వినుకొండటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి పల్టీ కొట్టడంతో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో వినుకొండ - కర్నూలు జాతీయ రహదారిపై గల చెక్కవాగు వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నల్లేంద జయరామ్ కుటుంబ సమేతంగా ప్రకాశం జిల్లా గిద్దలూరులోని బంధువుల శుభకార్యానికి హాజరయ్యేందుకు ప్రయాణిస్తుండగా కారు అదుపు తప్పి చెక్క వాగు బ్రిడ్జిపై గోడలకు ఢీకొట్టింది. దీంతో కారు పల్టీ కొట్టింది. ఈ నేపథ్యంలో వినుకొండ నుంచి వివరాలపాలెంవైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం కారును ఢీకొనడంతో వాహనదారుడు తలతోట మల్లికార్జున్, అలాగే కారులో ఉన్న జయరామ్ భార్య లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించినప్పటికీ ..అందుబాటులోకి రాకపోవడంతో.. ఆటో సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఇదే ప్రమాదంలో జయరామ్, అతని కుమార్తెలు సంఘవి, జాహ్నవిలకు కూడా గాయాలయ్యాయి. వీరిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అనంతరం ప్రైవేటు అంబులెన్స్‌లో గుంటూరుకు తరలించారు. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్ బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన లక్ష్మి, ద్విచక్ర వాహనదారుడు మల్లికార్జున్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అందుబాటులో లేని 108 అంబులెన్స్

ప్రమాదం నేపథ్యంలో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించినప్పటికీ కనీసం స్పందించిన దాఖలాలు లేవు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో జనం పెద్ద సంఖ్యలో గుమికూడటంతో జయరామ్ పెద్దకుమార్తె సంఘవి మెడలోని విలువైన బంగారు ఆభరణాలను దొంగలు దోచుకున్నట్లు సంఘవి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షమీర్‌బాషా తెలిపారు.

పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాదు, లక్ష్మణరెడ్డి తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని ప్రభుత్వానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు విజ్ఞప్తి చేశారు. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా నగరంపాలెంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ జాషువా అపారమైన జ్ఞానంతో కుల ఆధారిత వివక్ష కారణంతో ఎదుర్కొన్న పోరాటాల నుంచి కవితల్ని రచించారన్నారు. తన కుమార్తె హేమలతను నాస్తిక ఉద్యమ నేత గోరా కుమారుడు లవణంకు ఇచ్చి వివాహం చేశారని గుర్తుచేశారు. జనసైన్యం వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. తన జీవితాంతం అసమానతలు లేని సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు గుర్రం జాషువా అని కొనియాడారు. కావలి బాలస్వామి, అత్తోట జోసెఫ్ కుమార్, కాకుమాను పున్నారావు, ఏపీపీ సుకుమార్, కుక్కమూడి భగవాన్‌దాస్ పాల్గొన్నారు. అలాగే నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్లాలని జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు అన్నారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఈమని అప్పారావు, కాకుమాను నాగేశ్వరరావు, బైరగాని శ్రీనివాసరావు, వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.

మలినేనిలో..

సైబర్ హైజీన్‌పై అవగాహన సదస్సు

వట్టిచెరుకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ ఏపీ సొసైటీ ఫర్ ట్రైనింగ్ ఎంప్లాయిమెంట్ రాష్ట్ర యువజన విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సైబర్ హైజీన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అధ్యాపకులు, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటేనియల్ అధ్యక్షులు డాక్టర్ వీర రాఘవ ఆతుకూరి, జీవిత హాజరై డిజిటల్ స్పేస్‌లో వ్యక్తి గత కార్యాలయాల భద్రత పై విశ్లేషణాత్మకంగా వివరించారు. అలాగే ఫిషింగ్, మాల్వేర్, సోషల్ ఇంజనీరింగ్, పాస్వార్డ్ మేనేజ్‌మెంట్‌పై ఆచారణాత్మకంగా చిట్కాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏపీ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిామెంట్ యూత్ సర్వీస్ డిపార్ట్‌మెంట్ గుంటూరు రేంజ్ మేనేజర్ రాధిక బొందలాటి మాట్లాడుతూ యువతలో సైబర్ భద్రత పట్ల స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జె.అప్పారరావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ డి.విజయ సారథి, రోటరీ క్లబ్ కార్యదర్శి సంతోష్ కుమార్ చావేరా, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్,
కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) & (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, పరిపాలనా కార్యాలయం నం.24-బి, గాంధీ నగర్, కుంబకోణం -612 001 మరియు శాఖ కార్యాలయం డి.నం.23-6-122, రామా ఎన్‌క్లేవ్, పట్నం బజారు, గుంటూరు - 522003, గుంటూరు - పట్నం బజారు శాఖ** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు ప్రకటన స్వీకరణ తేదీ నుండి **60 రోజుల్లోగా** ప్రకటనలో తెలిపిన మొత్తం **రూ.50,07,449/- (రూపాయలు యాభై లక్షల ఏడు వేల నాలుగు వందల నలభై తొమ్మిది మాత్రమే)** లను మరియు నెలవారీ వాయిదాలతో **29.04.2025** నుండి దానిపై తదనంతర వడ్డీని తిరిగి చెల్లించమని రుణగ్రహీతలు **నం.1) మెసర్స్ శ్రీ భవాని & కో, నం.22-11-710, తూనుగుంటవారి వీధి, లాలాపేట, గుంటూరు - 522003; నం.2) శ్రీ పాములపాటి భవాని ప్రసాద్ తండ్రి పాములపాటి సుబ్బయ్య, నం.11-9-70/1, జేకేసి కాలేజ్ రోడ్డు, విజయపురి కాలని, ఐదవ లైన్, గుంటూరు - 522006; నం.3) శ్రీ చెరుకూరి శ్రీనివాస రావు తండ్రి చెరుకూరి రంగయ్య, నం.16-2-200, సమృద్ధ్ హెవెన్, నవభారత్ నగర్, గుంటూరు - 522006** వారిని కోరుతూ **06.05.2025** తేది గల డిమాండ్ ప్రకటనను జారీ చేశారు.

పైన తెలిపిన చట్టబద్ధమైన ప్రకటన తదుపరి కూడా సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో పైన తెలిపిన పేర్లు కలిగిన రుణగ్రహీతలు విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు 22 జూలై 2025న స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా పైన తెలిపిన పేర్లు కలిగిన రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా పైన తెలిపిన పేర్లు కలిగిన రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం **రూ.51,89,606/- (రూపాయలు యాభై ఒక్క లక్షల ఎనభై తొమ్మిది వేల ఆరు వందల ఆరు మాత్రమే)** మరియు పూర్తి బకాయిలు చెల్లించే వరకు **19.07.2025** నుండి దానిపై వడ్డీని సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకు లోబడియుంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించాల్సిందిగా రుణగ్రహీతలు కోరబడుతున్నారు.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తి

ఆస్తి - 1: (శ్రీ పాములపాటి భవాని ప్రసాద్ తండ్రి పాములపాటి సుబ్బయ్యకు చెందిన ఆస్తి)
గుంటూరు జిల్లా, కొరిటిపాడు ఉప-జిల్లా, గోరంట్ల గ్రామం, గోరంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని డి.నం.62/బి కలిగిన ఎ.3.82 సెంట్ల మొత్తంలో ఎ.1.00 లోని 382 చ.గజాల స్థలం మరియు **సరిహద్దులు:** తూర్పు: బొల్లిముంత వీరప్రకాశ్ రావు ఇంటి స్థలం - 77.6 అ., దక్షిణం: డి.నం.62/సిలోని బాదపాటి వెంకటరావుచే ఇతరులకు విక్రయించబడిన స్థలం - 44 అ., పశ్చిమం: అంబటి రామయ్యచే ఇతరులకు విక్రయించబడిన స్థలం - 77.6 అ., ఉత్తరం: 30 అ. వెడల్పు రోడ్డు - 44.9 అ.

ప్రదేశం: గుంటూరు, తేది: 22.07.2025 **అధీకృత అధికారి**

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, **CIN - L65110TN1904PLC001287**
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

విద్యార్థుల..

మానసిక వికాసానికి.. ప్రేరణ దోహదం

● కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు

వట్టిచెరుకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసికంగా అభివృద్ధి చెందటానికి మోటివేషన్ తరగతులు ఎంతగానో దోహద పడతాయని కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు అన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సీఎస్ఈ విద్యార్థులకు లైఫ్ స్కిల్, లీడర్ షిప్, బిహేవియర్, గోల్ సెట్టింగ్ వంటి అంశాల పై గురువారం ప్రేరణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆసెంట్ ట్రైనింగ్ కన్సెల్టెన్సీ చీఫ్ ట్రైనర్ సయ్యద్ రఫీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ జీవితంలో జరిగే సంఘటనల నుంచి వారి ప్రవర్తన మార్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఇలాంటి తరగతుల నిర్వాహణ దోహద పడతాయన్నారు. జీవితమంటే ఉద్యోగం, డబ్బే కాదు, సామాజిక స్పృహ ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ కోయ శేఖర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత మైన ఫలితాలను ఇవ్వటమే కాకుండా జీవితంలో ఉన్నత స్థితికి తీసుకు వెళ్తుందన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రమేష్, డాక్టర్ సీహెచ్ అరుణ, విద్యార్దులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏటా విత్తన బంతుల పండుగ

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అంకారావు

కారంపూడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తొలకరి జల్లుల సమయం మొదలుకొని సెప్టెంబరు చివరి వరకు నాలుగు నెలలపాటు ఏటఆ విత్తన బంతుల పండుగ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (వనాల అభివృద్ధి, అడువుల పెంపకం) పర్యావరణ వేత్త కొమెర అంకారావు పేర్కొన్నారు. గురువారం వినుకొండ రోడ్డులోని మంత్రాలమ్మ కనుమ ప్రాంతంలో ఆయన విత్తన బంతులు చల్లారు. ఈ సందర్భంగా అంకారావు మాట్లాడుతూ మేలో రకరకాల విత్తనాలు సేకరించి జూన్ మొదటి వారంలో విత్తన బంతులు తయారు చేసి అడువులు, ఎత్తయిన కొండలు, గుట్టలు, కుంటలు, మైదాన ప్రాంతాలు, ఊరు చివరి ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా.. మడ అడవుల అభివృద్ధి కోసం తీరప్రాంతాల్లో ఈ విత్తన బంతులు చల్లాల్సి ఉంటుందన్నారు. కోతులు, పక్షులు, వన్యప్రాణుల ఆహారం కోసం పండ్లు, దుంపలు, తీగ జాతి విత్తనాలు సేకరించి విత్తన బంతులు తయారు చేసి చల్లాలని సూచించారు.

రేపటి నుంచి జోయాలుక్కాస్ షోరూంలో..

బ్రిలియెన్స్ డైమండ్ జ్యూయలరీ షో

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని జోయాలుక్కాస్ షోరూంలో ఈనెల 26వ తేదీ నుంచి బ్రిలియన్స్ డైమండ్ జ్యూయలరీ షో ప్రదర్శన నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్ డాక్టర్ జాయ్ ఆలూక్కాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సాహసవంతమైన బ్రైడల్ రూపకల్పనల నుంచి తప్పనిసరిగా ఉండాల్సిన సమకాలీన ఆభరణాల వరకు, షోలో ఉన్న ప్రతి ఆభరణం ఏదైనా ఒక ప్రత్యేకమైనది అందించటానికి రూపొందించబడిందన్నారు. ఈ పరిమితి ఎడిషన్ డిజైన్‌లు కేవలం ఎగ్జిబిషన్ ఉన్న సమయంలోనే లభిస్తాయన్నారు. ఆధునికత, స్టైల్‌ని సూచించే కలెక్షన్ ను సృష్టించటంతో పాటు అందం, భావోద్వేగం, వ్యక్తిత్వాలను ప్రదర్శిస్తుందన్నారు. ప్రదర్శనలో రూ. లక్ష విలువ చేసే ప్రతి డైమండ్ జ్యూయలరీ కొనుగోలుతో ఉచితంగా ఒక గ్రాము గోల్డ్ కాయిన్‌ను అందించనున్నట్లు తెలిపారు. 26వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు మాత్రమే ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశం కోల్పోవద్దని పేర్కొన్నారు.

కండక్టర్ ఇంటిలో బంగారు ఆభరణాల చోరీ

వినుకొండటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): తాళాలు వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి సుమారు రూ.5లక్షల విలువ చేసే బంగారాన్ని దోచుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ షమీర్ బాషా తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో నివాసం ఉంటున్న ఆర్టీసీ కండక్టర్ కన్నెగంటి విజయలక్ష్మి ఈ నెల 17న బంధువులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు. గురువారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ షమీర్ బాషా ఘటనా ప్రాంతానికి చేరుకొని ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టిక్కెట్ ప్రయాణంపై.. అవగాహన కల్పించాలి

● దక్షిణ మధ్య రైల్వే పీసీసీఎం రమేష్



డీఆర్ఎంతో కలిసి సమీక్షిస్తున్న పీసీసీఎం రమేష్

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రతి ఒక్కరూ టిక్కెట్ కొనుగోలు చేసి ప్రయాణించేలా అవగాహన కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) రమేష్ ఆదేశించారు. గురువారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌కు వచ్చిన ఆయన గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్‌తో కలిసి వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పీసీసీఎం రమేష్ మాట్లాడుతూ ప్రజారవాణలో రైలు ప్రయాణం ఎంతో చవక అన్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు తగిన టిక్కెట్‌లు కొనుగోలు చేసి నిర్ణీత బోగీలలో ప్రయాణించాలన్నారు. టీటీఈలు డివిజన్ పరిధిలో టిక్కెట్ తనిఖీలు విస్తృతం చేయాలని సూచిం చారు. యూటీఎస్, రైల్ వన్ యాప్‌లను వినియోగించి అన్ రిజర్వుడ్ టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొనేలా చూడాలన్నారు. అమృత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. గతిశక్తి ప్రాజెక్టులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. గూడ్స్ షెడ్డు అభివృద్ధి, ప్రయాణికులకు సౌకర్యాలపైనా సమీక్ష చేశారు. సీసీఎం కె.సాంబశివరావు, సీసీఎం డి.సత్యన్నారాయణ, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

డ్రోన్లు డౌటే

(5వ పేజీ తరువాయి)

పంపిణీ చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వ లక్ష్యం ఘనంగా ఉన్న ఆచరణలో సాధ్యం కావడం లేదు. నిర్ణయించిన వాటా ధనం చెల్లించి నెలలు గడుస్తున్నా సంఘాలకు డ్రోన్ల సరఫరా చేయలేదు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. రైతు సంఘాలు 89 డ్రోన్లకు వాటా ధనం కూడా చెల్లించాయి. అయితే ఇప్పటికి 48 డ్రోన్లను మాత్రమే పంపిణీ చేశారు. ప్రస్తుతం సాగు పనులు విరివిరిగా జరుగుతున్నాయి. డ్రోన్లు పంపిణీపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో డ్రోన్లు అందుబాటులోకి వస్తాయన్న నమ్మకం రైతుల్లో సన్నగిల్లుతోంది. డ్రోన్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నా చర్యలు లేవు. డ్రోన్లు కోసం వాటా ధనం చెల్లించిన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సీజన్ పూర్తయ్యాక డ్రోన్లు ఇచ్చి ప్రయోజనం ఉండదంటున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

మార్కెట్లో శ్రావణ సందడి


● పూజా సామగ్రి కొనుగోళ్లతో కోలాహలం
● బంతి, మల్లెపూల ధరలకు రెక్కలు



మార్కెట్లో పూజా సామగ్రి, పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): శుభ కార్యాలకు నెలవైన శ్రావణమాసం సందడి ప్రారంభమైంది. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో పూజా సామగ్రి కొనుగోళ్లతో గురువారం సాయంత్రం కోలాహలం నెలకొంది. శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కావడంతో తొలి రోజున పూజలకు మహిళలు పూలు పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేశారు. నగరంలోని బ్రాడీపేట, కొరిటెపాడు, బృందావన్‌గార్డెన్స్, గుజ్జనగుండ్ల, లాలాపేట, పండ్ల మార్కెట్, కూరగాయాల మార్కెట్ సెంటర్, చుట్టుగుంట సెంటర్లలో.. చిన్న పాటి జల్లులు కరుస్తున్నా.. రద్దీ కొనసాగింది. ఇదే క్రమంలో పూల ధరలకు రెక్కలొచ్చాయి. మూర బంతి పూలు రూ. 20 వరకు విక్రయించారు. ఇక మల్లెలు మూర రూ. 40 నుంచి రూ. 50 వరకు విక్రయిస్తున్నారు. కొబ్బరికాయలు, పండ్ల ధరలు అమాంతం పెంచేశారు.

'తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా' చేయూత



ప్లేట్లు, నోట్ పుస్తకాలు హెడ్మాస్టర్లకు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

చిలకలూరిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా సభ్యులు భారీగా సహాయం అందించారు. 110 పాఠశాలలకు చెందిన 4,800 మంది విద్యార్థులకు రూ.3.63 లక్షల విలువ చేసే భోజన ప్లేట్లు, రూ. 2.50 లక్షల విలువ చేసే నోట్ పుస్తకాలు గురువారం స్థానిక ఎంఈవో ఎ.శ్రీనివాసరావు ద్వారా ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లకు అందజేశారు. కోమటినేనివారిపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఘంటసాల కరిముల్లా అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న సొసైటీ బాధ్యులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి ఈ సహాయం అన్ని పాఠశాలలకు అందేలా చూశారు.



ఉద్యోగావకాశాలు

➡ గుంటూరు నగరంలోని ప్రముఖ కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థతో పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు 10th పాస్, 50 సం॥పై వయస్సు వారు కావలెను. సంప్ర॥ 99899 09698.
AJG-239532

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-209457

CHANGE OF NAME

➡ I Gummadidala Lakshmi Sowjanya W/o. late Veeraiah R/o Door Number 10-74 Near Venugopal Swamy temple selapadu village, Chebrolu (M.D), Guntur - 522 213, Decided to change My existing name to GUMMADIDALA LAKSHMI SOWJANYA, W/o Veeraiah instead of GUMMADIDALA SOWJANYA, W/o. Veeraiah
AJG-239656

➡ I, SANDEEP BHANDARI, S/o. JAYANTILAL, D.NO: 21-9-94 Gantalamma chettu street, Chowtra, GUNTUR - 522003 A.P. I have changed my Father name Jayantilal JAIN (old Name) To JAYANTILAL (New NAME) This is Informed all Concerned. My Correct Name is. SANDEEP BHANDARI S/o. JAYANTILAL IS ALL PURPOSE.
RK-675

➡ I, VALLAMKONDA TARUN SAI (Old Name), S/o V.Venkateswarlu, Resident of 5-65-41, 1/20th Line Brodipet, Guntur-522002, A.P. I have changed my name as VALLAMKONDA THARUN SAI (New Name), S/o V.Venkateswarlu, Hereafter my name is known as VALLAMKONDA THARUN SAI (New Name), S/o. V. Venkateswarlu
AJH-15493

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న **ఆంధ్రజ్యోతి కి** చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	- 97036 18725
గుంటూరు 2 టౌన్	- 99854 01056
తెనాలి	- 99854 11202
నరసరావుపేట	- 99854 11206
బాపట్ల	- 99663 35084
పిడుగురాళ్ళ	- 93909 05725
మంగళగిరి	- 93986 73618
అమరావతి	- 95027 86195
పొన్నూరు	- 97042 99094
రేపల్లె	- 99854 12254
చిలకలూరిపేట	- 91103 23914
వినుకొండ	- 99662 50266
మాచర్ల	- 88861 19952
సత్తెనపల్లి	- 97048 67908
ప్రత్తిపాడు	- 63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : **99854 11214**

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

విజయవంతమైన 6వ వారం
టిక్కెట్ రేట్స్ : రూ.50/-, రూ.60/-
రోజూ 4 ఆటలు



లక్ష్మి 70 ఎంఎం ఎ/సి - గుంటూరు
పిమ్మసాని 70 ఎంఎం ఎ/సి - తెనాలి
శ్రీ వెంగమాంబ సినిమాస్
గుంటూరు జిల్లా
సెల్: 9097519999

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in,
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు:నం.1) శ్రీ పి.వెంకట రమణ భాస్కర్ తండ్రి పి.వి.ఎస్.ఆర్.మూర్తి, **7-231-11/3, రెవెన్యూ కాలనీ, 2వ లేన్, ఎస్ఎస్ఎన్ కాలేజ్ సమీపాన, శివాజీ నగర్, మంగమూరు డొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. నం.2) శ్రీమతి పాటిబండ లక్ష్మి శ్యామల, భర్త పి.వెంకట రమణ భాస్కర్, 7-231-11/3, రెవెన్యూ కాలనీ, 2వ లేన్, ఎస్ఎస్ఎన్ కాలేజ్ సమీపాన, శివాజీ నగర్, మంగమూరు డొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001.** వారి నుండి **21.07.2025** నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి **20.07.2025** నాటికి **రూ.3,03,64,568/- (రూపాయలు మూడు కోట్ల మూడు లక్షల అరవై నాలుగు వేల ఐదు వందల అరవై ఎనిమిది మాత్రమే)** లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద **సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌**కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు- సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు

షెడ్యూల్ -ఎ: (శ్రీ పి.వెంకటరమణ భాస్కర్, తండ్రి పివిఎస్ఆర్ మూర్తికి చెందిన ఆస్తి)

(ఐటమ్ నం.1): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసారావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థల ప్లాట్ నం.1 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ఇమ్మడిశెట్టి హనుమాయమ్మ - 60 అడుగులు, దక్షిణం: ఇమ్మడిశెట్టి పోతురాజు - 36 అడుగులు, పశ్చిమం: ప్లాట్ నం.2-60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు-36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు.

(ఐటమ్ నం.2): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసారావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థల ప్లాట్ నం.2 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నం.1-60 అడుగులు, దక్షిణం: ఇమ్మడిశెట్టి పోతురాజు - 36 అడుగులు, పశ్చిమం: ప్లాట్ నం.3 - 60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు.

(ఐటమ్ నం.3): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసారావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థల ప్లాట్ నం.3 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నం.1- 60 అడుగులు, దక్షిణం: ఇమ్మడిశెట్టి పోతురాజు - 33 అడుగులు, పశ్చిమం: మున్నంవారిపాలెం రోడ్డు - 62.9 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 51.4 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 287.5 చ.గ.లు లేదా 241.5 చ.మీ.లు.

(ఐటమ్ నం.4): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసారావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థల ప్లాట్ నం.8 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ఇమ్మడిశెట్టి హనుమాయమ్మ - 60 అడుగులు, దక్షిణం: ప్లాట్ నం.4 - 36 అడుగులు, పశ్చిమం: ప్లాట్‌నం.9 - 60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు.

(ఐటమ్ నం.5): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసారావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థల ప్లాట్ నం.9 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నం.8 - 60 అడుగులు, దక్షిణం: ప్లాట్ నం.5 - 36 అడుగులు, పశ్చిమం: ప్లాట్ నం.10 - 60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు.

(ఐటమ్ నం.6): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసారావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థల ప్లాట్ నం.10 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నం.9 - 60 అడుగులు, దక్షిణం: ప్లాట్ నం.6 - 36 అడుగులు, పశ్చిమం: కోలా సుమతి వదలిన భూమి - 60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు. ఐటమ్‌లు 1 నుండి 6 వరకు పై సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 1487.5 చ.గ.లు లేదా 1249.5 చ.మీ.లు.

రిజర్వు ధర: రూ. 34,00,000/-
(రూపాయలు ముప్పై నాలుగు లక్షలు మాత్రమే)

షెడ్యూల్ -బి: (శ్రీమతి పాటిబండ లక్ష్మిశ్యామల, భర్త: పి.వెంకటరమణ భాస్కర్‌కు చెందిన ఆస్తి)
గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, నరసారావుపేట సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్‌రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపల్ ఏరియా, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం సమీపాన డి.నం.డబ్ల్యుబి-4-22 మరియు డి.నం.103/1బి సమీపాన ఎ.2-22 సెంట్ల విస్తీర్ణం, ఎ.1-84 సెంట్లు మరియు ఇందులో డి.నం.105/1, ఎ.4-80 సెంట్లలో ఎ.0-78 సెంట్ల విస్తీర్ణం గల ఖాళీ స్థలంలో గల రెండు విస్తీర్ణాలు ఒక ఐటమ్‌గా మొత్తం విస్తీర్ణం ఎ.2-62 సెంట్లలో షెడ్యూల్ ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: వేమూరి కమలమ్మకు విక్రయించిన ఆస్తి, దక్షిణం: ప్రభుత్వ డొంక, పశ్చిమం: వేమూరి జ్యోతిలక్ష్మి ఆస్తి, ఉత్తరం: ఆకుతోట నాగేశ్వరరావు & ముదుగు బిక్షులు రెడ్డి స్థలాలు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం ఎ.0-33 సెంట్లు లేదా 1597.2 చ.గ.లు లేదా 1341.64 చ.మీ.లు.

రిజర్వు ధర: రూ. 36,00,000/-
(రూపాయలు ముప్పై ఆరు లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది	ప్రదేశం
18-08-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు - అరుండల్‌పేట శాఖ, కల్పతరు హౌస్, 6-9-24, 9/1, అరుండల్ పేట్, గుంటూరు - 522002 టెలిఫోన్ నం.0863-2219091, సెల్ నం.9347099363, 8925876329

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు **ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు - అరుండల్‌పేట శాఖ, కల్పతరు హౌస్, 6-9-24, 9/1, అరుండల్ పేట్, గుంటూరు - 522002** వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను **"సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్"** పేరున తీసిన రిజర్వు ధరలో **10 శాతం** బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన **మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్** వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంతో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు **టెలిఫోన్ నం.0863-2219091, సెల్ నం.9347099363, 8925876329**లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన **మ.01.00 గం.కు** కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన **వెంటనే** అమ్మకం మొత్తంలో **25% (చెల్లించిన బయానా కలిపి)** చెల్లించాలి మరియు మిగిలిన **75%** మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి **15 రోజులలోగా** చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన **25%** మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి.11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 23.07.2025 **అధీకృత అధికారి**

నమోదిత కార్యాలయం:149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287,
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

ఆంధ్రజ్యోతి

దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

సంప్ర॥ 99854 11213 99854 11225 | 99854 01877 99854 04047 99854 01614

బోగస్ ఓట్లపై ఆధారపడిన ప్రతిపక్షాలు

● బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విఠల్ ఆక్షేపణ

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బోగస్ ఓట్లపై ఆధారపడి ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తుండటం శోచనీయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ పాండురంగ విఠల్ గురువారం ఒక ప్రకటనలో ఆక్షేపించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం ఓటర్ లిస్టులో చనిపోయిన, వేరే ప్రాంతానికి వలస వెళ్లిన, చిరునామాల్లో లేని ఓటర్లను లిస్టు నుండి సుమారుగా 65 లక్షల ఓట్లను తొలగించే కార్యక్రమాన్ని ఈసీ చేపట్టిందన్నారు. స్థానికంగా నివసిస్తున్న వారు మాత్రమే ఓటర్లుగా నిర్ధారించిందన్నారు. ఇది మింగుడు పడని కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌ని స్తంభింప చేస్తుండటం సరికాదన్నారు. ఇలాంటి విధానాలను ప్రజలు గ్రహించి ఎండగట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): చీరాలలో ఆగస్టు 9నుంచి 11వ తేదీ వరకు జరిగే ఏపీ స్టేట్ అంతర్ జిల్లాల అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే జిల్లా అండర్- 14, 16 బాల, బాలికల జట్టును ఎంపిక చేసినట్టు అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 1న ఉదయం 10 గంటలకు బీఆర్ స్టేడియంలో వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకొని రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలు.. అండర్ 14 విభాగంలో.. ఏం నిఖిల్, ఘన రమేష్, బీజీఎం పార్థసారథి, వై భార్గవ్, పి.హాసిని, పీ హర్షిణి, అక్షర. అండర్ 16 విభాగంలో.. జి.సూర్య తేజ, శ్రీ హర్ష, అష్రాఫ్, ఎం రాజ్ కుమార్, రసూల్, ఎం కళ్యాణ్, ఇసాక్, పి.వినయ్‌పాల్, విజయ్, భవన, సాయి శేఖర్, జి.వెంకటసాయి, వి.జ్యోతి, శ్రీ వి మేఘన, పి.అంకిత, జహీరా, కరిష్మా, పావని, అశ్విని, పి.చేతన, మొగల్ షాజియా, తసీన్ ప్రియదాస్ ఎంపికయ్యారు.

జస్టిస్ పుల్లయ్య కమిషన్ సిఫారసులను అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): జస్టిస్ పుల్లయ్య కమిషన్ 42 సిఫారసులను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలుచేయాలని డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందరబాబు అన్నారు. ఈ మేరకు సచివాలయం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజాసుందరబాబు మాట్లాడుతూ పున్నయ్య కమిషన్ సిఫారసులన్నీ అమలుచేస్తే ఎస్సీ, ఎస్టీ బాధితులకు మేలు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రస్థాయిలో దళిత, గిరిజన సంఘాలతో సమీక్ష నిర్వహిస్తానని త్వరలోనే తేదీని ప్రకటిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. బడుగు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రవచనం చేస్తున్న కోట రామలక్ష్మి, డాక్టర్ కోట సురేష్ కుమార్

భగవద్గీత జ్యోతి - మనో మార్గదర్శి

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై గురువారం భగవద్గీత జ్యోతి - మనో మార్గదర్శి జుగల్బందీ వ్యాఖ్యాన పూర్వక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోట రామలక్ష్మి భగవద్గీతలోని శ్లోకాలను చక్కగా పఠించి, భగవద్గీతలోని అంతరార్థాలను వివరించారు. కాటూరి మెడికల్ కాలేజి మానసిక వైద్య అధ్యాపకుడు డాక్టర్ కోట సురేష్ కుమార్ భగవద్గీతలోని పాత్రలు, వారి ప్రవర్తనను, సుఖ దుఃఖాల సమాహారాన్ని, మానసిక స్థితులను తెలియజేస్తూ భగవద్గీతను అనుసరించి నేటి కాలంలో మానవులు అనుసరించవలసిన నీతి నియమాలను చక్కగా తెలియజేశారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లచెరువు కోదండ రామాలయంలో ఆషాడ మాసం ముగింపు సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, కృష్ణకుమారి, సాంబశివరావు పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ, తబలాపై షణ్ముఖశర్మ వాద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

జాషువాకు ఘన నివాళులు

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా నగరంపాలెం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలు ప్రజా సంఘాల నాయకులు గురువారం ఘన నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరంపాలెం సెంటర్‌లోనున్న గుర్రం జాషువా విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అంటరానితనంపై తన కవితలతో దునుమాడారన్నారు. అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బహుజన మహాసభ కేంద్ర కమిటీ సభ్యుడు జీఆర్ భగత్‌సింగ్, విప్పర్ల ముత్తయ్య, వట్టికూటి సాంబయ్య, రవిబాబు తదితరులున్నారు.

● అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గుర్రంజాషువా వర్ధంతి కార్యక్రమం జరిగింది. జాషువా చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీవేత్త ముప్పాళ్ళ వీఎస్ ప్రసాదరావు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కవి బండికల్లు జమదగ్ని, పింగళి భాగ్యలక్ష్మీ, వీవీ రావ్, సత్యనారాయణ తదితరులున్నారు.



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాసరావు, భగత్‌సింగ్ తదితరులు

రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

● ఎమ్మెల్యే నసీర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర

● శారదాకాలనీ రూ.26లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, మేయర్ నాని

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విజనరీ పాలన సాగుతోందని, ఇది ఏపీ భవిష్యత్తును అద్భుతంగా మార్చబోతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని శారదాకాలనీ 16వ లైను నుంచి 21వ లైను మెయిన్ రోడ్డు నిర్మాణానికి మేయర్ కోవెలమూడి నానితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రూ.26 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో శారదాకాలనీలో అడుగుపెట్టాలంటే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. అలాంటి పరిస్థితుల నుంచి సుందరమైన రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం ఏడాది కాలంలోనే వందల కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. వర్షాలు వస్తే ఇళ్లు నీట మునిగిపోయేవని, ఇప్పుడు డ్రెయిన్ల నిర్మాణం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపబోతున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మద్దిరాల మ్యాని, మహంకాళి నరసింహారావు, గోళ్ళ ప్రభాకర్, వంగర ఏడుకొండలు, బాజీ, గిరి, రమణ, కేసాని ప్రసాద్, సుభాని, దేశబోయిన శ్రీనివాస్, రావూరి మోహన్‌కృష్ణ, కోట గోపాల్, కార్పొరేటర్ ముప్పవరపు భారతి, గుడిమెట్ల దయారత్నం, రాచకొండ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 50వ డివిజన్‌లో గురువారం జోరువానలోనూ సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నగర మేయర్ కోవెలమూడి నాని, ఎమ్మెల్యే నసీర్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి తమ పరిపాలన ఏడాది ప్రోగ్రెస్ గురించి ఎమ్మెల్యే నసీర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పింఛన్లు నాలుగు వేల రూపాయలు పెంచి ప్రతి నెలా ఇంటికే తీసుకొచ్చి అందిస్తున్నందుకు అవ్వతాతలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి వందల కోట్లతో పనులు చేపట్టామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచబోతున్నామని తెలిపారు. దీని కోసం ప్రతి ఒక్కరూ మార్గదర్శకులను గుర్తించాలని పిలుపునిచ్చారు. ఏడాది పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, అన్ని రంగాల్లో పురోగతి సాధించామని చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించామని తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తూ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్ల నిర్మాణాలు వేగవంతంగా చేపడుతున్నామని, అంతర్గత రోడ్లను సైతం సీసీ రోడ్లుగా మారుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మహంకాళి నరసింహారావు, గోళ్ళ ప్రభాకర్, క్లస్టర్ ఇంచార్జ్ వంగర ఏడుకొండలు, డివిజన్ అధ్యక్షులు బాజీ, గిరి, రమణ, కేసాని ప్రసాద్, సుభాని, దేశ బోయిన శ్రీనివాస్ యాదవ్, రావూరి మోహన్ కృష్ణ, కోట గోపాల్, కార్పొరేటర్ ముప్పవరపు భారతి, గుడిమెట్ల దయారత్నం, రాచకొండ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఔట్ ఫాల్ డ్రెయిన్లను శుభ్రం చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



భవనాలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధానంగా శివారు ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, అంతర్గత డ్రెయిన్‌లు మేజర్ డ్రెయిన్లలో కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద నిలిచే వ్యర్థాలను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ గోరంట్ల, రెడ్డిపాలెం, సరస్వతి నగర్, జయంతి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వారీగా తమ పరిధిలో డ్రెయిన్ల శుభ్రంపై దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య కార్మికులు తప్పనిసరిగా మధ్యాహ్నం సమయంలో అంతర్గత డ్రెయిన్లను శుభ్రం చేయాలని ఆదేశించారు. అలాగే వార్డులవారీగా ఖాళీస్థలాల యజమానులను గుర్తించి, స్థలాలు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలన్నారు. స్పందించని వారి స్థలాల్లో జీఎంసీ బోర్డ్‌లను ఏర్పాటుచేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులను ఆదేశించారు. అలాగే ప్రజల ఫిర్యాదులపై ప్రాధాన్యతగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయం పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారానికి కార్యదర్శులు బాధ్యతగా ఉండాలన్నారు. పర్యటనలో ఎస్ఎస్ ఐజాక్, టీపీఎస్ లక్ష్మణస్వామి, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి, సంక్షేమానికి ఆదాయపు పన్ను కీలకం

● ఇన్‌కం టాక్స్ డిప్యూటీ కమిషనర్ ప్రేమ్ సాగర్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌కమ్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ ప్రేమ్ సాగర్

గుంటూరు(విద్య), జూలై 24 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి, సంక్షేమానికి ఆదాయ పన్ను కీలకమని ఇన్‌కం టాక్స్ డిప్యూటీ కమిషనర్ పి.ప్రేమ్‌సాగర్ వెల్లడించారు గురువారం ఏసీ కళాశాలలో ఇన్‌కం టాక్స్ దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజస్ అధ్యక్షత వహించారు. ఇన్‌కం టాక్స్ కమిషనర్ ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ దేశంలో కోట్లాది మంది జనాభా ఉన్నారని, ఇందులో కొంతమంది మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ పన్ను ద్వారా అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. అంతేకాకుండా అనేక ప్రాజెక్టుల కోసం ఈ నిధులు వినియోగిస్తున్నారని వివరించారు. ఆదాయపు పన్నును తప్పనిసరిగా చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆదాయ పన్ను చెల్లింపునకు ఎవరు అర్హులు, పన్ను చెల్లింపు విధానం, ఐటీ రిటర్న్స్ దాఖలు తదితర అంశాల గురించి డిప్యూటీ కమిషనర్ ప్రేమ్ సాగర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపల్స్ జీఏ శాలిని, డాక్టర్ బీ విజయ్ కుమార్, ఐక్యు ఏపీ సమన్వయకర్త డాక్టర్ పీఎం వినయ్ తేజ, కామర్స్ శాఖ విభాగాధిపతి టి చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛరథ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు చేస్తున్న డీపీవో నాగసాయికుమార్

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో ఉన్న తడి, పొడి చెత్తను స్వచ్ఛ రథానికి అందజేసి వాటికి ప్రతిఫలంగా నిత్యావసర సరుకులు పొందాలని జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయికుమార్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం, మల్లవరం గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను సేకరిస్తున్న విధానాన్ని, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో జరుగుతున్న వర్మీ కంపోస్టింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం శానిటేషన్‌కి సంబంధించిన పలు రికార్డులతో పాటు, స్వర్ణ పంచాయతీ సైట్ లో జరుగుతున్న ఇంటి పన్నుల ప్యూరిఫికేషన్ విధానాన్ని తనిఖీ చేశారు. శనివారం నుంచి మల్లవరంలో స్వచ్ఛరథాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు, ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రోజా ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్ర సభ్యులు

మొక్కలు నాటడం అందరి బాధ్యత

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): సమస్త జీవులకు ప్రాణదాతలైన మొక్కలను నాటి, వాటిని చెట్లుగా మలచడం ప్రతి ఒక్కరి బాధ్యతని మేరా యువ భారత్ ఆంధ్రా ప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ అంశుమన్ ప్రసాద్ దాస్ అన్నారు. మేరా యువ భారత్, గుంటూరు ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ యువ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ పేరు మీదుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఒక మొక్క నాటి వాటిని సంరక్షణ చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమం లో మేరా యువ భారత్, గుంటూరు విభాగ అకౌంట్స్ ప్రోగ్రాం అసిస్టెంట్ పృథ్వి, జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, యువ కేంద్ర వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, వేదిక పై ఏడీఏ మోహన్‌రావు తదితరులు

గుంటూరు సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని అన్ని గ్రామాల్లో ప్రోత్సహించాలని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు అన్నారు. గురువారం గుంటూరులోని కృషిభవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం సంస్థ ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమం లో తొలుత రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్ వ్యవసాయ సిబ్బందిని ఉద్దేశించి జూమ్‌లో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యమైన తొమ్మిది సార్వత్రిక సూత్రాలను, ఎ గ్రేడ్, ఏటీఎం, ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతులను తద్వారా రైతులు పొందిన ప్రయోజనాలను ఆయన తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ప్రకృతి వ్యవసాయ రైతులు సాధించిన ఫలితాలు తెలిపారు. ఇప్పటిదాకా 80 గ్రామ పంచాయతీలు మాత్రమే ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఉన్నాయని, ఈ ఏడాది నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫార్మింగ్ ప్రోగ్రామ్ ద్వారా 233 గ్రామ పంచాయతీలు ప్రకృతి వ్యవసాయంలో భాగస్వాములు కావటానికి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.రవీంద్ర బాబు, గుంటూరు ఏడీఏ మోహన్‌రావు, జిల్లా యాంకర్ గోపి చంద్, ఆయా మండలాల నుంచి వచ్చిన వీఏఏలు పాల్గొన్నారు. జిల్లాలోని మంగళగిరి, దుగ్గిరాల, పొన్నూరు, ఫిరంగిపురం మండలాల్లో కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు.

మందుల దుకాణాలకు బ్లాక్ మెయిల్ కాల్స్

● డబ్బులిచ్చి మోసపోవద్దని సంఘం సూచన

గుంటూరు మెడికల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): "హలో.. మేం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆఫీస్ నుంచి కాల్ చేస్తున్నాం... మీరు ఎక్స్‌పైరీ దాటిన మందులు అమ్ముతున్నారని మీ షాపుపై మాకు కంప్లైంట్ వచ్చింది. మీ షాప్‌ను వెంటనే సీజ్ చేయమని పైనుంచి మాకు ఆర్డర్స్ వచ్చాయి... మీ షాపు సీజ్ చేయకుండా ఉండాలంటే వెంటనే రూ.30 వేలు ఫోన్ పే చేయండి" లేడీ వాయిస్‌తో పలు మెడికల్ దుకాణాలకు ఫేక్ కాల్స్, బ్లాక్‌మెయిల్ కాల్స్ వస్తున్నట్లు మెడికల్ కెమిస్టు, డ్రగ్గిస్టు సంఘాలు నేతలు హెచ్చరిస్తున్నారు. ఇటీవల పలుచోట్ల ఈ తరహా బెదిరింపు ఫోన్ కాల్స్‌తో ఔషధ దుకాణదారులను బ్లాక్ మెయిల్ చేస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆయా ఔషధ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి బెదిరింపు కాల్స్ వచ్చినప్పుడు హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణదారులు డబ్బులు చెల్లించి మోసపోవద్దని సంఘం నేతలు సూచిస్తున్నారు. ఇలాంటి ఫేక్ కాల్స్ వస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఏపీ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ప్రకటన విడుదల చేసింది. వాస్తవానికి మందుల తనిఖీల బాధ్యత జిల్లా ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయం పర్యవేక్షిస్తుంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఇందులో ప్రమేయం ఉండదు. అయితే ఫేక్ కాల్స్ చేసే వ్యక్తులు, ఆరోగ్యశాఖ నుంచి కాల్ చేస్తున్నట్లు చెబుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఇలాంటి బ్లాక్‌మెయిల్ కాల్స్ వస్తే, వెంటనే దుకాణదారులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని సంఘం నేతలు కోరుతున్నారు.

వీవీఐటీయూలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

పెదకాకాని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బహుళ దేశాలలో విద్యా, అధ్యయన అవకాశాలపై అవగాహన కలిగించేందుకు ఐడీపీ గుంటూరు ఆధ్వర్యంలో వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నొలాజికల్ యూనివర్శిటీలో గురువారం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్- 2025 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐదు దేశాల నుంచి 13 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సును వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ వై.మల్లికార్జున రెడ్డి, ఐడీపీ గుంటూరు మేనేజర్ రమేష్, వీవీఐటీయూ డీన్ డాక్టర్ ఎమ్‌వీ రఘురామ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ యూ.మాధవ్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.పావెల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, పాల్గొన్న ప్రముఖులు

పేదరిక నిర్మూలనకు వ్యాపార సంస్థలు ముందుకు రావాలి

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికం లేని సమాజాన్ని రూపొందించాలన్నదే పీ-4 కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని దీని కోసం వ్యాపారవేత్తలు, వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖులు ముందుకు రావాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం పీ- 4 కార్యక్రమంలో భాగంగా ఆమె నగరంలోని పలువురు బిల్డర్స్, ఇంజనీర్స్, కళాశాలల యజమానులు, పలు రంగాల వ్యాపారవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పేదల జీవన ప్రమాణాలు పెంచాలనే సదుద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పీ- 4 కార్యక్రమం చేపట్టారని, దీనికి సమాజంలో ఉన్న ధనవంతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, ప్రైవేటుతో పాటు ప్రజలు భాగస్వాములై పేదరిక నిర్మూలన కోసం కృషి చేయాలన్నారు. సంపదలో ఉన్నత స్థితిలో ఉన్న వారిలో 10శాతం మంది అట్టడుగున ఉన్న వారిలో 20 శాతం మంది పేదలను దత్తత తీసుకోవాలని కోరారు. దీని ద్వారా ఆర్థిక అసమానతలు రూపుమాపొచ్చని ప్రభుత్వం భావిస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఇప్పటికే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 20వేల బంగారు కుటుంబాలను గుర్తించామని, ఈ కుటుంబాలను మార్గదర్శులుగా ఆదుకోవటానికి ముందుకు రావాలని మాధవి కోరారు. ఈ నేపథ్యంలో పలువురు స్పందిస్తూ పలు కుటుంబాలకు మార్గదర్శులుగా మారటానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, యాగంటి దుర్గా రావు, గుమ్మడి హరిబాబు, అంకారావు, నాగ వంశీ, డీఎస్సార్, మాస్టర్ మైండ్స్ మోహన్, సరిపూడి అనిల్, పెరుమాళ్ళ మలినేని ఇంజనీరింగ్ కాలేజీ ప్రతినిధులు, బంగారుబాబు, బొమ్మిడాల రామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాలలో సీపీఐది బాధ్యతాయుత పాత్ర

● రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ముప్పాళ్ల, వేదికపై జంగాల అజయ్‌కుమార్ తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాలలో సీపీఐ బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక శారదా కాలనీలో గురువారం జరిగిన 25వ నగర మహాసభల్లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షానికి 11 మంది శాసనసభ్యులు ఉన్నా వారు చట్టసభలకు వెళ్ళడం లేదన్నారు. చట్టసభలలో సీపీఐకి ప్రాతినిధ్యం లేకపోయినా ప్రజల పక్షాన... ప్రజలకు రక్షణ కవచంగా నిరంతరం పనిచేస్తుందన్నారు. రానున్న నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ప్రధాన రాజకీయ శక్తిగా సీపీఐ ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు సైద్ధాంతికంగా, ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలలో వీరిద్దరూ ఒకే తాటిపై నడుస్తున్నారని విమర్శించారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన ఒక్క వాగ్దానాన్ని కూడా అమలు చేయని మోదీ అబద్ధాల పోటీలలో మొదటి బహుమతి సాధిస్తారని ఎద్దేవా చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ పేదల రాజ్య స్థాపనకు కృషి చేసే పార్టీ సీపీఐ అని చెప్పారు. కార్యక్రమంలో కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, అకిటి అరుణ్‌కుమార్, చల్లా చిన ఆంజనేయులు, మరియదాసు, సురేషు, విజయ్‌కుమార్, మున్నా, శ్రీనివాసరావు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పావులూరి హనుమంతురావు

రాజ్యాధికారంతోనే బీసీల అభ్యున్నతి

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారంతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల ఐక్య వేదిక నాయకుడు పావులూరి హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 52 శాతం జనాభా ఉన్న బీసీలు అదే స్థాయిలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధి జరగకపోవడం దురదృష్టకరమని అన్నారు. బీసీ కులాల అభివృద్ధికు అనేక కమిషన్లను వచ్చినప్పటికి, ఏ ఒక్క కమిషన్ నివేదికను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బీసీలో ఉన్న కులాల వారిగా సంఘటితం చేసుకుంటూ గ్రామ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం సాధించేందుకు ఈ నెల 26, 27 తేదీలలో కడప, అనంతపురం పట్టణాల్లో బీసీ కులాల వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

ఆంధ్రజ్యోతి

కంట్రిబ్యూటర్లు కావలెను

● చేబ్రోలు ● నాగార్జున యూనివర్సిటీ

● గుంటూరు సిటీ, రూరల్ ప్రాంతాలు

..పైన పేర్కొన్న కేంద్రాల్లో వార్తల సేకరణకు కంట్రిబ్యూటర్లు కావలెను. అభ్యర్థులు డిగ్రీ చదివి ఉండాలి. తెలుగు భాషలో పరిజ్ఞానం, సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం ఉండాలి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు **28-07-2025 (సోమవారం)** ఉదయం 11-00 గంటలకు జరిగే రాత పరీక్షకు హాజరుకావలెను.

అడ్రస్: ఆంధ్రజ్యోతి కార్యాలయం రఘుమాన్షన్ 4/1 బ్రాడీపేట, గుంటూరు

ఆహా.. అమరావతి!


వేగంగా నిర్మాణం జరుగుతున్న ఏపీ సెక్రటేరియట్ హెచ్‌ఓడీ భవన నిర్మాణం


తుది దశకు ప్రభుత్వ ఉద్యోగుల భవన సముదాయం


శరవేగంగా ఈ6, ఎన్10 జంక్షన్ అండర్ డ్రెయినేజీ పనులు


ఏపీ సెక్రటేరియట్ హెచ్‌ఓడీ భవనాల గ్రౌండ్ వర్క్ పనులు






ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. సెక్రటేరియట్ హెచ్‌ఓడీల భవనాల నిర్మాణం వేగంగా జరుగుతుండగా.. ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాలు తుది దశకు చేరుకున్నాయి. సైడ్ డ్రెయిన్లు, గ్రీనరీ, పైపులైన్, ఎలక్ట్రికల్ పనులతో అంతా హడావిడిగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అమరావతి ఆహ్లాదకరంగా కనువిందు చేస్తోంది.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

అరచేతిలో పుర సేవలు!



● సేవా మిత్ర మాదిరి.. పుర మిత్ర మొబైల్ యాప్

● మొత్తం 150 రకాల సేవలు

● సచివాలయ సిబ్బంది స్పెషల్ డ్రైవ్

ప్రజల చెంతకే పరిపాలనను తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో పలు రకాల సేవలను ప్రజల అర చేతిలోకి తెచ్చిన ప్రభుత్వం.. పురపాలక సేవలను కూడా పౌరుల చెంతకు తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. పట్టణాలు, నగరాల్లో ఉండే ప్రజలకు పౌర సేవలను సులభతరం చేయడం కోసం సేవా మిత్ర మాదిరిగా 'పురమిత్ర' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దానిపై అవగాహన కల్పిస్తూ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తోంది.

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ఉండే ప్రజలు పౌర సేవల కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తుంది. నగరాల్లో అయితే ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. మున్సిపాలిటీలకు పన్నులు కట్టాలన్నా, చార్జీలు చెల్లించాలన్నా, ఏదైనా సమస్యపై ఫిర్యాదులు చేయాలన్నా గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండాల్సి ఉంటుంది. వార్డు సచివాలయాలు వచ్చిన తర్వాత వారంతా స్థానిక సచివాలయాల దగ్గరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు ఆపాటి ఇబ్బంది కూడా లేకుండా చేయడం కోసం రాష్ట్ర పురపాలక శాఖ 'పురమిత్ర' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా అనేక రకాల డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చింది.

రోజుల వ్యవధిలోనే పరిష్కారం

రోజుల వ్యవధిలోనే సమస్యల పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. సమస్యను పంపేందుకు యాప్‌లో ఫీచర్స్ కూడా పొందుపరిచారు. మన చుట్టూ ఉన్న సమస్యను ఫొటో తీసి, వాయిస్ రికార్డుతో అక్షరాలను టైప్ చేసి పంపించే విధంగా యాప్‌ను రూపొందించారు. పంపిన సమస్య, ఆ సమాచారం నేరుగా సంబంధిత విభాగాధికారికి వెళ్తుంది. పరిష్కారం చూపేందుకు కనీసం మూడు నుంచి 15 రోజులు, లేదా 30 రోజుల వ్యవధి నిర్ణయించారు. సమస్య తీవ్రత బట్టి పరిష్కారం చూపిస్తారు.

యాప్‌ను ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి?

ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ వాడేవారు గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి 'పురమిత్ర' అని టైప్ చేస్తే యాప్ ప్రత్యక్షమవుతుంది. దాన్ని మొబైల్‌లోకి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తరువాత ఓపెన్ బటన్ క్లిక్ చేసి యాప్‌ను ఓపెన్ చేసుకోవాలి. మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను ఎంపిక చేసుకోవాలి. వాటి పరిధిలోని సచివాలయాన్ని ఎంచుకోవాలి. ఆ తరువాత పేరు మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఎంటర్ చేసిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేస్తే యాప్‌లో సేవలకు సంబంధించిన ఆప్షన్లు కనిపిస్తాయి. పబ్లిక్ హెల్త్, మొదలు రెవెన్యూ సేవల వరకూ 8 విభాగాలు కనిపిస్తాయి. మన సమస్య ఏ విభాగానికి సంబంధించినదైతే ఆ విభాగాన్ని టచ్ చేస్తే అందులో పలు రకాల సేవలకు సంబంధించిన ఆప్షన్స్ కనిపిస్తాయి. వాటిని క్లిక్ చేసి మన సమస్యను ప్రభుత్వానికి తెలియజేయవచ్చు.

యాప్ ద్వారా 150 సేవలు



పురమిత్ర యాప్ ద్వారా మొత్తం 150 సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. రెవెన్యూ, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, అకౌంట్స్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు సంబంధించిన 150 రకాల సేవలు అందుబాటులోకి తెచ్చారు.

● పన్ను చెల్లింపులు, కుళాయి చార్జీల చెల్లింపులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు, వివాహ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకునే సదుపాయం ఈ యాప్‌లో కల్పించారు.

● తమ ఆవాసాల వద్ద ప్రజలు ఎదుర్కొనే రోజువారీ సమస్యలపై అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు కూడా చేయవచ్చు. తాగునీటి సరఫరా సమస్య, విద్యుత్ అంతరాయాలు, పారిశుధ్య నిర్వహణ, డ్రెయినేజీ సమస్య, రహదారుల సమస్యలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా చేసే సదుపాయం ఈ యాప్‌లో కల్పించారు.

● పారిశుధ్య నిర్వహణకు సంబంధించి దోమలు, వీధికుక్కల సమస్య, శ్మశాన వాటికల సమస్య, బయో, మెడికల్ వ్యర్థాల తొలగింపు, వీధులను శుభ్రం చేయకపోవడం, గుర్తు తెలియని మృతదేహాలు, సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ, రోడ్ సైడ్ ఆహార కల్తీ, గార్బేజ్ బిన్‌ల ఏర్పాటు, చెత్త తొలగింపు వంటి మొత్తం 53 రకాల సేవలు అందుబాటులో ఉంచారు.

● టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి పార్కింగ్ సమస్య, అనధికార ప్రకటనలు, బోర్డులు, హోర్డింగులు, ట్రీ గార్డుల సమస్య, అనధికార కట్టడాలు, కమ్యూనిటీ హాళ్ల దుర్వినియోగం, ప్రమాదకరంగా ఉన్న తీగల సమస్య, సెల్ టవర్ల సమస్య, మార్కెట్ సమస్యలు, ఫుట్‌పాత్‌ల నిర్వహణ, ఆక్రమణ వంటి 13 రకాల సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చు.

● వాటితోపాటుగా నీటి సరఫరాకు సంబంధించి 4, పట్టణ పేదరిక నిర్మూలనకు సంబంధించి 12 సేవలు, పాలనా పరమైన సేవలు, 6,ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 16, వీధి దీపాల సమస్యపై 3, రెవెన్యూ విభాగానికి సంబంధించి 12 సేవలు ఈ యాప్‌లో అందుబాటులోకి తెచ్చారు. వీటికి సంబంధించిన సమస్య తలెత్తినప్పుడు ఇంట్లో నుంచే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద ఉధృతి

● దిగువకు 25 క్యూసెక్కులు ● డెల్టా కాల్వలకు 4,321 క్యూసెక్కులు విడుదల



తాడేపల్లి టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి గురువారం కొనసాగింది. ఎగువన ఉన్న ప్రధాన వాగులు వజినేపల్లి నుంచి 1018, వెలగలేరు నుంచి 2070, కీసర నుంచి 2193, పాలేరు నుంచి 2595 మొత్తం వరద నీరు 27,605 క్యూసెక్కులు బారేజి రిజర్వాయర్ వద్దకు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్‌లో 11.8 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 35 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 25,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా తూర్పు డెల్టా కాల్వలకు 3,305, పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ రాజేష్ తెలిపారు.

సీఆర్డీఏ జాబ్ మేళా సద్వినియోగం

తుళ్లూరు, జులై 24(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(ఏపీ సీఆర్డీఏ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరు సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో గురువారం జాబ్ మేళా జరిగింది. ఈ మేళాలో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, ఎఫ్ ట్రానిక్స్ సిస్టం ప్రవేటు లిమిటెడ్, డిక్సన్ టెక్నాలజీస్, హవెల్స్ ఇండియా, కురాకు ఫైనాన్సియల్ సేర్వసెస్, ఫోర్డ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 400కి పైగా టెక్నికల్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ జాబ్ మేళా నిర్వహించారు. మేళాలో 318 మంది అభ్యర్థులు హాజరు కాగా, 102 మందికి ఉద్యోగాలు లభించాయి. వీరిలో 30 మంది అభ్యర్థులు ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌ల ఆఫర్ లెటర్లు అప్పుడే అందుకున్నారు. ఈ క్యాక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి, సీఆర్డీఏ డీసీడీఓ బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. సీఆర్డీఏ సీనియర్ లైవ్‌లీ హుడ్ ఆఫీసర్ శంకరు, జూనియర్ లైవ్‌లీ హుడ్ స్పెషలిస్ట్ క్రాంతి కుమార్, నరసింహం, వెంకటేశ్వర్లు పాల్గొని జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించారు.

మిర్చి యార్డులో అక్రమాలపై..

మార్కెటింగ్ కమిషనర్‌కి ఫిర్యాదులు

● విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీడీకి ఆదేశాలు

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో జరుగుతోన్న అక్రమాలపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఫిర్యాదుపై విచారణ జరుగుతుండగా.. మరో నలుగురు ఫిర్యాదులు పంపించారు. సీఎంని అడ్రస్ చేస్తూ మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయానికి రిజిష్టర్ పోస్టులో నాలుగు ఫిర్యాదులు అందాయి. దీంతో వాటిపై విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని మార్కెటింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ దివాకర్‌కు మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత ఆదేశాలు జారీ చేశారు. ఏక కాలంలో ఈ విచారణలు మిర్చి యార్డులో జరుగుతున్నాయి. ఎమ్మెల్యే మాధవి ఫిర్యాదుపై సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ చంద్రిక విచారణ జరపనుండగా.. నలుగురి ఫిర్యాదులపై ఆర్‌డీడీ దివాకర్ విచారణ చేస్తున్నారు. దీంతో మార్కెటింగ్ శాఖలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

పంచాయతీ రాజ్‌లో..

ఎంప్లాయీస్ ఎన్నికల సందడి

● ఆగస్టు 5న జిల్లా పరిషత్ యూనిట్‌కు ఎలక్షన్

● 7 నుంచి ఉమ్మడి జిల్లాలోని యూనిట్లకు

గుంటూరు సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా అధ్యక్షుడు జొన్నల పూర్ణ చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూచిపూడి మోహన్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఆగస్టు 5న సాయంత్రం 4 గంటలకు గుంటూరు జిల్లా పరిషత్ యూనిట్‌కు ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. తదుపరి ఉమ్మడి జిల్లాలోని యూనిట్‌లకు ఎన్నికల ప్రక్రియ ఆరంభం అవుతుందన్నారు. గుంటూరు రూరల్, ప్రత్తిపాడు యూనిట్‌లకు 7న, మంగళగిరి, తాడికొండ యూనిట్‌లకు 11న, పెదకూరపాడు, రాజుపాలెం, ఫిరంగిపురం యూనిట్‌లకు 12న ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. అదేవిధంగా నరసరావుపేట డివిజన్ నాదెండ్ల, నరసరావుపేట యూనిట్‌లకు 7న, వినుకొండ, ఈపూరు యూనిట్లకు 11న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. గురజాల డివిజన్ పిడుగురాళ్ల, గురజాల, మాచర్ల యూనిట్‌లకు 12న ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. తెనాలి డివిజన్ దుగ్గిరాల, తెనాలి, అమర్తలూరు యూనిట్‌లకు ఆగస్టు 7న, పొన్నూరు, బాపట్ల యూనిట్‌లకు 11న, రేపల్లె, నగరం యూనిట్‌లకు 12న ఎన్నికలు జరుగుతాయని వివరించారు. ఎన్నికల అధికారులుగా పలువురు ఏఓలను నియమించినట్లు వెల్లడించారు.

ఏవో..ప్రమోషన్లు?

● అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ల ఎదురు చూపులు

● ఖాళీలు ఉన్నా.. కరుణ చూపని జడ్పీ అధికారులు

● సెక్షన్‌లలో చక్కర్లు కొడుతున్న ఫైల్

గుంటూరు సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో ప్రమోషన్‌ల కోసం ఉద్యోగులు తపస్సు చేయాల్సి వస్తోంది. ఖాళీలు ఉన్నా ఉద్యోగోన్నతి కల్పించే విషయంలో అధికారుల కరుణ కరువైనట్లు కనిపిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాలు, జిల్లా పరిషత్‌లో మొత్తం 67 మంది ఏఓ (అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్)లు ఉండాలి. వాటిలో ప్రస్తుతం సుమారు 9 వరకు ఖాళీలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్‌లతో ప్యానల్ రూపొందించి ఖాళీ అయిన స్థానాల్లో నియమించాలి. కొద్ది రోజులుగా అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్లు పదోన్నతి ఫైల్‌కు మోక్షం కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. అయినా కూడా సంబంధిత ఫైల్ ముందుకు సాగడం లేదని తెలుస్తోంది.

ఇవిగో ఖాళీలు

మండల పరిషత్‌లో ఎంపీడీఓ తర్వాత అత్యంత కీలకమైన పాత్ర పరిపాలన అధికారిదే. ప్రభుత్వం పరిపాలన అధికారులుగా వారికి కీలకమైన బాధ్యతలు అప్పగించింది. ప్రాధాన్యం కలిగిన పోస్టులు చాలా చోట్ల ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో బొల్లాపల్లి, గురజాల, శావల్యాపురం, పిట్టలవానిపాలెం, ప్రత్తిపాడు, ఈపూరు, నూజెండ్ల మండలాల్లో పూర్తిస్థాయి ఖాళీలున్నాయి. ఈ నెలాఖరుకు రాజుపాలెం, రొంపిచర్ల కూడా ఖాళీ అవుతాయి. ఆగస్టు 15 నాటికి మరో పోస్ట్ కూడా ఖాళీ అవుతుంది. ప్రస్తుతం ఖాళీ ఉన్న స్థానాల్లో సీనియర్ అసిస్టెంట్‌లను నియమిస్తే వారి కింద వారికి కూడా ప్రమోషన్‌లకు అవకాశం వస్తుంది. ఎన్నో సంవత్సరాల నుంచి అర్హత ఉండి ఇంకా జూనియర్ అసిస్టెంట్‌లకు సీనియర్ అసిస్టెంట్‌లుగా, రికార్డు అసిస్టెంట్‌లకు జూనియర్ అసిస్టెంట్‌లుగా, ఆఫీస్ సబార్డినేటర్లకు రికార్డు అసిస్టెంట్లుగా ప్రమోషన్ లభిస్తుంది. ఇలా ఒక ప్రమోషన్‌తో చాలా మంది వ్యవహారం ముడిపడినందున అధికారులు ఏఓల ఫైల్ కు మోక్షం కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నాలుగు నెలల క్రితం ఖాళీ అయిన స్థానాల్లో కనీసం ఈ నెలాఖరుకు అయినా ఉద్యోగోన్నతి నియామకాలు చేపడతారని సీనియర్ అసిస్టెంట్‌లు ఆశపడుతున్నారు.


ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయం

తిలాపాపం తలా ఎంత?

● రూ.40 కోట్ల భూ అక్రమ రిజిస్ట్రేషన్‌పై పునర్విచారణ

● రంగంలోకి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ

● జిల్లా రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో నేటి నుంచి విచారణ

నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఏసీబీ కన్ను..?

గుంటూరు సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంచలనం సృష్టించిన రూ.40 కోట్ల భూమి నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపించాలని స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించినట్లు తెలుస్తోంది. అసలు ఈ మొత్తం వ్యవహారంలో నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్‌తో పాటు, మిగిలిన వారి పాత్ర ఎంత మేరకు ఉందన్న వ్యవహారంపై లోతైన పరిశీలన చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐ జీ నిర్ణయించినట్లు సమాచారం. తమ భూమిని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని గతంలోనే బాధితుడు కొత్తపల్లి శ్రీనివాసరావు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీని కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన విచారణ జరిపించి కేసు నమోదు చేయించాలని అప్పటి జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా రిజిస్ట్రార్ మారడం, అప్పట్లో జరిగిన విచారణ సమగ్రంగా లేకపోవడంతో మళ్లీ పునర్విచారణ జరిపించాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. శుక్రవారం నుంచి విచారణ ఆరంభమయ్యే అవకాశం ఉంది.

మాచర్ల ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పాత్ర..

గుంటూరుకు చెందిన కొత్తపల్లి పద్మజ భూమిని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో రోజుకొక పేరు తెరపైకి వస్తోంది. అప్పట్లో నరసరావుపేటలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ప్రస్తుతం మాచర్ల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న వ్యక్తి మొదట ఆభూమికి 18 జీపీఏలు చేసినట్లు తేలింది. ఆ తర్వాత రోజు విధులకు హాజరైన నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఆ దస్తావేజులకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఆ దస్తావేజులకు గుంటూరులోని కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ అప్రూవల్ ఇచ్చారు. కొత్తపల్లి శ్రీనివాసరావు నల్లపాడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్, కొరిటపాడు సబ్ రిజిస్ట్రార్ పేర్లు ఉన్నాయి. వారిపై కేసు కూడా నమోదైంది. మాచర్ల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ పేరు కూడా కేసులో చేర్చాలని బాధితులు పోలీసులను కోరుతున్నట్లు తెలిసింది.

రాయబేరాలు..

మొత్తం రిజిస్ట్రేషన్ శాఖకే తలవంపులు తెచ్చిన మాజీ జాయింట్ రిజిస్ట్రార్‌ను కేసు నుంచి తప్పించేందుకు భారీ ప్రయత్నం జరుగుతుంది. అదే శాఖకు చెందిన కొందరు ఈ వ్యవహారంలో అసలు ఆయన తప్పు లేదని అంటున్నారు. ఆయన తప్పు లేకపోతే అసలు దోషులు ఎవరు అన్న దానిపై అక్కడ సమాదానం దొరకడం లేదు. ఈ వ్యవహారంలో అందరికీ శిక్ష పడాలని బాధితుడు శ్రీనివాసరావు అంటున్నారు. ఈ కేసు ఒక నమూనా కావాలని ఆయన పేర్కొన్నారు.

నరసరావుపేట రైటర్ పెట్టుబడి..

రూ.40 కోట్ల భూమికి నకిలీ రిజిస్ట్రేషన్ చేయించేందుకు నిందితులు భారీ మొత్తంలో ముడుపులు ముట్టజెప్పారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్కరికి రూ.10 లక్షలు తగ్గకుండా ఏర్పాటు చేశారని వెల్లడయ్యింది. ఆ నగదును నరసరావుపేట లోని దస్తావేజు రైటర్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అలా పెట్టుబడి గా పెట్టిన సొమ్మును రాబట్టుకునేందుకు నకిలీ రిజిస్ట్రేషన్ ద్వారా సంక్రమించిన భూమిని తాకట్టు పెట్టినట్లు చెబుతున్నారు. ఈ భూమి మీద సుమారు రూ. 7 కోట్ల వరకు తాకట్టు సొమ్మును పొందినట్లు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని తలా కొద్దిగా వాటాలు వేసుకొని పంచుకున్నారని ప్రచారం జరుగుతోంది.

నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఏసీబీ కన్ను?

గుంటూరు కు సంబంధించిన రూ. 40 కోట్ల భూమి నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారం లో అధికారుల పాత్రపై ఏసీబీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నకిలీ రిజిస్ట్రేషన్ కు ఆద్యులైన నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్, కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్, మాచర్లలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న సీనియర్ అసిస్టెంట్‌ల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించినట్లు తెలిసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా సంబంధిత అధికారులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అసలు ఈ నకిలీ రిజిస్ట్రేషన్ కోసం ఎంత మొత్తం చేతులు మారింది.. ఎవరెవరికి వాటాలు దక్కింది అన్న దానిపై కూడా వివరాలు సేకరిస్తునట్లు సమాచారం. ఈ వ్యవహారంలో అప్పటి జిల్లా రిజిస్ట్రార్ పాత్రపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

గీతాసారం

పత్రం, పుష్పం, ఫలం, తోయం


'మరింత అభివృద్ధి చెందాలి, రక్షణతో, భద్రతతో ఉండాలి' అనే కోరికను మనం వదిలేస్తే... మనల్ని, మన కుటుంబాలను, మన సంస్థలను ఎవరు చూసుకుంటారు?... కోరికలను వదులుకోవాలని ఎవరైనా బోధించినప్పుడు మనలో సాధారణంగా కలిగే భయం ఇది. ఇది సహజంగా, తార్కికంగా కనిపిస్తుంది. తన భక్తులు ఇలాంటి భయాన్ని అధిగమించడం కోసం నిశ్చల చిత్తంతో తనను ధ్యానించేవారి యోగక్షేమాలను తనే వహిస్తానని (యోగ క్షేమమ్ వహామ్యహమ్) శ్రీ కృష్ణుడు హామీ ఇచ్చాడు. ఇక్కడ 'యోగం' అంటే కలయిక. ఎవరైతే నిశ్చలమైన బుద్ధితో భగవంతుడితో ఐక్యత సాధిస్తారో... వారి ఎదుగుదలకు, సంక్షేమానికి హామీ, అన్నిటికన్నా శక్తివంతుడైన భగవంతుడి కృప లభిస్తుంది.

"గ్రహ దేవతలను పూజించేవారు... వారిని చేరుకుంటారు. పితృదేవ



తలను ఆరాధించేవారు వారి దగ్గరకు వెళ్తారు, భూతప్రేతాల్ని అర్చించేవారు అలాంటి వాటిలోనే పుడతారు" అని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. అంటే కోరికలు తీర్చుకోవడానికి చాలామంది వివిధ దేవతలను ఆశ్రయిస్తారు. కానీ కోరికలు వదులుకున్నవారు ఆయనను చేరుకుంటారు. వారి శ్రేయస్సును ఆయన నిర్ధారిస్తాడు.

కాగా 'శ్రద్ధ' అనేది భగవద్గీత సారాంశం. భగవదారాధనలో శ్రద్ధ ప్రధానమని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. ఆకులు, పువ్వులు, ఫలాలు, ఆఖరికి నీరైనా సరే (పత్రం, పుష్పం, ఫలం తోయం) ... పూర్తి భక్తి భావంతో, శ్రద్ధతో సమర్పిస్తే... వాటిని తాను ఆనందంగా స్వీకరిస్తానని చెప్పాడు. కాబట్టి భగవంతుడి ప్రసన్నతను పొందడానికి వేరే దేనికోసం వెతకాల్సిన అవసరం లేదు. మన చుట్టూ సులువుగా లభించే మామూలు వస్తువులను భక్తిగా సమర్పిస్తే చాలు.



కె.శివప్రసాద్



విశేషం

ఏ మహిళ దోసిట శనగల మూటను పలకరించినా, పాదాలకు రాసుకున్న పసుపును పరామర్శించినా, శిరసు మీద అక్షతలను చూసి విశేషమేమిటని అడిగినా, ముంజేతి చేమంతి పూలతోరాన్ని ముచ్చటగా మాట్లాడించినా, అన్నిటికన్నా ముందుగా కొత్త పట్టుచీరల పెళపెళలను విన్నా, కొత్త బంగారు నగల తళతళలను కన్నా, తల పైకెత్తినప్పుడు... 'ఎప్పుడు కురుస్తానో నాకే తెలియదం'టూ నల్లని రూపంతో, ఫెళఫెళ గర్జన ధ్వనులతో కనిపిస్తున్న మేఘాలను చూసినా... 'ఇంకేముంది? ఇది శ్రావణం సుమా!' అని అర్థమైపోతుంది. ఇదంతా అత్యంత మనోహరం కదూ!

సర్వ శుభప్రదం...శ్రావణం

నేటినుంచి శ్రావణమాసం

మంగళగౌరీ వ్రతం ఎందుకంటే...

శ్రావణ మాసం వ్రతాల మాసం. విశేషమేమిటంటే... శ్రీమహాలక్ష్మికి ప్రీతికరమైన శ్రావణ మాసంలో మంగళగౌరికి కూడా సముచిత స్థానం ఉంటుంది. ఈ మాసంలో వచ్చే ప్రతి మంగళవారం ఆరాధించేది గౌరీ దేవినే. హిమవంతుని పుత్రిక అయిన శైలజ... వర్షంలో తడుస్తూ, ఎండలో ఎండుతూ, చలికి గడ్డకట్టుకుపోతూ ఉన్నా చలించకుండా తపస్సు చేసింది. దానితో ఆమె శరీరం గౌర వర్ణానికి (ఎండిపోయిన లేత పసుపుపచ్చ దర్భ గడ్డి రంగులోకి) మారింది. అందుకే ఆమె 'గౌరి' అయింది. శంకరుణ్ణి తన భర్తగా (పినాకపాణిం పతిమాప్తు మిచ్ఛతి) భావించి, చివ



రకు ఆ మంగళకరమైన లక్ష్యాన్ని సాధించింది కాబట్టి ఆమెను "మంగళ గౌరి' అని పిలుస్తాం. ఆ గౌరి తన కోరికను నెరవేర్చుకొని, కాబోయే భర్తను తన వద్దకు రప్పించుకొని, తన మాట వినేలా ఏ విధంగా చేసుకుందో... అటువంటి శక్తిని తనకు ఇవ్వాలని ప్రార్థించడానికి, ఆ శక్తిని పొందడానికి వివాహంలో ప్రతి వధువుతో గౌరీ పూజ చేయిస్తారు. అంటే మంగళగౌరీ వ్రతం అనేది భార్యాభర్తల మధ్య అన్యోన్యత సిద్ధించడం కోసం చేసేది. ఆ గౌరీదేవి శంకరుణ్ణి వివాహం చేసుకున్నాక పార్వతిగా లోక ప్రసిద్ధురాలయింది. విఘ్నాలను నివారించగల శక్తి ఉన్న గణపతి, సంతానాన్ని ప్రసాదించి, సర్ప దోషాన్ని పోగొట్టగలిగే శక్తి ఉన్న కుమార స్వామి ఆమె సంతానం. కాబట్టి... మంగళ గౌరీ వ్రతం ఆచరించడం అన్యోన్య దాంపత్యం కోసం, విఘ్ననాశనం కోసం, సంతాన ప్రాప్తికోసం,

ఆరోగ్య సూత్రాలు ఎన్నెన్నో...

మంగళ గౌరీ వ్రతం చేసినప్పుడు... బియ్యపు పిండి, బెల్లం కలిపిన కుందెను చేసి, దాని నిండా ఆవు నెయ్యి పోసి, పత్తితో చేసిన వత్తిని వేసి వెలిగించి... వ్రత కథ చదువుతారు. కథ పూర్తయ్యేసరికి ఆ ఆవు నెయ్యి ఆ వత్తి మంట ద్వారా నిదానంగా ఉడుకుతుంది. గర్భధారణలో ఏవైనా దోషాలుంటే తొలగించగలిగే శక్తి ఉన్న దివ్యౌషధంగా మారుతుంది. పూర్వం పసుపు కొమ్ముల్ని దంచి పసుపుగాను, దాంట్లో చిన్నాళమనే చిన్న రాతిని వేసి, దంచి, కలిపి కుంకుమగానూ ఆ తల్లి సమక్షంలో చేసుకొని... ముత్తయిదువులకు పంచుకొనే వారు. మహిళలందరూ కలిసి, అమ్మవారి పాటలు పాడుకుంటూ... అమ్మవారి సమక్షంలోనే కాటుక తయారు చేసుకొనేవారు. అంగళ్ళలో దొరికే వాటితో పోలిస్తే ఇవి ఎంతో ఆరోగ్యకరం. కాగా... మహిళలు చెవిలో పువ్వు పెట్టుకోవడం, కంఠానికి గంధం రాసుకోవడం సరికాదని, ఏ పుష్పాన్నయినా తలలో, అంటే కొప్పులోనే ధరించాలని, గంధాన్ని రెండు దవడలకు మాత్రమే సన్నని చారలుగా ధరించాలని శాస్త్రం చెబుతోంది. దీనికి కారణం ఏమిటి? దుర్వాసనను మాత్రమే ఇష్టపడే పేలు, ఈపెలు (చిన్న పేను గుడ్లు) లాంటివి పూల సుగంధం వల్ల తలలో చేరవు. అలాగే మాట ఉత్పత్తి అయ్యే అవయవాల్లో దవడలు అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. కాబట్టి "ఆ గంధం ఎలా పరిమళం వెదజల్లుతూ ఆకర్షిస్తుందో... మీ మాటలు కూడా అలాగే ఉండాలి "అని ఇది సూచిస్తోంది.

కోరిన వరాలిచ్చే పూజ...

శ్రావణమాసంలో మహిళలు అత్యంత శ్రద్ధాభక్తులతో చేసుకొనేది వరలక్ష్మీ వ్రతం. చిత్తడి చిత్తడిగా ఉండే వర్షాకాలంలో ఈ వ్రతాన్ని నిర్దేశించడానికి కారణం... వర్షానికి తడిసి భూమినుంచి వచ్చే పంటే గొప్ప ధనం అని చెప్పడానికే. అలాగే... మహా ధనవంతురాలికి, సంతానం లేక తపన పడుతున్న వారికి, అత్తమామలతో సఖ్యత లేని వారికి, అనారోగ్యంతో, ఇతర సమస్యలతో తల్లడిల్లుతున్నవారికి ధనం ఇస్తే ప్రయోజనం ఉంటుందా? అది చెరువుకు జలదానం చేసినట్టే కదా! కాబట్టి తాను సంపదకు సంకేతం అయినప్పటికీ... ఎవరైతే తనను పూజించి, తనకు ఏ లోపం ఉందో ఆ లోపం తీరడం కోసం దేన్ని వరంగా (వృణుతే ఇతి) కోరుతారో దాన్ని ఇస్తానంది శ్రీమహాలక్ష్మి. ఆ విధంగా తనను వరలక్ష్మిగా, తన పూజను వరలక్ష్మీ పూజగా స్థిరపరుచుకుంది. ఆమెతో పాటు మంగళగౌరిని కూడా ఈ నెల రోజులూ ఆరాధించాలనే నిర్దేశానికి కారణం... శివుని పత్ని అయిన గౌరికి, విష్ణు పత్ని అయిన తనకు, అలాగే శివకేశవులకు ఎలాంటి భేదం లేదని దృఢంగా ప్రకటించడానికే.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు, 9866700425


సందేశం

ఆ దారిలో అంతా శుభమే!

పూర్వం ఒక గ్రామంలో సామాన్యుడైన యువకుడు ఉండేవాడు. అతను రోజూ అయిదు పూటలా నమాజు చేసేవాడు. దివ్య ఖుర్‌ఆన్ పఠించేవాడు. తనకు ఉన్నదానిలో పేదలకు దానం చేసేవాడు. సమీపంలో ఉన్న పట్టణానికి పండ్లు తీసుకువెళ్ళి విక్రయిస్తూ జీవించేవాడు.

ఒక రోజు అతని దగ్గరకు ఒక సాధువు వచ్చాడు. పండ్లు తీసుకొని డబ్బు ఇవ్వబోయాడు. కానీ ఆ సాధువు ఎంత చెప్పినా డబ్బు తీసుకోవడానికి ఆ యువకుడు నిరాకరించాడు. "మీరు నా కోసం ప్రార్థన చేయండి. నా వ్యాపారం బాగా వృద్ధి చెందాలని అల్లాహ్‌ను ప్రార్థించండి" అని కోరాడు. ఆ సాధువు సరేనంటూ ముందుకు సాగిపోయాడు. కొన్నాళ్ళలో ఆ యువకుడి వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. దానితో అతనిలో ఆశ పెరిగింది. డబ్బే లోకం అయిపోయింది. ఎప్పుడో ఒకప్పుడు నమాజ్ చేసేవాడు. ఖుర్‌ఆన్ చదవడం క్రమంగా మానేశాడు. ఎవరైనా పేదలు దానం అడిగితే కోపగించేవాడు.

> మనం కష్టంలో ఉన్నా, సుఖంలో ఉన్నా అల్లాహ్‌ను గుర్తు చేసుకోవాలి. నమాజ్ క్రమం తప్పకుండా చేయాలి. పేదలకు దానధర్మాలు చేయాలి. నిత్యం దివ్య ఖుర్‌ఆన్ చదవాలి. ఇరుగు పొరుగువారిని, బంధువులను, మిత్రులను మరచిపోకూడదు. అల్లాహ్ చూపిన మార్గంలో చిత్తశుద్ధితో నడిస్తే అంతా శుభమే జరుగుతుంది.



బంధు మిత్రులను దగ్గరకు చేరనిచ్చేవాడు కాదు. పగలూ, రాత్రీ వ్యాపారం ఇంకా వృద్ధి చెందాలనే ఆశ, డబ్బు సంపాదించాలనే ఆలోచన తప్ప మరేదీ ఉండేది కాదు.

అతణ్ణి పూర్వం కలిసిన సాధువు... కొన్నేళ్ళ తరువాత ఆ ప్రాంతానికి వచ్చాడు. అక్కడ చాలా పెద్ద దుకాణం కనిపించింది. పండ్లు కొనడానికి లోపలికి వెళ్ళి చూస్తే... ఆ యువకుడు కనిపించాడు. కానీ ఈసారి అతనిలో మార్పు ఆ సాధువుకు స్పష్టంగా కనిపించింది. అతను కుర్చీ లోంచి లేవలేదు. సాధువుకు సలాం చేయలేదు. గుర్తుపట్టనట్టు ఉండిపోయాడు. ఆ సాధువే అతణ్ణి సమీపించి "ఏం నాయనా! బాగున్నావా?" అని అడిగాడు. "నేను బాగానే ఉన్నాను. మీకు ఏం కావాలో చెప్పండి" అని ఆ యువకుడు కసురుకున్నాడు. ఆ సాధువు ఆశ్చర్యపడ్డాడు. కొన్ని పండ్లు తీసుకొని, డబ్బు ఇచ్చాడు. అక్కడినుంచి వెళ్ళిపోతూ "నాయనా! వ్యాపారంలో నీకు శుభం కలగాలని, నీ ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటున్నాను" అని అన్నాడు. ఆ యువకుడు కుర్చీలోంచి లేచి "మీ ప్రార్థనలు నాకు అవసరం లేదు. ఇదంతా నా కష్టంతో సంపాదించింది. మీరు ఇక్కడినుంచి వెళ్ళిపోండి "అంటూ దుకాణం నుంచి తరిమేశాడు. కొద్ది రోజులలో అతని వ్యాపారం దెబ్బ తింది. నష్టాల్లో కూరుకుపోయాడు. ఆరోగ్యం క్షీణించింది. అతని ధోరణి భరించలేక భార్య తమ పిల్లలతో తన పుట్టింటికి వెళ్ళిపోయింది. అతని జీవితం చిందరవందరైపోయింది.

ఆ సాధువు ఒకరోజు ఆ మార్గంలోంచి వెళ్తుండగా... ఒక చెట్టు కింద చిన్న బండిలో పండ్లు అమ్ముకుంటూ ఆ యువకుడు కనిపించాడు. సాధువు అతని దగ్గరకు వెళ్ళి పలకరించాడు. ఆ యువకుడు ఏడుస్తూ తన గోడు వెళ్ళబోసుకున్నాడు. అప్పుడు ఆ సాధువు "నాయనా! మనం కష్టంలో ఉన్నా, సుఖంలో ఉన్నా అల్లాహ్‌ను గుర్తు చేసుకోవాలి. నమాజ్ క్రమం తప్పకుండా చేయాలి. పేదలకు దానధర్మాలు చేయాలి. నిత్యం దివ్య ఖుర్‌ఆన్ చదవాలి. ఇరుగుపొరుగువారిని, బంధువులను, మిత్రులను మరచిపోకూడదు" అని బోధించాడు. తన ప్రస్తుత స్థితికి కారణం తను చేసిన పొరపాట్లేనని ఆ యువకుడికి అర్థమయింది. అతను పశ్చాత్తాపం చెందాడు. సాధువును క్షమించాలని కోరాడు, అల్లాహ్‌కు క్షమాపణలు చెప్పుకున్నాడు. ఆ సాధువు కొంత డబ్బును ఆ యువకుడి చేతిలో పెట్టి... "అల్లాహ్ చూపిన మార్గంలో చిత్తశుద్ధితో నడిస్తే అంతా శుభమే జరుగుతుంది. ఈ డబ్బుతో, అల్లాహ్ పేరుతో మంచి వ్యాపారం మొదలు పెట్టు" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఇంతలో నమాజ్ సమయమయిందనే పిలుపు వినిపించడంతో... భక్తిపూరితమైన మనసుతో ఆ యువకుడు మసీదు వైపు నడిచాడు.

• మహమ్మద్ వహీదుద్దీన్

తెలుసుకుందాం

పీటర్ పాదుకలు



బ్రిటిష్ వారు మన దేశాన్ని పరిపాలించే కాలంలో... తమిళనాడులోని మదురై జిల్లాకు రౌస్ పీటర్ అనే వ్యక్తి 1812 నుంచి 1828 వరకు కలెక్టర్‌గా పని చేశాడు. పీటర్ కార్యాలయానికి, అతను నివసిస్తున్న ఇంటికి మధ్యలో మీనాక్షి అమ్మవారి ఆలయం ఉండేది. అతను తన కార్యాలయానికి రోజూ అమ్మవారి ఆలయం ముందు నుంచే వెళ్ళేవాడు. ఆలయం సమీపించగానే గుర్రం మీద నుంచి దిగి, తన కాళ్ళకు ఉన్న చెప్పుల్ని తీసేసి, నడిచి వెళ్తూ... తన భక్తిప్రపత్తులను చాటుకొనేవాడు.

తప్పిన ప్రమాదం

ఒక రోజు రాత్రి ఉరుములు, మెరుపులతో పెద్ద గాలి వాన వచ్చింది. తన ఇంట్లో పడుకున్న పీటర్‌కు పెద్ద శబ్దం వినిపించి... ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా ఒంటినిండా ఆభరణాలతో ఒక బాలిక నిలబడి ఉంది. "ఎవరమ్మా నువ్వు?" అని పీటర్ ఆమెను అడిగాడు. ఆ బాలిక బయటకు వెళుతూ... 'రారమ్మ'ని పీటర్‌ను పిలిచింది. పీటర్ ఇంటి బయటకు వచ్చాడు. ఆ తరువాత ఆ బాలిక వర్షంలో వడివడిగా నడుస్తూ వెళ్ళి అదృశ్యం కావడం, ఆ సమయంలో ఆమె కాళ్ళకు పాదరక్షలు లేకపోవడం పీటర్ గమనించాడు. ఇంతలో అతను నివసిస్తున్న ఇల్లు ఒక్కసారిగా కూలిపోయింది. నిర్ఘాంతపోయిన పీటర్ కొంతసేపటికి తేరుకున్నాడు. బాలిక రూపంలో ఆ అర్ధరాత్రి వచ్చి, తనను బయటకు పిలిచి, ఘోర ప్రమాదం నుంచి కాపాడినది సాక్షాత్తూ మధుర మీనాక్షి అమ్మవారే అని గ్రహించాడు. చేతులెత్తి నమస్కరించాడు.

ఉత్సవమూర్తికి అలంకారంగా...

మర్నాడు అతను మీనాక్షి ఆలయానికి వెళ్ళాడు. ముందురోజు రాత్రి జరిగిన సంఘటనను అక్కడి అర్చకులకు తెలియజేశాడు. "అయ్యా! రాత్రి నాకు దర్శనం ఇచ్చిన మీనాక్షి అమ్మవారి కాళ్ళకు పాదరక్షలు లేవని గమనించాను. నేను అమ్మవారికి బంగారు పాదరక్షలు ఇవ్వాలనుకుంటున్నాను. మీరు అంగీకరించి నాకు అవకాశాన్ని కల్పించండి" అని కోరాడు. ఆలయ నిర్వాహకులు అందుకు అంగీకరించడంతో... 412 కెంపులు, 72 పచ్చలు, 80 వజ్రాల సహితంగా అత్యంత విలువైన స్వర్ణ పాదుకలను మీనాక్షి అమ్మవారికి కలెక్టర్ పీటర్ సమర్పించాడు. ఆ పాదుకలను 'పీటర్ పాదుకలు' అని పిలుస్తారు. నేటికీ... ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో నిర్వహించే చిత్తిరై పండుగ సందర్భంగా... అమ్మవారి ఉత్సవ మూర్తి పాదాలకు ఆ పాదుకలను అలంకరించి ఊరేగిస్తున్నారు. అన్యమతస్థుడైనా... అమ్మవారిపై పీటర్‌కు ఉన్న భక్తి విశ్వాసాలకు తార్కాణంగా ఈ సంఘటన నిలిచిపోయింది.

• సి.ఎస్.మూర్తి
8328143489

సువార్తికుల్లో అగ్రగణ్యుడు

దైవమార్గం

క్రీస్తు పిలుపును అందుకొని ఆయనను అనుసరించిన వారు ఎందరో ఉన్నారు. వారిలో జాన్ మార్క్ ఒకరు. అతను సువార్తికులలో ప్రసిద్ధి చెందినవాడు. క్రీస్తులోని దైవ, మానవ స్వభావాలను దర్శించి, చిత్రీకరించి.... అద్భుతమైన రచనా శిల్పంతో లోకానికి అందించినవారిలో అగ్రగణ్యుడు. మార్కు అంటే 'మహా యోధానుయోధుడు' అర్థం.

మార్కు సువార్త 16 అధ్యాయాల గ్రంథం. దాన్ని ఆయన గ్రీకు భాషలో రాశాడు. కానీ ఏసు క్రీస్తు బోధలన్నీ అరమయిక్ భాషలో ఉన్నాయి. మరి గ్రీకు భాషలో వాటిని మార్కు ఎందుకు రాసినట్టు? ఆనాటి రోమన్ సామ్రాజ్యంలో... ముఖ్యంగా గలిలియా, అంతియోక్, ఉత్తర-దక్షిణ సిరియాల్లోని జానపదుల వ్యవహారిక భాష గ్రీకు. కాబట్టే మార్కు సువార్తకు అంత వ్యాప్తి లభించింది. 'సువార్త చతుష్టయం'గా పేరు పొందిన వారు ఏసు జీవితాన్ని సమగ్రంగా దర్శించినప్పటికీ... వాటిలో కొంత వైరుధ్యం కనిపిస్తుంది. మార్కు మాత్రం క్రీస్తు చేసిన అద్భుతాలవైపు దృష్టి సారించాడు. దైవపుత్రుడి పాత్రను తూచా తప్పకుండా నెరవేర్చిన వ్యక్తిగా క్రీస్తును





ఆయన దర్శించాడు. మొదటి సువార్తికుడైన మత్తయి... క్రీస్తు బోధన మీద దృష్టి పెడితే... ఆ ప్రభువు సంచరించిన గలిలియా ప్రాంతంలో ఆయన చేసిన పరిచర్య, ప్రజలకు బాప్టిజం ఇవ్వడం, దైవరాజ్య వ్యాప్తి కోసం పరితపించడం, యేసుకు ఎదురైన శోధన, ఆయన మొదటి శిష్యుల సంగతులు, ఏసు ఎందరికో స్వస్థత కలిగించడం, తుపానును శాంతపరచడం, అయిదు వేలమందికి ఆహారం పెట్టడం, నీటి మీద నడవడం, ఏసు అంగీ అంచును తాకిన రోగులకు నయం కావడం, ఏసు తన మరణం గురించి ముందే తెలియజేయడం, ఆయన మరో రూప దర్శనం, స్వర్గారోహణ లాంటి ఎన్నో అంశాలు మార్కు సువార్తలో కనిపిస్తాయి. సౌవార్తికుడైన మార్కు చిహ్నం 'రెక్కల సింహం' అని యెహెజ్కేలు గ్రంథం పేర్కొంది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

తాళ్లపాక పద వైభవం

వ్యాసపీఠం





తాళ్లపాక అన్నమాచార్యుడి వంశంలో ఆయన కుమారుడు పెద తిరుమలయ్య, మనుమడు చిన తిరుమలయ్య కూడా సంకీర్తనా రచనలో ఉద్ధండులే. అందుకే ఆ ముగ్గురినీ కలిపి 'తాళ్లపాక పద కవిత్రయం'గా పిలుస్తూ ఉంటారు. పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య రాసిన సంకీర్తనలు సైతం అందరినీ ఆకట్టుకుంటాయి. ఈ సంకీర్తనలలోని కొన్నింటిని ఎంపిక చేసి, వాటికి వ్యాఖ్యానాన్ని జోడించి... 'మాధవ పద మయూఖ' (పెద తిరుమలయ్య సంకీర్తనలు), 'చిన్మయ చింతనం' (చిన తిరుమలయ్య సంకీర్తనలు) అనే గ్రంథాలుగా ప్రముఖ వ్యాఖ్యాత వెంకట్ గరికపాటి వెలువరించారు. ఈ పుస్తకాలలో ఆనాటి మాండలిక పదాలకు అర్థాలను సులభమైన సరళభాషలో రచయిత వివరించారు. తాళ్లపాక పద కవుల సంకీర్తనలను అభిమానించేవారు చదవాల్సిన పుస్తకాలివి.

మాధవ పద మయూఖ (288 పేజీలు)
చిన్మయ చింతనం (128 పేజీలు)
రచయిత: వెంకట్ గరికపాటి
ప్రతులకు: 9989092014

హరి-హరుడు ఒకరేనా?



హరుడు ఎవరు? హరి ఎవరు? వీరిద్దరూ ఒకప్పుడు ఒకటేనా? ఈ ప్రశ్న చాలా మందికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ సుమారు 1200 ఏళ్ల క్రితం మన దేశాన్ని రాష్ట్రకూటులు పాలిస్తున్న సమయంలో - 'హరహరి మతం' అనేది ఒకటి దక్షిణ భారత దేశంలో పరిఢవిల్లింది. ఈ మతానికి చెందిన వారు ఆ ఇద్దరినీ సమానంగా కొలిచేవారు. వీరి దృష్టిలో హరి మన జీవితానికి ఆనందాన్ని ఇచ్చేవాడు. ఈ ప్రపంచంలో మనం ఆనందంగా ఎలా జీవించాలో చెప్పేవాడు. హరికి జీవిత భాగస్వామి ఉంది. కానీ కొన్ని కోణాలలో అతను సాధువు. హరుడు దీనికి పూర్తి వ్యతిరేకం. జీవితంలో మనకు ఎదురయ్యే కష్టాలన్నింటినీ తీర్చేవాడు శివుడు. ఏదైనా పెద్ద కష్టం వచ్చినా దానిని తనలోనే దాచుకోగలిగిన సమర్థుడు. కానీ అతను ప్రపంచమంతా తిరిగే జంగమ సాధువు. మనుషులకు దూరంగా సంచరిస్తూ ఉంటాడు. హరుడకి కూడా జీవిత భాగస్వామి ఉంది. అంటే అతను జంగమ సాధువైన సంసారి.

ఈ రెండు వైరుధ్యాలు ఒక చోటకు చేరినప్పుడే ఒక సంపూర్ణ దైవం ఏర్పడుతుంది. వీరిద్దరూ ఒకే నాణానికి ఉన్న రెండు పార్శ్వాల వంటివారు. రాష్ట్రకూటుల కాలంలో.... దక్షిణ భారత దేశంలో ఈ సిద్ధాంతాన్ని అనుసరించేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వియత్నాం, కంబోడియా మొదలైన దేశాలలో విస్తృత ప్రచారంలోకి వచ్చింది. ఆ తరువాతి కాలంలో - హరి, హరుల కోసం ప్రత్యేకమైన శాఖలు ఏర్పడ్డాయి. ఈ మతానికి చెందిన వారు సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేకమైన పూజలేవీ నిర్వహించేవారు కారు. కాలక్రమేణా ఈ మతానికి ప్రాముఖ్యత తగ్గిపోయింది. అయితే ఈ రోజుకూ హరహరులను సమానంగా పూజించేవారు కొందరు మనకు అక్కడక్కడా కనిపిస్తూ ఉంటారు.



ఫైనల్లో హంపి

● టైటిల్‌పోరులో దివ్యతో అమీతుమీ
● చెస్ వరల్డ్‌కప్ భారత కొప్పులోకే
● సెమీస్‌లో టింగ్జీపై కోనేరు విజయం


దివ్య

బటూమి (జార్జియా): ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న మహిళల చెస్ వరల్డ్‌కప్ భారత్‌కు దక్కడం ఖాయమైంది. తెలుగు క్రీడాకారిణి కోనేరు హంపి అద్భుత విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన హోరాహోరీగా సాగిన సెమీస్‌లో హంపి 5-3తో చైనా జీఎం లీ టింగ్జీని ఓడించింది. అంతకుముందు జరిగిన రెండు క్లాసిక్ గేమ్‌లు 1-1తో డ్రా అయ్యాయి. ఇక టైబ్రేక్‌లో 15 నిమిషాల తొలి రెండు ర్యాపిడ్ గేమ్‌లు టై అయ్యాయి. ఆ తర్వాత జరిగిన 10 నిమిషాల ర్యాపిడ్ గేముల్లోని తొలి పోరులో టింగ్జీ గెలిచింది. మిడిల్ గేమ్‌లో పాన్‌ను చేజార్చుకొన్న కోనేరు.. ఎండ్ గేమ్‌లో ఇబ్బందుల్లో పడింది. దీంతో రెండో గేమ్‌ను డ్రా చేసుకుంటే చాలు...లీ ఫైనల్‌కు చేరుతుంది. అందుకు తగ్గట్టుగానే టింగ్జీ బోర్డుపై పట్టుబిగించింది. గేమ్ దాదాపుగా డ్రాకు చేరువైంది. కానీ, పట్టు వదలకుండా పోరాడిన హంపి.. ఆ గేమ్‌ను గెలిచి 3-3తో సమం చేసింది. ఆ తర్వాత జరిగిన మూడో సెట్‌లోని రెండు బ్లిట్జ్ గేముల్లో భారత జీఎం పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి గేమ్‌లో తెల్లపావులతో ఆడిన హంపి.. లీని చిత్తు చేసింది. ఇక రెండో గేమ్‌ను డ్రా చేసుకొంటే హంపి ఫైనల్ చేరినట్టే. కానీ, సాంకేతికంగా మెరుగైన స్థితిలో ఉన్న కోనేరు.. టింగ్జీ ఆటకట్టించింది. దీంతో ఫైనల్ బెర్త్ దక్కించుకున్న హంపి..టీనేజ్ ఐఎం దివ్య దేశ్‌ముఖ్‌తో అమీతుమీకి సిద్ధమైంది. బుధవారం నాటి పోరులో నెగ్గిన దివ్య ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. ఫైనల్ శనివారం నుంచి జరుగుతుంది.

వచ్చే ఏడాదీ ఇంగ్లండ్‌లో పర్యటన

భారత క్రికెట్ జట్ల షెడ్యూలు

మాంచెస్టర్: ప్రస్తుతం ఐదు టెస్టుల సిరీస్‌లో బిజీగా ఉన్న టీమిండియా వచ్చే ఏడాది కూడా ఇంగ్లండ్‌కు రానుంది. 2026, జూలై 1 నుంచి 19 వరకు ఇరు జట్ల మధ్య ఐదు టీ20, మూడు వన్డేల సిరీస్‌లు జరుగుతాయని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) వెల్లడించింది. అలాగే భారత మహిళల జట్టు కూడా మూడు టీ20ల సిరీస్, ఏకైక టెస్టు కోసం మరోసారి పర్యటించనుంది. మే 28 నుంచి జూన్ 1 వరకు ఇంగ్లండ్ మహిళల జట్టుతో పొట్టి ఫార్మాట్‌లో తలపడనుండగా, జూలై 10 నుంచి లార్డ్స్‌లో తొలిసారిగా మహిళల టెస్టు జరగనుంది.

ఆర్‌సీబీ, కేఎస్‌సీఏలపై చర్యలకు సిద్ధం

తొక్కిసలాట ఘటనపై కర్ణాటక కేబినెట్ నిర్ణయం

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మైకేల్ కున్హా కమిషన్ ఇచ్చిన నివేదికకు కర్ణాటక మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కమిషన్ సూచించిన విధంగా ఆర్‌సీబీ అనుబంధ డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం, ఆ సంఘం అధ్యక్షుడు రఘురాంభట్, మాజీ అధ్యక్షుడు ఎ.శంకర్, మాజీ కోశాధికారి జయరాం, ఉపాధ్యక్షుడు ఈఎస్ రాజేష్ మెనన్, డాక్టర్ వెంకట వర్ధన్‌లపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

నటుడితో వీనస్ ఎంగేజ్‌మెంట్ !



వాషింగ్టన్: ఇటలీకి చెందిన నటుడు, రచయిత, దర్శకుడు ఆండ్రియా ప్రెటీ (37)తో తనకు నిశ్చితార్థం జరిగినట్టు వెటరన్ టెన్నిస్ స్టార్ వీనస్ విలియమ్స్ వెల్లడించింది. 16 నెలలుగా ఒక్క టోర్నమెంట్ కూడా ఆడని 45 ఏళ్ల వీనస్ వాషింగ్టన్ డీసీ టోర్నీ బరిలో దిగింది. తొలి రౌండ్‌లో విజయం సాధించిన ఆమె..డబ్ల్యూటీఏ టూర్ మ్యాచ్ నెగ్గిన రెండో అతిపెద్ద వయస్సు క్రీడాకారిణిగా నిలిచింది.

బజ్‌బాల్ షో

● ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ 225/2 ● చెలరేగిన ఓపెనర్లు డకెట్, క్రాలే
● భారత్ తొలి ఇన్నింగ్స్ 358 ● స్టోక్స్‌కు ఐదు వికెట్లు ● నాలుగో టెస్టు

మాంచెస్టర్: ఐదు టెస్టుల సిరీస్‌లో తొలిసారిగా ఇంగ్లండ్ తమ బజ్‌బాల్ ఆటను రుచి చూపించింది. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై ఓపెనర్లు డకెట్ (100 బంతుల్లో 13 ఫోర్లతో 94), క్రాలే (113 బంతుల్లో 13 ఫోర్లు, సిక్స్‌తో 84) వన్డే తరహాలో చెలరేగారు. దీంతో దాదాపు ఐదు పరుగుల రన్‌రేట్‌తో ఆతిథ్య జట్టు స్కోరు దూసుకెళ్లింది. ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగిన ఇంగ్లండ్.. గురువారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 46 ఓవర్లలో 225/2 స్కోరు సాధించింది. జడేజా, అన్షుల్‌కు ఒక్కో వికెట్ దక్కింది. ప్రస్తుతం 133 పరుగులు వెనుకబడి ఉండగా క్రీజులో పోప్ (20 బ్యాటింగ్), రూట్ (11 బ్యాటింగ్) ఉన్నారు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులు చేసింది. పంత్ (54), శార్దూల్ (41), సుందర్ (27) రాణించారు. స్టోక్స్‌కు ఐదు, ఆర్చర్‌కు మూడు వికెట్లు దక్కాయి.

1
భారత్ తరఫున టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు (90) బాదిన బ్యాటర్‌గా సెహ్వాగ్‌తో సమంగా నిలిచిన పంత్. అలాగే ఒకే సిరీస్‌లో ఎక్కువ (5) 50+ స్కోర్లు సాధించిన భారత కీపర్‌గా పంత్.

చెలరేగిన స్టోక్స్, ఆర్చర్: రెండో రోజు ఆటలో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ ఐదు వికెట్లకు తోడు ఆర్చర్ చెలరేగి భారత్‌ను ఎక్కువ సేపు క్రీజులో నిలువనీయలేదు. దీంతో 264/4 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ మరో 94 పరుగులకు మిగిలిన ఆరు వికెట్లను కోల్పోయింది. తొలి సెషన్ రెండో ఓవర్‌లోనే జడేజా (20)ను ఆర్చర్ వెనక్కి పంపినా.. శార్దూల్‌కు సుందర్ సహకరించాడు. అయితే ఓ ఊరించే బంతికి శార్దూల్‌ను స్టోక్స్ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే వర్షం కారణంగా ముందుగానే లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. విరామం తర్వాత సుందర్, అన్షుల్ వికెట్లను ఒకే ఓవర్‌లో పడగొట్టిన స్టోక్స్ ఎనిమిదేళ్ల తర్వాత ఐదు వికెట్ల ఫీట్‌ను సాధించాడు. అటు పంత్.. ఆర్చర్ అద్భుత బంతికి బౌల్డయి తన పోరాటాన్ని ముగించాడు. కాసేపటికే బుమ్రా (4)ను సైతం ఆర్చర్ అవుట్ చేసి భారత్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. 21 పరుగుల వ్యవధిలోనే గిల్ సేన చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది.


డకెట్ (94)

ఓపెనర్ల జోరు: రెండో సెషన్ మధ్యలో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ దూకుడే లక్ష్యంగా ముందుకు సాగింది. ఓపెనర్లు డకెట్, క్రాలే ధాటికి భారత పేస్ త్రయం బుమ్రా, అన్షుల్, సిరాజ్ ప్రభావం చూపలేదు. దీంతో టీ బ్రేక్ సమయానికి 14 ఓవర్లలోనే 77 పరుగులు సాధించింది. డకెట్‌కు తోడు..అటు ఆరంభంలో తడబడిన క్రాలే కూడా లయ అందుకోవడంతో వికెట్ కోల్పోకుండానే ఆతిథ్య జట్టు ఈ సెషన్‌ను ముగించింది. ఇక ఆఖరి సెషన్‌లో ఏకంగా 148 పరుగులు చేరాయి. జడేజా తొలి ఓవర్‌లోనే క్రాలే 6,4తో 15 రన్స్ రాబట్టాడు. ఇలా ఇద్దరూ అలవోకగా బౌండరీలు బాదేయడంతో 29వ ఓవర్‌లోనే స్కోరు 150 దాటింది. అయితే భారత్ ఎదురుచూపులకు జడేజా తెరదించుతూ 32వ ఓవర్‌లో క్రాలేను అవుట్ చేశాడు. అప్పటికే తొలి వికెట్‌కు 166 పరుగులు జత చేరడం విశేషం. ఆ తర్వాత శతకానికి అతి చేరువలో ఉన్న డకెట్‌ను అరంగేట్ర పేసర్ అన్షుల్ అవుట్ చేశాడు. అయితే పోప్, రూట్ జాగ్రత్తగా ఆడుతూ వికెట్‌ను కోల్పోకుండా ఆటను ముగించారు.


స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) డాసన్ 58; రాహుల్ (సి) క్రాలే (బి) వోక్స్ 46; సాయి సుదర్శన్ (సి) కార్స్ (బి) స్టోక్స్ 61; గిల్ (ఎల్బీ) స్టోక్స్ 12; పంత్ (బి) ఆర్చర్ 54; జడేజా (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 20; శార్దూల్ (సి) డకెట్ (బి) స్టోక్స్ 41; సుందర్ (సి) వోక్స్ (బి) స్టోక్స్ 27; అన్షుల్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 0; బుమ్రా (సి) స్మిత్ (బి) ఆర్చర్ 4; సిరాజ్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 30; మొత్తం: 114.1 ఓవర్లలో 358 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-94, 2-120, 3-140, 4-235, 5-266, 6-314, 7-337, 8-337, 9-349, 10-358. **బౌలింగ్:** వోక్స్ 23-5-66-1; ఆర్చర్ 26.1-3-73-3; కార్స్ 21-1-71-0; స్టోక్స్ 24-3-72-5; డాసన్ 15-1-45-1; రూట్ 5-0-19-0.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) రాహుల్ (బి) జడేజా 84; డకెట్ (సి) జురెల్ (బి) అన్షుల్ 94; పోప్ (బ్యాటింగ్) 20; రూట్ (బ్యాటింగ్) 11; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 46 ఓవర్లలో 225/2. వికెట్ల పతనం:** 1-166, 2-197. **బౌలింగ్:** బుమ్రా 13-4-37-0; అన్షుల్ 10-1-48-1; సిరాజ్ 10-0-58-0; శార్దూల్ 5-0-35-0; జడేజా 8-0-37-1.

పంత్.. ఓ యోధుడిలా!

రెండో రోజు తొలి సెషన్‌లో శార్దూల్ వికెట్ పడగానే క్రీజులోకి వస్తున్నదెవరో చూసి ప్రేక్షకులు ఒకింత షాక్‌కు గురయ్యారు. బుధవారం వోక్స్ ఓవర్‌లో కుడి పాదానికి గాయమై నడవలేని స్థితిలో పంత్ మైదానం వీడిన సంగతి తెలిసిందే. కాలికి ఫ్రాక్చరైన తను తిరిగి బ్యాటింగ్ చేస్తాడని బహుశా ఎవరూ ఊహించలేదేమో. కానీ శార్దూల్ అవుటయ్యాక మరే స్పెషలిస్ట్ బ్యాటర్ లేకపోవడంతో పంత్.. కుంటుతూనే బ్యాట్ చేతపట్టి క్రీజులోకి అడుగుపెట్టాడు. అయితే స్టోక్స్‌తో పాటు ఆర్చర్ అతడి పాదాన్ని లక్ష్యంగా చేస్తూ బంతులు విసిరి ఇబ్బందిపెట్టారు. అయినా కాలి నొప్పితోనే తను సింగిల్స్ తీయగా, చెత్త బంతులను బౌండరీలుగా మలుస్తూ హాఫ్ సెంచరీ సాధించడం విశేషం. మరోవైపు పంత్ చివరి టెస్టు ఆడేది సందేహమే కాబట్టి తమిళనాడు కీపర్ ఎన్.జగదీషన్‌ను ఇంగ్లండ్‌కు రప్పించనున్నారు.



సింధుకు ఉన్నతి షాక్

● క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశం
● సాత్విక్ జోడీ సైతం

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్


ఉన్నతి

చాంగ్జౌ: యువ షట్లర్ ఉన్నతి హుడా పెను సంచలనం సృష్టించింది. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధును చిత్తు చేయడం ద్వారా తన కెరీర్‌లో అతి పెద్ద విజయం సాధించింది. చైనా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఇందుకు వేదికైంది. ఇక..సాత్విక్ జోడీ కూడా క్వార్టర్‌ఫైనల్ చేరగా, హెచ్ఎస్ ప్రణయ్ ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లో 17 ఏళ్ల ఉన్నతి ఒక గేమ్ కోల్పోయినా వదలకుండా పోరాడి 21-16, 19-21, 21-13తో సింధును ఇంటిదారి పట్టించింది. ఓ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో సహచర భారత క్రీడాకారిణి చేతిలో ఓడిపోవడం ఏడేళ్లలో సింధుకిదే తొలిసారి. హుడా క్వార్టర్‌ఫైనల్లో జపాన్‌కు చెందిన మూడో సీడ్ అకానె యమగూచిని ఢీకొంటుంది. పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి 21-19, 21-19తో ఎనిమిదో సీడ్ ఇండోనేసియా జంట లియో రోలీ/బగాస్ మౌలానాపై గెలుపొంది రౌండ్ -8కి చేరింది. సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రణయ్ 21-18, 15-21, 8-21 ఆరో సీడ్ చౌ టీన్ చెన్ (తైపీ) చేతిలో పోరాడి ఓడాడు.

యూఏఈలో ఆసియా కప్?

న్యూఢిల్లీ: ఇండో-పాక్ హైవోల్టేజ్ మ్యాచ్‌కు మరోసారి రంగం సిద్ధమైంది. బీసీసీఐ ఆధ్వర్యంలో యూఏఈ వేదికగా ఆసియా కప్ టీ20 టోర్నీని నిర్వహించేందుకు ఉన్న అడ్డంకులు తొలగినట్టు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) వర్గాలు తెలిపాయి. సెప్టెంబరులో టోర్నీని షెడ్యూల్ చేసే అవకాశాలున్నా.. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఢాకాలో గురువారం జరిగిన ఏసీసీ ఏజీఎంకు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వర్చువల్‌గా హాజరయ్యాడు. 'యూఏఈలో నిర్వహించే ఆసియా కప్‌నకు బీసీసీఐ ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ తమ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో ఆడే అవకాశాలున్నాయి. షెడ్యూల్ విషయంలో చర్చలు జరుగుతున్నాయ'ని ఏసీసీ వర్గాలు తెలిపాయి.

పాకిస్థాన్‌కు ఓదార్పు విజయం

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఇప్పటికే కోల్పోయిన పాకిస్థాన్ జట్టు ఆఖరి మ్యాచ్‌లో గెలిచి ఓదార్పు దక్కించుకుంది. గురువారం జరిగిన చివరి టీ20లో తొలుత పాకిస్థాన్ 20 ఓవర్లలో 178/7 స్కోరు చేసింది.. ఛేదనలో ఆతిథ్య జట్టు 16.4 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది.

భారత్-యూకే వాణిజ్య ఒప్పందం

ఉభయ తారకం

ఫార్మా, ఐటీ రంగాలకు మరింత మేలు.. జీరో డ్యూటీతో ఫార్మా ఎగుమతులు

● 75,000 మంది ఐటీ ఉద్యోగులకు లబ్ధి
● షరతులకు లోబడే ఆటో దిగుమతులు
● రొయ్యలు, మామిడి గుజ్జు ఎగుమతులకూ ఊతం



న్యూఢిల్లీ: భారత-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఒప్పందం భారత ఐటీ, ఫార్మా కంపెనీలకూ మేలు చేయనుంది. ప్రస్తుతం బ్రిటన్ వివిధ దేశాల నుంచి ఏటా 3,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.59 లక్షల కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. అందులో మన వాటా 100 కోట్ల డాలర్ల లోపే. తాజా ఒప్పందం ద్వారా బ్రిటన్ మన ఫార్మా ఎగుమతులను ఇక జీరో డ్యూటీతో అనుమతించనుంది. దీంతో ఆ దేశానికి మన ఫార్మా ఎగుమతులు భారీగా పుంజుకుంటాయని భావిస్తున్నారు. జెనరిక్ ఔషధాలు, ఎక్స్‌రే సిస్టమ్స్, ఈసీజీ మెషిన్స్, డయాగ్నోస్టిక్ పరికరాలు, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ వంటి మెడికల్ డివైసెస్ ఉత్పత్తులను భారత్ పెద్దఎత్తున బ్రిటన్‌కు ఎగుమతి చేస్తోంది. 'బ్రిటన్‌తో కుదిరిన ఎఫ్‌టీఏ రెండు దేశాల ఆర్థిక సహకారంలో.. ముఖ్యంగా ఫార్మా రంగంలో ఒక ప్రధాన మైలురాయి. గత ఏడాది మనం ఆ దేశానికి 91.4 కోట్ల డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి చేశాం. ఈ ఒప్పందంతో మన ఎగుమతులు మరింతగా పెరుగుతాయి. దీనివల్ల అక్కడి ప్రజలకీ మన ఔషధాలు చౌకగా లభిస్తాయి. అక్కడి నుంచి మన ఫార్మా రంగంలోకి మరింత ఎఫ్‌డీఐ వచ్చే అవకాశం ఉంది' అని ఫార్మాగ్జిల్ చైర్మన్ నమిత్ జోషి చెప్పారు.

ఐటీ కంపెనీలకు ఊరట

బ్రిటన్‌తో కుదిరిన ఎఫ్‌టీఏ ఐటీ రంగానికీ పెద్ద ఊరట కల్పించింది. దీంతో భారత కంపెనీల తరఫున బ్రిటన్ వెళ్లి, అక్కడి ప్రాజెక్టులు పూర్తి చేసే ఉద్యోగులకు మూడేళ్ల పాటు అక్కడి సామాజిక భద్రతా పథకాల కోసం చేసే చెల్లింపుల నుంచి మినహాయింపు లభించింది. దీనివల్ల బ్రిటన్‌లోని టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న దాదాపు 75,000 మంది భారతీయులకు మేలు జరగనుంది. 'భారత ఐటీ కంపెనీలు, ఉద్యోగులకు ఇది పెద్ద ఊరట' అని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. భారత్‌లోని బ్రిటిష్ కంపెనీల్లో పని చేసే బ్రిటిష్ పౌరులకు ఇది వర్తిస్తుంది. దీంతో కంపెనీలకు రెండు దేశాల్లో ఈ పథకాల కోసం పెద్ద మొత్తంలో చెల్లింపుల భారం తగ్గనుంది. ఈ మినహాయింపు సర్వీస్ బేస్డ్ ఐటీ కంపెనీలకు బాగా మేలు చేయనుంది. దీంతో భారత ఐటీ కంపెనీలు బ్రిటన్‌పై మరింత శ్రద్ధ పెడతాయని భావిస్తున్నారు.

ఆటోమొబైల్స్

బ్రిటన్‌తో కుదిరిన ఎఫ్‌టీఏలో దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ ప్రయోజనాలను రక్షించేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంది. బ్రిటిష్ కార్ల దిగుమతులపై సుంకాన్ని ప్రస్తుత 110 శాతం నుంచి 10 శాతానికి తగ్గించింది. అయితే ఈ సౌలభ్యం కోటాలు, దిగుమతి చేసుకునే వాహనాల ఇంజన్ సామర్థ్యం, ధరలకు లోబడి మాత్రమే ఉంటుంది. కోటాకు లోబడి పెట్రోల్ వాహనాలైతే ఇంజన్ సామర్థ్యం 3,000 సీసీపైన, డీజిల్ వాహనాలైతే ఇంజన్ సామర్థ్యం 2,500 సీసీపైన ఉన్న వాహన దిగుమతులకు మాత్రమే 10 శాతం దిగుమతి సుంకం వర్తిస్తుంది.

పెట్రోల్, డీజిల్ వాహనాలైతే కనీస ధర 40,000 పౌండ్ల (సుమారు రూ.46.80 లక్షలు) పైన, ఈవీలైతే 80,000 పౌండ్ల పైన ఉండాలని ఆంక్షలు పెట్టింది. టాటా గ్రూప్‌నకు చెందిన జాగ్వార్ అండ్ లాండ్ రోవర్, మహీంద్రా ఎలక్ట్రిక్, భారత్ ఫోర్జ్ వంటి కంపెనీలకు ఈ వాణిజ్య ఒప్పందం ఎంతో మేలు చేకూర్చనుంది. అలాగే ఆటోమొబైల్ కాంపోనెంట్ కంపెనీలకు లబ్ధి చేకూరుస్తుందని భారత ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ సమాఖ్య (ఏసీఎంఏ) తెలిపింది.

ఇతర ప్రధాన అంశాలు

- ఎలాంటి సుంకాలు లేకుండా భారత్ నుంచి పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, పసుపు, మిరియాలు, యాలకులు, పప్పులు, మామిడి గుజ్జు, పచ్చళ్లు, కాఫీ, టీ వంటి రెడీ టు ఈట్ ఆహార ఉత్పత్తుల దిగుమతికి బ్రిటన్ గ్రీన్ సిగ్నల్
- బ్రిటన్ పాల ఉత్పత్తులు, యాపిల్స్, ఓట్స్, వంట నూనెలు మాత్రం ఎఫ్‌టీఏ పరిధిలోకి రావు
- భారత్ నుంచి చేపలు, రొయ్యలు, టూనా చేపల దిగుమతులపై సుంకాలు పూర్తిగా ఎత్తివేత
- భారత్ నుంచి దిగుమతయ్యే జౌళి, వస్త్రాలు, దుస్తులు, ఫుట్‌వేర్‌పై సుంకాలు పూర్తిగా ఎత్తివేత
- సుంకాలు పూర్తిగా ఎత్తివేయడంతో వచ్చే ఐదేళ్లలో బ్రిటన్‌కు రెట్టింపు కానున్న భారత ఇంజనీరింగ్ ఎగుమతులు
- భారత ప్లాస్టిక్ వస్తువుల దిగుమతుల పైనా జీరో సుంకాలు
- భారత నగలు, రత్నాల ఎగుమతులపైనా తగ్గనున్న దిగుమతి సుంకాలు
- భారత తోలు ఉత్పత్తుల ఎగుమతుల పైనా జీరో డ్యూటీ

మార్కెట్లో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ 542 పాయింట్లు డౌన్

ముంబై: ప్రధాన కంపెనీల షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడంతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లూ పెట్టుబడులు వెనక్కి తీసుకోవడంతో ప్రామాణిక సూచీలు గురువారం భారీగా నష్టపోయాయి. ఒక దశలో 679 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 542.47 పాయింట్ల నష్టంతో 82,184.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157.80 పాయింట్లు క్షీణించి 25,062.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 24 నష్టపోగా.. ట్రెంట్ షేరు 3.92 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టెక్ మహీంద్రా 3.15 శాతం క్షీణించగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోటక్ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలూ 0.50 శాతం వరకు తగ్గాయి. రంగాలవారీ సూచీల్లో ఫోకస్డ్ ఐటీ 2.27 శాతం, ఐటీ 1.90 శాతం, టెక్ 1.54 శాతం, ఎఫ్ఎంసీజీ 1.09 శాతం, రియల్టీ 1.03 శాతం తగ్గాయి.

మైండ్‌స్పేస్ రీట్స్ గూటికి క్యూ-సిటీ

8.1 లక్షల చ.అడుగుల స్థలం రూ.512 కోట్లకు కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్స్ (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్) హైదరాబాద్‌లో తన ఆస్తుల పోర్టుఫోలియోను మరింత విస్తరించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మ్యాక్ సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన క్యూ-సిటీ అనే 8.1 లక్షల చదరపు అడుగుల కార్యాలయ సముదాయాన్ని (ఆఫీస్ కాంప్లెక్స్) రూ.512 కోట్లకు కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు అనంతరం మైండ్‌స్పేస్ రీట్స్ ఆస్తుల పోర్టుఫోలియో 3.79 కోట్ల చదరపు అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం ఈ ట్రస్ట్ హైదరాబాద్‌తో పాటు ముంబై రీజియన్, పుణె, చెన్నైలో ఐదు ఇంటిగ్రేటెడ్ బిజినెస్ పార్కులు, ఏడు స్వతంత్ర ఆఫీస్ కాంప్లెక్స్‌లను కలిగి ఉంది.

● క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ, సీడీఎస్ఎల్, ఎన్ఎస్‌డీఎల్, ఎంసీఎక్స్ వంటి మార్కెట్ ఇంటర్మీడియేట్ సంస్థలు (ఎంఐఐ), అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) కలిసి 'సెబీ వర్సెస్ స్కామ్' పేరుతో సంయుక్త అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించాయి. మార్కెట్లో జరుగుతున్న ఆర్థిక మోసాలు, కుంభకోణాల నుంచి సెక్యూరిటీస్ మార్కెట్ ఇన్వెస్టర్లను రక్షించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,970 ▼	92,550 ▼	1,28,000 ▼
విజయవాడ	1,01,900 ▼	96,500 ▼	1,18,400 ▼
విశాఖపట్నం	1,01,980 ▼	92,550 ▼	1,28,000 ▼
రాజమండ్రి	1,00,960 ▼	92,550 ▼	1,18,200 ▼
ప్రొద్దుటూరు	98,900 ▼	90,990 ▼	1,17,000 ▲
ముంబై	98,880 ▼	90,574 ▼	1,15,092 ▼

బిజినెస్

కెనరా బ్యాంక్ లాభం రూ.4,752 కోట్లు

ఈ త్రైమాసికంలోనే కెనరా రొబెకో ఏఎంసీ లిస్టింగ్


క్యూ1లో 22% వృద్ధి

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.38,063 కోట్ల ఆదాయంపై రూ.4,752 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే సమయంలో ఆర్జించిన ఆదాయం రూ.34,020 కోట్లు కాగా లాభం రూ.3,905 కోట్లుగా ఉంది. వార్షిక ప్రాతిపదికన క్యూ1లో లాభం 22% పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంకు ఆర్జించిన వడ్డీ ఆదాయం రూ.28,701 కోట్ల నుంచి రూ.31,003 కోట్లకు పెరిగింది. అయితే నికర వడ్డీ ఆదాయం మాత్రం 2 శాతం క్షీణించి రూ.9,166 కోట్ల నుంచి రూ.9,009 కోట్లకు తగ్గింది. నికర వడ్డీ మార్జిన్ 2.55 శాతం నుంచి 2.9 శాతానికి పెరిగిందని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే.సత్యనారాయణ రాజు తెలిపారు. కాగా రెగ్యులేటరీ అనుమతులకు లోబడి ప్రస్తుత త్రైమాసికంలోనే తమ అనుబంధ కంపెనీల్లో ఒకటైన కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) లిస్టింగ్ చేయనున్నట్లు ఆయన చెప్పారు. మరో కంపెనీ కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్‌ను వచ్చే త్రైమాసికంలో లిస్టింగ్ చేస్తామని ఆయన వెల్లడించారు. సమీక్షా కాలంలో బ్యాంక్ నిర్వహణాపరమైన లాభం రూ.7,616 కోట్ల నుంచి రూ.8,554 కోట్లకు పెరిగింది.

తగ్గిన ఎన్‌పీఏలు: కాగా జూన్ త్రైమాసికంలో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 4.14% నుంచి 2.69 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.24% నుంచి 0.63 శాతానికి తగ్గాయి. బ్యాంక్ మంజూరు చేసిన స్థూల రుణాలు 12% వృద్ధితో రూ.10,96,329 కోట్లకు చేరాయి. ఎన్‌పీఏలు తగ్గిన కారణంగా మొండి బకాయిల కోసం కేటాయింపులు రూ.2,171 కోట్ల నుంచి రూ.1,845 కోట్లకు తగ్గాయి. ఈ ఏడాది జూన్ నాటికి ఆస్తులపై రాబడి 1.14% ఉంది. బ్యాంక్ సీఏఆర్ 16.38% నుంచి 16.52 శాతానికి చేరింది. బ్యాంక్ ప్రపంచ వ్యాపారం 10.98% పెరిగి రూ.25,63,984 కోట్లకు చేరగా ప్రపంచ డిపాజిట్లు 9.92% వృద్ధితో రూ.14,67,655 కోట్లకు చేరాయి.

54% పెరిగిన కోరమాండల్ ఇంటర్నేషనల్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.7,083 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.508 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 54 శాతం వృద్ధి చెందగా ఆదాయం 49 శాతం పెరిగింది. ఈ కాలంలో న్యూట్రియంట్, అల్లైడ్ వ్యాపారాల ఆదాయం రూ.4,198 కోట్ల నుంచి రూ.6,311 కోట్లకు పెరగగా క్రాప్ ప్రొటెక్షన్ వ్యాపారం రూ.551 కోట్ల నుంచి రూ.724 కోట్లకు పెరగటం కలిసి వచ్చిందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో 7.5 లక్షల టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఫెర్టిలైజర్ గ్రాన్యులేషన్ ప్లాంట్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు తెలిపింది.

సైయెంట్ లాభంలో 30 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సైయెంట్ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.163 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 30 శాతం వృద్ధి చెందింది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో రెవెన్యూ 3.6 శాతం పెరిగి రూ.1,393 కోట్లుగా నమోదైంది. గ్రూప్‌కు చెందిన డీఈటీ, డీఎల్ఎం, సెమీకండక్టర్స్ విభాగాలు అంచనాలకు తగ్గట్టుగా పనితీరును కనబరచటం కలిసివచ్చిందని సైయెంట్ ఎండీ కృష్ణ బోదనపు తెలిపారు.

ఐఆర్‌డీఏఐ చైర్మన్‌గా అజయ్ సేథ్

న్యూఢిల్లీ: భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) చైర్మన్‌గా ఆర్థిక శాఖ, ఆర్థిక వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి అజయ్ సేథ్‌ను ప్రభుత్వం నియమించింది. నియామకాల వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఈ నియామకానికి ఆమోదం తెలిపింది. అధికార బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడు సంవత్సరాల కాలం లేదా 65 సంవత్సరాల వయసు నిండే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. నాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి బాధ్యతలు నిర్వహించిన సేథ్ ఈ ఏడాది జూన్‌లోనే రిటైర్ అయ్యారు. దేబాశిష్ పాండా ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ చేసిన నాటి నుంచి ఐఆర్‌డీఏఐ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	475
వరంగల్	427	గోదావరి	455
చిత్తూరు	503	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	111
కర్నూలు	115	నెల్లూరు	116
విశాఖపట్నం	97	అనంతపురం	116
గోదావరి	114		

సీఎస్ఈ ఫుల్.. మిగతావి డల్!

- కంప్యూటర్ సైన్స్‌లో 75 వేలకుపైగా సీట్లు భర్తీ
- మిగిలిన అన్ని బ్రాంచ్‌ల్లో సుమారు 40 వేలే
- 28 బ్రాంచ్‌ల్లో వంద శాతం నిండిన సీట్లు
- మెకానికల్, సివిల్‌కు తగ్గిపోతున్న డిమాండ్

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) హవా కొనసాగుతోంది. ఈఏపీసెట్ తొలి విడత కేటాయింపుల్లో అత్యధిక సీట్లు సీఎస్ఈ బ్రాంచ్‌ల్లోనే భర్తీ అయ్యాయి. సీఎస్ఈ బ్రాంచ్‌ల్లో 75 వేలకుపైగా సీట్లు భర్తీ అయితే, మిగిలిన అన్ని బ్రాంచ్‌ల్లో కలిపి 40 వేల సీట్లు మాత్రమే నిండాయి. సీఎస్ఈకి డిమాండ్ పెరగడంతో దాని అనుబంధ బ్రాంచ్‌లు పెరిగిపోయాయి. విద్యార్థులు కూడా కోర్ బ్రాంచ్‌లైన మెకానికల్, సివిల్‌ను పక్కనపెట్టి సీఎస్ఈలో కొత్తగా వచ్చిన బ్రాంచ్‌లైనా ఫరవాలేదంటూ వాటిలోనే సీట్లు కోరుకుంటున్నారు. ఈ ఏడాది రాష్ట్రానికి లక్షకు పైగా సీఎస్ఈ సీట్లను ఏఐసీటీఈ మంజూరు చేసింది. వాటిలో సుమారు 85 వేలు కన్వీనర్ కోటా కింద ఉన్నాయి. బుధవారం జరిగిన సీట్ల కేటాయింపులో సుమారు 75వేల సీట్లు సీఎస్ఈలో భర్తీ అయ్యాయి. సీఎస్ఈ కోర్‌లో 47,519 సీట్లు అందుబాటులో ఉంటే 41,504 సీట్లు భర్తీ అయ్యాయి. సీఎస్ఈ ఏఐఎంఎల్‌లో 13,602, సీఎస్ఈ డేటా సైన్స్‌లో 5,912, సీఎస్ఈ ఏఐలో 5,140, సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీలో 1,662, సీఎస్ఈ ఏఐ-డేటాసైన్స్‌లో 1,483, సీఎస్ఈ ఐవోటీ అండ్ సైబర్ సెక్యూరిటీ విత్ బ్లాక్ చైన్‌లో 676, సీఎస్ఈ ఐటీలో 506, సీఎస్ఈ ఐవోటీలో 256, సీఎస్ఈ క్లౌడ్ కంప్యూటింగ్‌లో 137, ఇతర సీఎస్ఈ బ్రాంచ్‌ల్లో మరికొన్ని సీట్లు భర్తీ అయ్యాయి. ఈసీఈలో 25,250 సీట్లు ఉంటే 18,846 సీట్లు భర్తీ అయ్యాయి. ఈఈఈలో 8,564 సీట్లకు 5,155 నిండాయి. మెకానికల్ బ్రాంచ్‌లో 7,743 సీట్లు ఉంటే 4,653 భర్తీ అయ్యాయి. సివిల్ ఇంజనీరింగ్‌లో 6,507 సీట్లకు 3,760 మాత్రమే భర్తీ అయ్యాయి. మొత్తంగా 28 బ్రాంచ్‌ల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఇవి కాకుండా మేనేజ్‌మెంట్ కోటాలో 50 వేలకుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలోనూ ఎక్కువ శాతం సీట్లు సీఎస్ఈ బ్రాంచ్‌ల్లోనే ఉన్నాయి. అవి కూడా కలిపితే ఈ ఏడాది లక్షకు పైగా సీఎస్ఈ సీట్లు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. కాగా.. కోర్ బ్రాంచ్‌లకు ఏటా ఆదరణ తగ్గిపోతోంది. గతంలో మెకానికల్, సివిల్, ఈఈఈలకు డిమాండ్ ఉండేది. కానీ విద్యార్థులంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలనే లక్ష్యంగా నిర్దేశించుకోవడంతో సీఎస్ఈ సీట్లు హాట్ కేకుల్లా భర్తీ అవుతున్నాయి. అందుకే కాలేజీలు కూడా సీఎస్ఈ సీట్లు పెంచుకుని మిగిలిన బ్రాంచ్‌ల్లో సీట్లు తగ్గించుకుంటున్నాయి.

కంబోడియాలో సైబర్ మోసాలు..

105 మంది భారతీయుల అరెస్టు

న్యూఢిల్లీ, జూలై 24: కంబోడియా కేంద్రంగా చైనా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తున్న కాల్ సెంటర్లపై అక్కడి పోలీసులు దాడులు జరిపారు. 15 రోజుల పాటు.. 138 ప్రాంతాల్లో జరిపిన ఈ దాడుల్లో మొత్తం 3,075 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వీరిలో 105 మంది భారతీయులున్నారు. నిజానికి భారతీయులను ఉద్యోగాల పేరుతో కంబోడియా, మయన్మార్ వంటి దేశాలకు తీసుకెళ్తున్న చైనా సైబర్ కేటుగాళ్లు.. వారిని అక్కడ నిర్బంధిస్తున్నారు. బలవంతంగా సైబర్ నేరాల కాల్ సెంటర్లు నిర్వహించేలా చేస్తున్నారు. మాట వినకుంటే.. కరెంటు షాకులివ్వడం, తిండితిప్పలు లేకుండా చేస్తూ.. హింసిస్తున్నారు. దీనిపై భారత ప్రభుత్వం పలు దఫాలుగా కంబోడియా ప్రభుత్వంతో చర్చించింది. ఈ క్రమంలో కంబోడియా పోలీసులు ఈ దాడులు జరిపారు. అరెస్టయిన వారిలో భారతీయులతోపాటు.. వివిధ దేశాల పౌరులు ఉన్నారు. కాగా.. ఈ దాడుల్లో అరెస్టయిన 105 మంది భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్ర హోంశాఖ చర్యలను ప్రారంభించినట్లు తెలుస్తోంది.

అనిల్ అంబానీ సంస్థలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ, జూలై 24: మూడువేల కోట్ల రూపాయల బ్యాంకు రుణ మోసం, నగదు అక్రమ చలామణీ కేసు దర్యాప్తులో భాగంగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కంపెనీలకు, ఎస్ బ్యాంకుకు చెందిన 35 కార్యాలయాలపై దాడులు చేశారు. నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం కింద 25 మందిని ప్రశ్నించారు. ఆయా కార్యాలయాల నుంచి పలు పత్రాలు, కంప్యూటర్ ఉపకరణాలను (ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌ల వంటివి) స్వాధీనం చేసుకున్నారు. 2017-2019 మధ్య 'ఎస్ బ్యాంకు' అధికారులకు రిలయన్స్ గ్రూపు కంపెనీలు లంచాలు ఇచ్చి.. ఆ బ్యాంకు నుంచి రూ.3000 కోట్ల మేర రుణాలు పొంది, ఆ రుణాలను అక్రమంగా దారి మళ్లించాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఆ రుణాల మంజూరుకు ఎస్‌బ్యాంకు వర్గాలు పలు నిబంధనలను ఉల్లంఘించాయని.. పాత తేదీతో రూపొందించిన రుణ మంజూరు గుర్తింపు పత్రాలను ఉపయోగించాయని.. మంజూరైన రుణాలను రిలయన్స్ గ్రూప్‌లోని పలు ఇతర సంస్థలకు, షెల్ కంపెనీలకు మళ్లించారని ఆరోపణలు రావడంతో.. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) 2022 సెప్టెంబరులో రెండు కేసులు నమోదు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ ఎస్ బ్యాంకు సహ వ్యవస్థాపకుడు, ఆ బ్యాంకు మాజీ ఎండీ రాణా కపూర్ పేరును సీబీఐ ప్రస్తావించింది. సీబీఐ పెట్టిన రెండు కేసులతోపాటు.. ఈ వ్యవహారానికి సంబంధించి నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. బ్యాంకులను, షేర్‌హోల్డర్స్‌ను, ఇన్వెస్టర్లను, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేసి ప్రజాధనాన్ని దారి మళ్లించడానికి పక్కా ప్రణాళికతో ఈ ఫ్రాడ్‌కు రూపకల్పన చేసినట్టు ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అప్పట్లో రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు రుణం మంజూరు కావడానికి ముందే.. ఎస్ బ్యాంకు ప్రమోటర్లు 'నగదు (లంచం)' అందుకున్నట్టుగా ఈడీ తన ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిందని విశ్వసనీయవర్గాల సమాచారం. ఎస్‌బ్యాంకు వద్దే కాదు.. కెనరా బ్యాంకు వద్ద సైతం ఆర్‌కామ్ ఇదే తరహాలో లంచాలిచ్చి రూ.1050 కోట్లకు పైగా రుణాలను పొందిన వైనంపైనా ఈడీ దృష్టి పెట్టినట్టు సమాచారం. రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సంస్థ బ్యాంకులు జారీ చేసే ఏటీ-1 (అడిషనల్ టైర్-1) బాండ్లలో రూ.2850 కోట్ల దాకా పెట్టుబడి పెట్టిందని.. అందుకు బదులుగా ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని ('క్విడ్ ప్రో కో'గా) ఈడీ భావిస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. కాగా.. ఈడీ సోదాలతో తమ వ్యాపార కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావమూ పడలేదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా కంపెనీలు వేర్వేరు ప్రకటనలు చేశాయి. ఈడీ సోదాలకు సంబంధించి మీడియా కథనాల్లో పేర్కొంటున్న ఆరోపణలు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) లేదా రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్) పదేళ్ల క్రితం జరిపిన లావాదేవీలకు సంబంధించినవని వెల్లడించాయి.

ఇదేం తీర్పు?

- నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం




బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ మంజూరుచేసిన హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహించింది. 'వివేకాన్ని వాడే హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చిందా.?' అని ఘాటుగా ప్రశ్నించింది. న్యాయ విచక్షణాధికారం తీవ్రంగా దుర్వినియోగం అయిందని వ్యాఖ్యానించింది. బెయిల్ ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రిజర్వులో ఉంచింది. 'ఇలాంటి కేసుల్లో బెయిల్ ఇవ్వవచ్చా? హైకోర్టు చేసిన తప్పునే మేం కూడా చేయదలుచుకోలేదు. బెయిల్ తీర్పును ఇచ్చేముందు విచక్షణాధికారాన్ని కోర్టు ఉపయోగించిందో లేదో పరిశీలించాలని అనుకుంటున్నాం. అందువల్ల పిటిషన్‌పై తొందరపడి తీర్పు ఇవ్వడంగానీ, విడుదలకు లేక శిక్షలకు ఆదేశాలు ఇవ్వడంగానీ చేయబోం" అని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా.. దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ ఇచ్చిన తీరును బెంచ్ తప్పుబట్టింది. "ప్రతి బెయిల్ తీర్పును హైకోర్టు ఇలాగే రాస్తుందా? ఈ కేసును హైకోర్టు చూసిన దృష్టి ఎక్కువగా మమ్మల్ని ఇబ్బంది పెట్టింది. సెషన్స్ కోర్టు జడ్జి అయితే అర్థం చేసుకోవచ్చు. కానీ, హైకోర్టు న్యాయమూర్తి ఇలాంటి పొరపాటు చేయడమేంటి? ఇంతేనా జడ్జి అవగాహన?. ఇది కుట్ర, హత్యలకు సంబంధించిన కేసు కావడంతో మా స్వరం కొంచెం కటువుగానే ఉంటుంది." అని బెంచ్ తెలిపింది. రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్, నటి పవిత్రా గౌడ, ఇతర నిందితులకు గత ఏడాది డిసెంబరు 13న కర్ణాటక హైకోర్టు బెయిల్ ఇచ్చింది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా ఈ కేసులో పవిత్ర పాత్రపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. "అంతా మీవల్లే జరిగింది. మీరు అక్కడ లేకపోతే ఏ2 పట్టించుకునేవారుకాదు. ఏ2 స్పందించకపోతే మిగతావారూ పట్టించుకునేవారు కాదు. మొత్తం సమస్యకు మీరే కారణం." అంటూ ఆగ్రహించింది. దీనిపై పవిత్ర తరఫు న్యాయవాది స్పందిస్తూ.. "ఆమెకు (రేణుకాస్వామి నుంచి) అభ్యంతరకర మెజేజ్‌లు వచ్చేవి. నేరుగా మాట్లాడిన కాల్ రికార్డులు లేవు. అపహరణ, హత్యతో ఆమెకు సంబంధం ఉన్నట్టు ఆధారాలు లేవు" అని వాదించారు. అయితే, తాము వాదనల లోతుల్లోకి వెళ్లదలుచుకోలేదని బెంచ్ స్పష్టం చేసింది. గార్డులు కిరణ్, పునీత్‌ల వాంగ్మూలాలను హైకోర్టు ఎందుకు తిరస్కరించిందని బెంచ్ నిలదీసింది. కర్ణాటక ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. కాల్ డేటా రికార్డులు, లొకేషన్ పిన్‌లు, దుస్తులపై, వాహనంలో దొరికిన డీఎన్ఏ, ఇతర ఆధారాలు వారిద్దరి వాంగ్మూలాలను ధ్రువీకరించాయని వాదించారు. సాక్ష్యాధారాల తీరుపై బెంచ్ పలు ప్రశ్నలు సంధించింది. "నిందితుల నుంచి మీరు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దాడి దృశ్యాలను దానిలో ఎలా బంధించారు?." అని ప్రశ్నించింది. దీనికి లూథ్రా బదులిస్తూ.. దాడి ఫొటోలు ఏ2కు ఫార్వర్డ్ అయ్యాయని, తనను కొట్టవద్దు అని హతుడు వేడుకొంటుండగా తీసిన ఫొటో కూడా అందులో ఉన్నదని తెలపగా, బెంచ్ విస్మయానికి గురయింది. "ఒక వైపు కొడుతున్నారు.. మరోవైపు ఫొటోకు పోజు ఇస్తున్నారు.. నిజంగా నమ్మలేకపోతున్నాం." అని వ్యాఖ్యానించింది. వారు తమ అభిమాన నటుడి కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉండే దర్శన్ అభిమాన సంఘానికి చెందినవారని లూథ్రా వివరించారు. "ఇదో కిరాతక హత్య. సోషల్ మీడియాలో పోస్టు చేశారనే కారణంగా రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి కిరాతకంగా హతమార్చారు. నిందితులు దర్శన్, పవిత్రగౌడ సహా అందరి కండిషన్ బెయిల్‌ను రద్దు చేయాలి" అని ఆయన కోరారు. కాగా, దర్శన్ తరపు న్యాయవాది కపిల్‌సిబల్ మరో కేసును వాదించేందుకు వెళ్లడంతో లిఖితపూర్వక వాదనల కోసం వారంరోజుల గడువు ఇస్తున్నామని బెంచ్ తెలిపింది. దీంతో బెయిల్ రద్దు కావచ్చునని నిందితులలో భయం పట్టుకుంది. నిందితులకు వ్యతిరేకంగానే తీర్పు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. 'డెవిల్' సినిమా షూటింగ్ కోసం నటుడు దర్శన్ థాయ్‌లాండ్‌కు వెళ్లిన విషయం తెలిసిందే.

నకిలీ ఓట్లను అనుమతించేదే లేదు

- ఓటర్ల తొలగింపు అబద్ధం: సీఈసీ
- బిహార్‌లో ప్రత్యేక సవరణకు సమర్థన

న్యూఢిల్లీ, జూలై 24: బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్)ను ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ గట్టిగా సమర్థించుకున్నారు. నకిలీ ఓటర్లు ఓటేయడానికి అనుమతించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో అసలైన ఓటర్లను తీసివేస్తున్నామన్న విపక్షాల ఆరోపణలను ఖండించారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అమలు చేయబోతున్నట్లు ఆయన తాజాగా ప్రకటించారు. అయితే కర్ణాటకలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని.. నూరు శాతం రుజువులున్నాయని.. ఒక నియోజకవర్గంలో వందలు, వేల అదనపు ఓటర్లను చేర్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే నిరాధార ఆరోపణలు చేయొద్దని, రాజ్యాంగ సంస్థను బెదిరిస్తున్నారని ఈసీ ఆక్షేపించింది. కాగా, బిహార్లో ప్రత్యేక సవరణను నిరసిస్తూ ఇండియా కూటమి ఎంపీలు గురువారం పార్లమెంటు ద్వారం వద్ద వరుసగా నాలుగో రోజూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రాహుల్ ఈసీపై విరుచుకుపడ్డారు. కర్ణాటకలో ఓ లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై 90 శాతం కాదు.. నూరు శాతం రుజువులు చూపిస్తామని తెలిపారు. అయితే.. రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. నిరాధార ఆరోపణలు చేయడమే గాక.. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను ఆయన బెదిరిస్తున్నారని విమర్శించింది.

అమెరికాలో పడిపోయిన జననాల రేటు

న్యూయార్క్, జూలై 24: అమెరికాలో సంతానోత్పత్తి దారుణంగా పడిపోతోంది. గతంలో ఎప్పుడూ లేనంత తక్కువగా గత ఏడాది జననాల రేటు నమోదైంది. 2024కు సంబంధించి వ్యాధి నియంత్రణ, నివారణ సెంటర్లు (సీడీసీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో సంతానోత్పత్తి తగ్గిపోయిన విషయం స్పష్టమైంది. జనాభా భర్తీ రేటు ప్రకారం సగటున ప్రతి మహిళకు 2.1 కంటే ఎక్కువగా పిల్లలు ఉండాల్సిన తరుణంలో.. అమెరికాలో జననాల రేటు 1.6 కంటే తక్కువగా నమోదైందని సీడీసీ వెల్లడించింది. 1960ల్లో యూఎస్‌లో జననాల రేటు సుమారు 3.5గా ఉంది. ఆ తర్వాత నుంచి క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. జననాల రేటు తగ్గిపోతోందన్న హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం సంతానోత్పత్తిని పెంచడానికి ఇటీవల చర్యలు చేపట్టింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఏపీలో కింగ్‌డమ్ టికెట్ల ధర పెంపు



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన చిత్రం 'కింగ్‌డమ్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ ఆకట్టుకున్నాయి. ఈ నెల 31న సినిమా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలోనే టికెట్ ధరల పెంపు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఇటీవలె మేకర్స్ విజ్ఞప్తి చేసుకున్నారు. గురువారం టికెట్ల ధరను పెంచుకోవడానికి చిత్ర బృందానికి ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సినిమా విడుదలైన రోజు నుంచి పదిరోజుల పాటు సింగిల్ స్ర్కీన్స్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్సుల్లో రూ.75 పెంచుకునే వెసులుబాటును కల్పించింది. సినిమా విడుదలకు ముందురోజు రాత్రి ప్రీమియర్ షోలను ప్రదర్శించడానికి చిత్రబృందం ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

బాయ్‌కాట్ చేస్తారా.. అంత భయమెందుకు?



- పవన్ కల్యాణ్

'కొంత మంది మన చిత్రాన్ని బాయ్‌కాట్ చేస్తామంటున్నారు. వారికి అంత భయమెందుకు? అలాంటి వారికి నేను ఇచ్చే సమాధానం ఒకటే.. బాయ్‌కాట్ చేసుకుంటే చేసుకోండి. ఇదేమన్నా క్విట్ ఇండియా ఉద్యమమా? ఇలాంటి తాటాకుల చప్పుళ్లకు నేను బెదరను. నేను ఈ రోజు ఇంత బలంగా ఉన్నానంటే అందుకు నా అభిమానులే కారణం. మన సినిమా గురించి నెగెటివ్‌గా మాట్లాడుతున్నారంటే మనం బలంగా ఉన్నామని అర్థం. ప్రతి సోషల్ మీడియా కామెంట్‌నూ మనం తిప్పికొట్టాలి' అని అన్నారు పవన్ కల్యాణ్. ఆయన కథానాయకుడిగా నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం గురువారం విడుదలైన సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'సినిమా జయాపజయాలను నేను పట్టించుకోను. ఏ రంగంలోనైనా మన సామర్థ్యాన్ని మెరుగుపర్చుకునే అవకాశం ఉంటుంది. ఈ కథను మొదట క్రిష్, ఏ.ఎం. రత్నం నా వద్దకు తీసుకొచ్చినప్పుడు ఎలా చేయగలం అనే సందేహం కలిగింది. ఈ సినిమా చేస్తున్నప్పుడు నేను చిన్నప్పుడు చదువుకొన్న జిజియా పన్ను గుర్తుకొచ్చింది. మనం ఎప్పుడైనా అక్బర్ ద గ్రేట్ అని వింటాం. కానీ, కృష్ణరాయ ద గ్రేట్ అని, రాణి రుద్రమదేవి ద గ్రేట్ అని వినం. మొఘలులు కేవలం 200 ఏళ్లు మాత్రమే పాలించారు. చాళుక్యులు, పల్లవులు, కాకతీయులు, విజయనగర రాజులు వందల ఏళ్లు పరిపాలించారు. ఎందుకో కానీ మన చరిత్రకారులు మన రాజులపై చిన్న చూపు చూశారనిపిస్తోంది. అక్బర్, ఔరంగజేబ్ గొప్పదనం గురించి వివరించినప్పుడు... జిజియా పన్ను గురించి ఎందుకు మాట్లాడకూడదు? ఔరంగజేబ్ మరణించి శతాబ్దాలవుతున్నా ఆయన గురించి మాట్లాడాలంటే ఇప్పటికీ సెన్సిటివ్‌గా ఫీలవుతున్నాం. అందుకే ఔరంగజేబ్ దారుణాల గురించి ఈ తరం వాళ్లకు తెలియజేయాలనే ఈ సినిమా తీశాం. ఔరంగజేబ్ దారుణాలను ప్రేక్షకుల మదిలోకి తీసుకెళ్లడం అన్నిటికంటే నాకు దక్కిన పెద్ద విజయం. ఒక ప్రాంతీయ సినిమాని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన నిర్మాతకు అండగా ఉండాలనుకున్నాను. అందుకే ఈ సినిమాను నా భుజాలపై వేసుకున్నాను. నేను నవలలు బాగా చదువుతాను. కానీ ఎప్పుడు కూడా నన్ను నేను హీరోగా ఊహించుకోలేదు. కాలమే నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్, నవీన్ అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా విడుదలకు సహకరించారు. 'హరిహర వీరమల్లు' రెండో భాగం 25 నుంచి 30 శాతం వరకు చిత్రీకరించాం' అని అన్నారు. నిర్మాత వై. రవిశంకర్ మాట్లాడుతూ 'పవర్ స్టార్ పవర్ ఏంటో ఫస్ట్ షోలోనే చూశాం. అన్ని చోట్లా మంచి టాక్ వస్తోంది. ఇదే కంటిన్యూ అవుతుందని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాం' అని అన్నారు. మరో నిర్మాత యెర్నేని నవీన్ మాట్లాడుతూ 'సినిమా బ్లాక్ బస్టర్ అని రాష్ట్రమంతా ఒకే మాట వినపడుతోంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు జ్యోతి కృష్ణ మాట్లాడుతూ 'ఈ సినిమాకు ఇద్దరు హీరోలు ఒకరు పవన్, మరొకరు కీరవాణి. పవన్ సార్ కంపోజ్ చేసిన ఫైట్‌కు మంచి స్పందన వస్తోంది. మా నాన్నగారు ఇంతవరకు చాలా హిట్ చిత్రాలు నిర్మించారు. ఆయన తొలి సినిమా హిట్ అయిన రోజున ముఖంలో చూసిన ఆనందం మళ్లీ ఈ చిత్రం ప్రీమియర్ షో సందర్భంగా చూశాను' అని అన్నారు. చిత్ర నిర్మాత ఏ.ఎం. రత్నం మాట్లాడుతూ 'ఇది సినిమా కాదు. ఒక చరిత్ర. సనాతన ధర్మ పరిరక్షణకు ఔరంగజేబుని ఎదుర్కొనే ఓ వీరుడి కథే 'హరిహర వీరమల్లు'. ఈ సినిమాను కుటుంబ సభ్యులందరూ కలసి చూస్తున్నారు. ఈ సినిమా కచ్చితంగా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం నాకుంది' అని పేర్కొన్నారు. హీరోయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ చిత్రం విజయం సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది అని అన్నారు.

అదొక అద్భుత దృశ్య కావ్యం

- పృథ్వీరాజ్ సుకుమారన్



మహేశ్‌బాబు - రాజమౌళి కాంబినేషన్‌లో 'ఎస్ఎస్ఎంబీ 29(వర్కింగ్ టైటిల్)' సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించి రెగ్యులర్‌గా అప్డేట్స్ ఇస్తూ సినిమాపై అంచనాలను పెంచుతున్నారు. తాజాగా ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా 'ఎస్ఎస్ఎంబీ 29' సినిమా ఉండబోతుందని అంటూ ఆయన మరింత హైప్‌ను క్రియేట్ చేశారు. సుకుమార్ నటించిన తాజా చిత్రం 'సర్జమీన్'. దీని ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఎస్ఎస్ఎంబీ 29' గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకొన్నారు. 'ఇప్పటి వరకూ ఎవరూ ఊహించని రీతిలో ఈ కథను రాజమౌళి తీర్చిదిద్దుతున్నారు. అదొక అద్భుత దృశ్య కావ్యం. రాజమౌళి సర్ ఎంచుకొనే కథలన్నీ భారీగా ఉంటాయి. ఇది కూడా అలాంటిదే. ప్రతి ఒక్కరినీ అలరించేలా రాజమౌళి కథను చెబుతారు' అని పృథ్వీరాజ్ సుకుమారన్ తెలిపారు. కాగా, ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడి కథగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు.



రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టేలా



విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటించిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వంలో రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సెప్టెంబర్ 5న విడుదలవుతోంది. చిత్రబృందం బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'ఇది నాకు 25వ చిత్రం. న్యూ పొలిటికల్ జానర్‌లో వస్తోంది. సామాజిక బాధ్యతతో కూడిన కథతో దర్శకుడు తెరకెక్కించారు. నేటి సమాజంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టేలా ఉంటుంది. గతంలో రాజకీయ నేపథ్యంలో వచ్చిన చిత్రాలకు భిన్నమైన శైలిలో సాగుతుంది' అని చెప్పారు. అరుణ్ ప్రభు మాట్లాడుతూ 'ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించే ఓ విభిన్న కథా చిత్రమిది. సినిమా నేపథ్యానికి తగ్గట్టు అణగారిన వర్గాల తరపున పోరాడే యోధుడి పాత్రలో విజయ్ ఆంటోని ఆకట్టుకుంటారు. ప్రేక్షకులు ఆశించే అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని అన్నారు.

కమల్‌హాసన్ మెచ్చుకున్నారు

యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన గ్రామీణ ప్రేమకథా చిత్రం 'ఉసురే'. టీజయ్ అరుణాచలం, జననీ కునశీలన్ జంటగా నటించారు. నవీన్ డి. గోపాల్ దర్శకత్వంలో మౌళి ఎం. రాధాకృష్ణ నిర్మించారు. ఆగస్టు 1న విడుదలవుతోంది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సీనియర్ హీరోయిన్ రాశి మాట్లాడుతూ 'ప్రేయసి రావే' చిత్రంలో హీరో శ్రీకాంత్‌ని కొట్టాను. ఆ సినిమా సూపర్‌హిట్టయింది. ఇప్పుడు 'ఉసురే' చిత్రంలోనూ హీరోను కొట్టాను. ఈ సినిమా కూడా మంచి విజయం అందుకుంటుందేమో చూడాలి. ఇందులో హీరోయిన్ తల్లి పాత్ర పోషించాను. దర్శకుడు మంచి విజన్‌తో 'ఉసురే'ను తెరకెక్కించారు. నిర్మాత గ్రాండియర్‌గా నిర్మించారు. సినిమాలో మంచి ట్విస్ట్ ఉంది. నా పాత్ర చూసి అందరూ ఆశ్చర్యపోతారు' అన్నారు. నవీన్ డి. గోపాల్ మాట్లాడుతూ 'ఈ సినిమా ట్రైలర్‌ను కమల్‌హాసన్ గారికి చూపించాం. ఆయనకు బాగా నచ్చింది. ప్రేక్షకులకు అచ్చతెలుగు సినిమా చూసిన అనుభూతినిస్తుంది అని ప్రశంసించారు' అని తెలిపారు. మౌళి ఎం. రాధాకృష్ణ మాట్లాడుతూ 'సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ పాయింట్‌ను చర్చిస్తూ సందేశాత్మకంగా ఈ చిత్రం తెరకెక్కించాం. రాశి పాత్ర శక్తిమంతంగా ఉంటుంది' అని చెప్పారు.



సజ్జలపై కేసు నమోదు చేస్తున్నారా.. లేదా?

▸▸ **ప్రాసిక్యూషన్‌ను ప్రశ్నించిన హైకోర్టు**

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): సంకరజాతి అంటూ రాజధాని ప్రాంత ప్రజలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేస్తున్నారో, లేదో చెప్పాలని ప్రాసిక్యూషన్‌ను హైకోర్టు ఆదేశించింది. సజ్జల దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారంరోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. గురువారం విచారణలో సజ్జల తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉన్నప్పుడు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని అన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. ఈ ఫిర్యాదు ఆధారంగా ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని, అందువల్ల ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి అవకాశం లేదని చెప్పారు. కేసు నమోదు చేయాలా వద్దా అనేది దర్యాప్తు అధికారి విచక్షణాధికారమని తెలిపారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. డిప్యూటీ స్పీకర్ ఫిర్యాదు ఆధారంగా పిటిషనర్‌పై కేసు పెడుతున్నారో లేదో వివరాలు తమ ముందుంచాలని ఆదేశించారు. సజ్జలపై తొందరపాటు చర్యలు వద్దని గతంలో ఇచ్చిన ఉత్తర్వులను తదుపరి విచారణ వరకు పొడిగించారు.

పేర్నినాని, కైలే అనిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తల సమావేశంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో పామర్రు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ పార్టీ నేతలు పేర్నినాని, కైలే అనిల్ కుమార్ వేసిన క్వాష్ పిటిషన్లపై విచారణను హైకోర్టు ఈనెల 31కి వాయిదా వేసింది. వీరిపై తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తదుపరి విచారణ వరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఉత్తర్వులు ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయండి

▸▸ **హైకోర్టులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు పిటిషన్**

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతిస్తూ రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఈనెల 22న ఇచ్చిన ఉత్తర్వులను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు గురువారం హైకోర్టులో సవాల్ చేశారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. గురువారం కోర్టు విచారణ ప్రారంభమైన వెంటనే అనంతబాబు వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది సి.రఘు అభ్యర్థించారు. పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరుపుతామని న్యాయమూర్తి వై.లక్ష్మణరావు ప్రకటించారు.

విద్యాహక్కు చట్టం సీట్లకు ఫీజులు ఖరారు

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం సీట్లకు ప్రభుత్వం ఫీజులు ఖరారు చేసింది. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. ప్రైవేటు పాఠశాలల్లోని మౌలిక వసతుల ఆధారంగా స్టార్ రేటింగ్ ఇచ్చారు. ఒక స్టార్‌లో ఉన్న పాఠశాలలకు రూ.8500, రెండు స్టార్లు ఉంటే రూ.10వేలు, మూడు స్టార్లు ఉంటే రూ.11,500, నాలుగు స్టార్లు ఉంటే రూ.13వేలు, ఐదు స్టార్లు ఉంటే రూ.14,500 ఫీజు అని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలోని ఒక్క ప్రైవేటు పాఠశాలకు కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ లేదు. అందువల్ల గరిష్ఠంగా రూ.13వేల ఫీజు వర్తిస్తుంది. ఈ నగదును ప్రభుత్వం తల్లికి వందనం నిధుల నుంచి నేరుగా పాఠశాలలకు చెల్లిస్తుంది.

ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల ఫోరం ఏర్పాటు

▸▸ **అధ్యక్షుడిగా సీవీ ప్రసాద్ ఎన్నిక**

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా నియమితులైన ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏపీ పీఎస్ హెచ్‌ఎం ఫోరంను ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా కడప జిల్లాకు చెందిన సీవీ ప్రసాద్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వి.వెంకటేశ్వరరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా బి.సుధాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా బి.సూర్యనారాయణ, టి.భాస్కర్‌రెడ్డి, ధర్నాశి చిరంజీవి, జి.వెంకటరమణయ్య, ఎల్.రమేష్‌కుమార్, బి.బాబురెడ్డి, కార్యదర్శులుగా బి.చంద్రశేఖర్, గోవిందు నాగరాజు, కె.చిన్నారావు, డి.రవీంద్రనాథ్, పి.చిట్టిబాబు ఎన్నికైనట్లు ఫోరం ఓ ప్రకటనలో తెలిపింది.

ఇకపై ఆఫ్‌లైన్‌లోనే డిగ్రీ అడ్మిషన్లు

▸▸ **కాలేజీలకు ఐదేళ్ల అఫిలియేషన్లకు ఒకే**

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఇకపై డిగ్రీ అడ్మిషన్లను పూర్తిగా ఆఫ్‌లైన్ విధానంలోనే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థికి అడ్మిషన్ ఇచ్చిన తర్వాత ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధానానికి అంగీకారం తెలిపింది. పలు డిమాండ్లపై డిగ్రీ కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులతో ఎమ్మెల్సీలు, ఉన్నత విద్యాశాఖ బుధ, గురువారాల్లో నిర్వహించిన చర్చల్లో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఎమ్మెల్సీలు వి.చిరంజీవి, రామ్‌గోపాల్‌రెడ్డి, ఆలపాటి రాజా, కె.శ్రీకాంత్.. డిగ్రీ కాలేజీల యాజమాన్యాలతో విద్యాశాఖ కార్యాలయంలో చర్చలు జరిపారు. కార్యదర్శి కోన శశిధర్ కూడా పాల్గొన్నారు. సొసైటీ పేరు మీద లేదా, సొసైటీలోని ఒక సభ్యుని పేరుపై సొంత భవనాలు కలిగి ఉంటే ఐదేళ్ల పాటు అఫిలియేషన్లు జారీచేసేందుకూ అనుమతిచ్చారు. ఒకవేళ సొసైటీ పేరు మీద భవనం లేకపోతే 30ఏళ్ల లీజు అగ్రిమెంట్ ఉండాలి. యాజమాన్యాల వినతి మేకు డిగ్రీ కోర్సులకు కనీస ఫీజు నిర్ణయించాలని, సెప్టెంబరు నుంచి కొత్త ఫీజుల ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయించారు. డిగ్రీలో మేనేజ్‌మెంట్ కోటా రద్దుపై మాత్రం సానుకూలత రాలేదు. ఇకపై ప్రతినెలా విడతల వారీగా పెండింగ్ ఫీజులు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. డిమాండ్లలో 80% పరిష్కరించినందున ఆందోళనలను విరమించుకుంటున్నట్లు డిగ్రీ కాలేజీల సంఘం ప్రతినిధులు రమణాజీ, విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మూడున్నర కోట్ల ఉద్యోగాల సృష్టి లక్ష్యం

▸▸ **ఈఎల్‌ఐ పథకంపై అవగాహన సదస్సులో అధికారుల వెల్లడి**

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మూడున్నర కోట్లకు పైగా ఉద్యోగాలను సృష్టించడమే ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం(ఈఎల్‌ఐ) లక్ష్యమని ఉద్యోగుల భవిష్య నిధి, ఆదాయపన్ను శాఖల సీనియర్ అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకం గురించి రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ ఛాంబర్స్) గురువారం విజయవాడలో అవగాహన సదస్సు నిర్వహించింది. ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సెంట్రల్ పీఎఫ్ అదనపు కమిషనర్ పి.వీరభద్రస్వామి, రీజినల్ పీఎఫ్ కమిషనర్లు హెమోంగ్ వెంకటేష్, ప్రభుదత్త పృష్టీ, అబ్దుల్ ఖాదర్, ఆదాయపన్నుశాఖ (టీడీఎస్) అధికారి పి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేఎం క్లాస్ సబ్‌మెరైన్ పునర్నిర్మాణం

▸▸ **సంప్రదాయ సబ్‌మెరైన్ రీఫిట్ భారత్‌లో ఇదే తొలిసారి**

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రష్యా తయారీ ఈకేఎం క్లాస్ సబ్‌మెరైన్ పునర్నిర్మాణ (రీఫిట్) పనులను విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) విజయవంతంగా పూర్తిచేసింది. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా అనుకున్న సమయంలోనే దీన్ని పూర్తి చేసినందుకు నేవీ వర్గాలు హెచ్‌ఎస్‌ఎల్‌ను అభినందించాయి. ఈ సందర్భంగా షిప్‌యార్డ్ సీఎండీ కమొడోర్ హేమంత్ ఖత్రి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల అనుభవం, ఉద్యోగులు, కార్మికుల నిబద్ధత వల్లే ఈ రీఫిట్ పనులు సకాలంలో పూర్తి చేయగలిగామని చెప్పారు. ఒక సంప్రదాయ సబ్‌మెరైన్‌ను భారత షిప్‌యార్డ్‌లో రీఫిట్ చేయడం ఇదే మొదటిసారని ప్రకటించారు. ఇదే ఉత్సాహంతో స్కార్పియన్ క్లాస్ సబ్‌మెరైన్ల రీఫిట్ పనుల కోసం కూడా పోటీ పడుతున్నామని చెప్పారు. వియత్నాం పీపుల్స్ నేవీతో సబ్‌మెరైన్ల రీఫిట్ కోసం చర్చలు జరుగుతున్నాయన్నారు.



పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న ఈకేఎం క్లాస్ సబ్‌మెరైన్

ఆదుకున్న చేయే.. ఆపదలో!

▸▸ **పక్షవాతంతో ఆస్పత్రికే పరిమితమైన కడప జిల్లా వాసి**

▸▸ **ఇండియాకు వెళ్లే మార్గంలేక కన్నీరుమున్నీరు**

దుబాయిలో తెలుగు వ్యాపారి దైన్యం

వ్యాపారంలో నష్టాలతో పీకల్లోతు కష్టాలు

కోర్టు కేసులతో ఇండియాకు రాలేని దుస్థితి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఒకప్పుడు డబ్బు, దర్పంతో దుబాయిలో దర్జాగా గడిపిన కడప జిల్లాకు చెందిన తెలుగు వ్యాపారి.. వ్యాపారంలో నష్టాలతో ఒక్కసారిగా పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయారు. వందలాది మందికి దుబాయిలో ఉపాధి అవకాశాలు చూపిన ఆయన.. నేడు పరిస్థితులు ప్రతికూలించి ఆశల సౌధలన్నీ కుప్పకూలగా.. పక్షవాతంతో ఆస్పత్రి మంచానికే పరిమితమయ్యారు. కోర్టు కేసుల కారణంగా స్వదేశానికి కూడా రాలేని తన దయనీయ స్థితిపై కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాలివీ.. కడప జిల్లా కమలాపురానికి చెందిన 46 ఏళ్ల సి.దామోదర్‌రెడ్డి మొదట్లో యూఏఈలో ఉద్యోగం చేసేవారు. తర్వాత సొంతంగా అనేక వ్యాపారాలు ప్రారంభించారు. తన ప్రాంతానికి చెందిన సుమారు 400 మందికి దుబాయి, షార్జా తదితర ప్రాంతాల్లో మంచి మంచి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఈ క్రమంలో దామోదర్‌రెడ్డి షార్జాలో ఒక డయాగ్నోస్ సెంటర్‌ను ప్రారంభించి వివాదంలో ఇరుక్కుని నష్టాలను చవిచూశారు. ఇతర వ్యాపారాల్లోనూ అనుకోకుండా నష్టాలు రావడంతో అప్పులపాలయ్యారు. భవనాల అద్దె కోట్లలో పేరుకుపోవడంతో వాటి యజమానులు దామోదర్ రెడ్డిపై కేసులు వేశారు. దీంతో అప్పులు తీర్చాలని కోర్టు ఆదేశిస్తూ.. అప్పులు చెల్లించేవరకు దేశం విడిచి వెళ్లకుండా ఆంక్ష విధించింది. ఆయన కుటుంబ సభ్యులంతా ఇండియాలో ఉండగా, ఆయన ఇక్కడ ఒంటరిగా మిగిలారు. ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ, మరోవైపు స్వదేశానికి తిరిగి వెళ్లే అవకాశం లేక మానసికంగా కుంగిపోయిన దామోదర్‌కు పక్షవాతం వచ్చి మాట పడిపోయింది. కుడి చేయి, కాలు పని చేయక, నిస్సహాయ స్థితిలో నాలుగు నెలలుగా దుబాయిలోని ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పలకరించేవారు కూడా లేకపోవడంతో స్వదేశానికి వెళ్లి చికిత్స చేయించుకోంటానని దామోదర్ రెడ్డి కన్నీరుమున్నీరవుతున్నా ఆయనపై నిషేధం ఉండడంతో ఆయన కోరిక నెరవేరడంలేదు.



దుబాయిలోని ఓ ఆస్పత్రిలో కడప జిల్లా వాసి దామోదర్

ఆ ఇద్దరి వల్లే తొక్కిసలాట!

▸▸ **ఈ ఘటనకు డీఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డి బాధ్యులు**

▸▸ **తిరుపతి తొక్కిసలాటపై న్యాయకమిషన్ నివేదిక**



వి. రమణకుమార్



కె. హరనాథరెడ్డి



ఐఏఎస్ గౌతమి

అమరావతి/తిరుపతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): "వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలేశుడి దర్శనం కోసం టీటీడీ, పోలీసు, విజిలెన్స్ సెక్యూరిటీ విభాగాలు పక్కా ఏర్పాట్లు చేశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కానీ, ఇద్దరు అధికారుల వైఫల్యంతో తిరుపతిలోని పద్మావతి పార్క్ సమీపంలోని టోకెన్ జారీ కౌంటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఉన్నతాధికారులు ఇచ్చిన ముందు జాగ్రత్త చర్యలను ఆ ఇద్దరు పాటించకపోవడం, విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం, తమ పరిధి కొంతే అని గిరి గీసుకొని కూర్చొని, మిగతా అంశాలను పట్టించుకోకపోవడంతో తొక్కిసలాటకు ఆస్కారం ఏర్పడింది" అని జస్టిస్ ఎం. సత్యనారాయణ మూర్తి నేతృత్వంలోని న్యాయ కమిషన్ వెల్లడించింది. ప్రభుత్వానికి ఈ నెల 10న సమర్పించిన నివేదికలో ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొంది. ఈ నివేదికను సీఎం చంద్రబాబు నేతృత్వంలోని మంత్రివర్గం ఆమోదించింది.

ఇదీ నేపథ్యం: తిరుపతిలోని పద్మావతి పార్కు వద్దనున్న రామానాయుడు హైస్కూల్‌లో 2025 జనవరి 8న ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్ పరిధిలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మరణించారు. 40మందికి పైగా తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో నాటి తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, టీటీడీ జేఈవో గౌతమిపై బదిలీ వేటువేశారు. మరో ఇద్దరు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ దుర్ఘటనపై విచారణకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎం. సత్యనారాయణ మూర్తితో న్యాయకమిషన్ ఏర్పాటు చేశారు. 54మంది ప్రత్యక్ష సాక్షులు, మృతుల కుటుంబీకులు, గాయపడ్డవారు, వారి బంధువులు, పోలీసు, విజిలెన్స్, టీటీడీ ఉద్యోగులను కమిషన్ సమగ్రంగా విచారించింది. పద్మావతి పార్క్ వద్ద గల టోకెన్ జారీ కేంద్రంలో జరిగిన తొక్కిసలాటకు ఇద్దరు అధికారులదే ప్రధాన బాధ్యత అని కమిషన్ అభిప్రాయపడింది. అందులో ఒకరు ఈ కేంద్రం పరిధిలో డ్యూటీలో ఉన్న డీఎస్పీ వి. రమణకుమార్ కాగా, మరొకరు ఈ కేంద్రం ఇన్‌చార్జిగా నియమించిన వేంకటేశ్వర గో సంరక్షణశాల డైరెక్టర్ హరనాథరెడ్డి. "విధి నిర్వహణలో వారు చిత్తశుద్ధితో లేరు. తమకు అప్పగించిన బాధ్యతలను త్రికరణశుద్ధిగా నిర్వహించలేదు. దారుణ మైన తొక్కిసలాటకు వీరిద్దరే బాధ్యులని కమిషన్ భావిస్తోంది. రామానాయుడు హైస్కూల్‌లోని టోకెన్ జారీ కేంద్రం వద్ద మధ్యాహ్నం 2గంటలకు డీఎస్పీ రమణకుమార్ రిపోర్టు చేయలేదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న 70ఏళ్ల వృద్ధురాలిని పార్క్ గేటు నుంచి బయటకు పంపాలని నిర్ణయించారు. ఒక్కసారి గేటు తీస్తే ఏం జరుగుతుందో అంచనా వేయలేదు. డీఎస్పీ గేటు తీయడంతో ముందు వెళ్లాలన్న తాపత్రయంలో భక్తుల మధ్య తొక్కిసలాట జరిగింది. డాక్టర్ హరనాథ్‌రెడ్డి టోకెన్ జారీ కేంద్రానికి ఇన్‌చార్జి. భక్తుల క్యూలైన్ల నిర్వహణ, ఇతర జాగ్రత్తలేవీ తనకు సంబంధించినవి కావన్నట్లుగా వ్యవహరించారు. టోకెన్ కేంద్రాలకు ఇన్‌చార్జిగా ఉన్న టీటీడీ జేఈవో గౌతమి క్షేత్రస్థాయి పర్యవేక్షణ విషయంలో వైఫల్యం చెందారు" అని కమిషన్ పేర్కొంది.

ప్రభుత్వానికి సిఫారసులు

- భవిష్యత్తులో తిరుమల, తిరుపతిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుడా న్యాయకమిషన్ కొన్ని సిఫారసులు చేసింది.
- భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వనరులను మరింతగా పెంపొందించాలి.
- టోకెన్ల జారీకి, భారీ రద్దీని నియంత్రించేందుకు, వీఐపీల దర్శనాల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకునేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని అందిపుచ్చుకోవాలి.
- దైవదర్శనానికి వచ్చే భక్తుల క్యూలైన్లను నిర్వహించడం, రద్దీ నియంత్రణలో ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలి.
- న్యాయ కమిషన్ చేసిన సిఫారసులపై అధ్యయనం చేయాలని దేవదాయ శాఖను ప్రభుత్వం ఆదేశించింది.

ఆ ముగ్గురిపై చర్యలు

న్యాయకమిషన్ నివేదిక ఆధారంగా డీఎస్పీ వి. రమణకుమార్, వేంకటేశ్వర గో సంరక్షణశాల డైరెక్టర్ కె. హరనాథరెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఐఏఎస్ గౌతమిపై చర్యలు తీసుకునే బాధ్యతను జీఏడీకి అప్పగించారు.



తొక్కిసలాటలో తిరుపతి ఎస్పీ తప్పేమీ లేదు

▸▸ **ఐపీఎస్ సుబ్బారాయుడికి న్యాయ కమిషన్ క్లీన్‌చిట్**

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్పీగా పనిచేసిన ఐపీఎస్ అధికారి సుబ్బారాయుడికి ఊరట లభించింది. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం ఈ ఏడాది జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆయన వైఫల్యం ఏమీ లేదని జస్టిస్ సత్యనారాయణమూర్తి కమిషన్ తేల్చినట్లు తెలిసింది. సుబ్బారాయుడు పోలీసుశాఖపరంగా అన్ని ముందస్తు చర్యలూ తీసుకున్నారని క్లీన్‌చిట్ ఇచ్చినట్లు సమాచారం. న్యాయ కమిషన్ ఈ నెల 10న సమర్పించిన నివేదికను మంత్రివర్గం గురువారం ఆమోదించింది. తొక్కిసలాట అనంతరం సీఎం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. నాడు విధుల్లో ఉన్న పలువురు అధికారులతో పాటు తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడిపై బదిలీ వేటు పడింది. ఈ ఘటనపై అన్ని కోణాల్లో న్యాయ కమిషన్ విచారించింది. తిరుపతి ఎస్పీగా సుబ్బారాయుడు ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకున్నారని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తుగా తగినంత మంది అధికారులను నియమించి ఎస్పీగా తన విధి నిర్వహించారని కమిషన్ పేర్కొన్నట్లు తెలిసింది. తిరుపతి ఎస్పీగా ఉన్న సుబ్బారాయుడిని బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన్ను ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ అధికారిగా, ఆ తర్వాత మద్యం కుంభకోణంపై విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో సభ్యుడిగా నియమించింది.

భూమన భూదందా నిజమే

స్వర్ణముఖి నది పక్కనే 9 ఎకరాలు కబ్జా

నిర్ధారించిన రెవెన్యూశాఖ



మ్యాపులో లైట్ బ్లూ కలర్‌ను ఫిల్‌చేసిన ఏరియా కబ్జాచేసిన భూమి 9 ఎకరాలు, దాని పక్కనే స్వర్ణముఖి నది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాజకీయ విలువల గురించి ఉపన్యాసాలు ఇచ్చే తిరుపతి వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి గుట్టురట్టయింది. తిరుపతి సమీపంలోని తిరుచానూరులో ఆయన 50 కోట్లపైన విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాచేశారని రెవెన్యూశాఖ నిగ్గు తేల్చింది. ఆయన తిరుపతి ఎమ్మెల్యేగా ఉండగానే తిరుచానూరులో స్వర్ణముఖి నదీపరివాహకంలోని 9 ఎకరాల ప్రభుత్వ భూమిని తన భూమిలో కలిపేసుకొని.. చుట్టూ ప్రహరీగోడ కట్టేసుకున్నారు. ఆనాడు ఆయన వైసీపీ ప్రభుత్వంలో బాగా పలుకుబడి కలిగిన వ్యక్తి. దీంతో రెవెన్యూ యంత్రాంగం నోరు మెదపలేదు. నాటి ఇనాం, రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే భూ కబ్జాకు జీ హుజూర్ అన్నారు. అయితే, కబ్జాచేసిన భూమిపై ప్రైవేటు పట్టా ఇవ్వనన్నందుకు ఓ పెద్ద యుద్ధమే చేశారు. ఓ ఉన్నతాధికారి వద్దకు రాయబేరాలు పంపినా ఫలితం లేకపోవడంతో వ్యక్తిగత వైరం కింద ఆయన పోస్టింగ్‌ను మార్పించేశారు. అయినా భూమి కబ్జా ఇప్పుడు బట్టబయలైంది. తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విచారణలో వాస్తవాలన్నీ బయటకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో భూ కబ్జా నిరోధక చట్టం కింద భూమనకు రెవెన్యూశాఖ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.చట్టపరంగా ఆయనపై కేసులు పెట్టేందుకూ సన్నద్ధమవుతోంది.

ప్రహరీ కట్టి కలిపేసుకున్నారు..

తిరుచానూరులో భారీగా ఇనాం భూములున్నాయి. దాని పక్కనే సర్వేనంబర్ 479లో స్వర్ణముఖి నదీ పరివాహక భూములు ఉన్నాయి. నిజానికి సర్వే నంబర్లు 472, 473, 474లో భూమన భార్య జె. రేవతి, ఆయన కుమారుడు అభినయ్ పేరిట 15.36 ఎకరాలుంది. ఇందులోనే మరో 9 ఎకరాల ఇనాం, స్వర్ణముఖి నదీ పరివాహకం ఉన్నట్లు తొలుత విజిలెన్స్ గుర్తించింది. రెవెన్యూశాఖ ఈ భూమిని క్షేత్రస్థాయిలో సర్వే చేసి పరిశీలించినప్పుడు భూమన నికరంగా 9 ఎకరాల భూమిని కబ్జా చేసినట్లు గుర్తించింది. అదెలాగంటారా.... భూమన కంట్రోల్‌లో ఉన్న భూమిలో మామిడితోట ఉంది. ఇదంతా 24.36 ఎకరాల్లో ఉంది. ఇందులో రికార్డుల ప్రకారం 15.36 ఎకరాల భూమికే భూమనకు రికార్డులున్నాయి. మిగిలిన 9 ఎకరాలకు రికార్డులేదు. ఆ భూమి నిజానికి ఇనాం భూమి. ఇందులోనే కొంత స్వర్ణముఖి నదీపరివాహకం కూడా కలిపి ఉంది. ఇలా ప్రభుత్వ భూమిని తన ఖాతాలో వేసుకొని భూమన చుట్టూ ప్రహరీగోడ కట్టేశారు. నదీ పరివాహకం తన భూమిలో కలిపేసుకున్న విషయం సామాన్యులకు అర్థంకాకుండా ఉండేందుకు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన మట్టితో ఆ ప్రాంతాన్ని నింపేశారు. అంటే, తోట భూమితో సమానంగా దీన్ని ఎత్తు పెంచారు. ఇందుకోసం లక్ష టన్నులమేర గ్రావెల్ వాడి ఉంటారని రెవెన్యూవర్గాలు గుర్తించాయి. ఈ మట్టి ఎక్కడి నుంచి తెచ్చారనే కోణంలో ఆరా తీయాల్సిందిగా గనులశాఖను రెవెన్యూశాఖ కోరింది.

నదీ కబ్జా..

2023లో స్వర్ణముఖి నదీ భూ ముల పరాధీనం పేరిట 'ఆంధ్రజ్యోతి' తొలి వార్తను ప్రచురించింది. కూటమి ప్రభుత్వంలో దీనిపై విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టింది. తిరుచానూరు సమీపంలోని భూమన తన భూముల్లో ప్రభుత్వ భూమిని కలిపేసుకున్నారని, భూ కబ్జా వార్త నిజమేనని విజిలెన్స్ నిర్ధారించింది. దీనిపై ఈ ఏడాది మే 7వ తేదీన స్వర్ణముఖి నదిలో విలువైన భూములు భూమన కరుణాకర్‌రెడ్డి కబ్జాచేశారంటూ 'భూ కబ్జాల భూమన' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రముఖంగా వార్తను ప్రచురించింది. దీనిపై కూటమి ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విజిలెన్స్ నివేదిక, 'ఆంధ్రజ్యోతి' వార్తల్లో పేర్కొన్న అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వం తిరుపతి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల బృందాలు స్వర్ణముఖి నదీపరివాహకంలోని భూములను నిశిత పరిశీలన చేసింది.

అక్రమాన్ని సక్రమం చేయాలని ఒత్తిడి..

తన భూమిలో కలిపేసుకున్న ఇనాం భూమిపై హక్కుల కోసం భూమన వైసీపీ అధికారంలో ఉండగా తెగ ప్రయత్నం చేశారు. ఆ నాటి ఇనామ్ డీటీతో సానుకూల ఉత్తర్వులు పొందారు. ఇందుకు ఆనాటి తిరుపతి రెవెన్యూ అధికారి కూడా ఇతోధికంగా సహాయం చేశారు. అయితే ఉన్నతస్థాయిలో అవరోధాలు ఎదురయ్యాయి. జిల్లాస్థాయి అధికారి ఒకరు ఇనాం భూమిని వదులుకునేది లేదని తేల్చిచెప్పారు. ఇనాం డీటీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేమని స్పష్టం చేశారు. దీంతో ఈ కేసును ఆ నాటి అప్పీల్స్ కమిషనర్ వద్దకు తీసుకెళ్లారు. ఆ తర్వాత ఏం జరిగిందో గానీ దీనికి సంబంధించిన ఫైలే కనిపించకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఓ కీలక అధికారి సహకారంతో ఈ ఫైలుకు తిరిగి ప్రాణంపోసే ప్రయత్నం చేశారు. తను అనుకున్నదే జరిగిపోతుందనుకున్నారో ఏమో...ప్రభుత్వ ఉత్తర్వులు, ఆదేశాలు రాకముందే ఇనాం భూమితోపాటు, పక్కనే ఉన్న స్వర్ణముఖి నదీ పరివాహకాన్ని కూడా భూమన తన భూమిలో కలిపేసుకున్నారు. తనకు భూములు, ఆస్తులు, అడ్డగోలు సంపాదనలపై ఆశే లేదని పదేపదే సూక్తులు చెప్పే భూమన, విలువైన ఇనాంతోపాటు, స్వర్ణముఖి నదీపరివాహక భూమిని కబ్జాచేశారని రెవెన్యూశాఖ తేల్చింది. పక్కా ఆధారాలు, రికార్డులతో సహా భూ కబ్జాను నమోదు చేసింది. మరి ఇప్పుడు ఆయన ఇది కూడా కల్పితం, కుట్ర అంటారా? లేక కబ్జా నిజమే అంటారా? చూడాల్సిందే.

భూమనపై చట్టపరమైన చర్యలు

తిరుచానూరులోని ఇనాం, స్వర్ణముఖి నదీ పరివాహక భూమిని భూమన కరుణాకర్ రెడ్డి కబ్జాచేశారని రెవెన్యూశాఖ నిర్ధారించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ఆయనపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. "భూమన కేవలం ఇనాం భూములే కాదు, ప్రైవేటు భూములు కూడా కబ్జాచేశారన్న ఫిర్యాదులున్నాయి. వాటిపై కూడా విచారణ చేయాలని అధికారులను ఆదేశించాను. తిరుచానూరులో ఇనాం భూమికబ్జా నిర్ధారణ అయింది కాబట్టి, భూ కబ్జా నిరోధక చట్టం, ఇతర రెవెన్యూ చట్టాల కింద ఆయనకు నోటీసులు ఇస్తాం. ఆపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని మంత్రి సత్యప్రసాద్ తెలిపారు.

రాష్ట్రంలో రోడ్లకు మహర్దశ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం భవిష్యత్‌లో రహదారుల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం రహదారుల పరిస్థితిపై ఆయన సమీక్ష చేశారు. రాష్ట్రంలో రహదారుల మరమ్మతుల కోసం అదనంగా మరో రూ.500 కోట్ల నిధులు ఇవ్వాలన్న ఆర్‌అండ్‌బీ ప్రతిపాదనకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏడాది వ్యవధిలో రాష్ట్రంలో రహదారుల మరమ్మతులకు రూ.1,800 కోట్ల మేర నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఇప్పుడు అదనంగా మరో రూ.500 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఇదిలా ఉంటే, వెయ్యి కోట్ల నిధులతో రాష్ట్రంలో మరో 2వేల కి.మీ. మేర కొత్త రహదారుల నిర్మాణానికి రంగం సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఆర్‌అండ్‌బీ ఇచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన ఆయన టెండర్లకు ఏర్పాట్లు చేసుకోవాలని నిర్దేశించారు. రాష్ట్రంలో ఇంకా ఎన్ని రోడ్లకు మరమ్మతులు చేయాలి? ఏవి కొత్తగా నిర్మించాలి? నిర్వహణకు వేటిని ఇవ్వాలన్న అంశాలపై 15 రోజుల్లో కార్యాచరణ నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర రహదారులను కూడా జాతీయ ప్రమాణాలతో నిర్మించాలన్నారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబరు నుంచి కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఏ రోడ్డును ఏ కాంట్రాక్టర్ నిర్మించారు? ఎవరు నిర్వహిస్తున్నారన్న వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి 50 కి.మీ. చొప్పున అన్ని రోడ్లపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రహదారుల నిర్వహణను కాంట్రాక్టర్‌కు అప్పగించి వర్షాకాలంలో రోడ్లు పాడవ్వకుండా కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. అధిక రద్దీ ఉన్న 1,332 కి.మీ. పొడవైన 18 రహదారులను పీపీపీ విధానంలో ఫేజ్-1లో అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు సీఎంకు నివేదించారు. రెండో దశలో 3,854 కి.మీ. పొడవైన 67 రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు.

ఏవియేషన్ హబ్‌గా ఏపీ!

▸▸ **మంత్రి బీసీ జనార్దనరెడ్డితో ఆయా సంస్థల ప్రతినిధుల భేటీ**

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): విమానయాన సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని చూపుతున్నాయి. విమాన తయారీ, పైలట్ శిక్షణ సంస్థలను రాష్ట్రంలో నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నామంటూ 9 ఫ్లయింగ్ ట్రైనింగ్, 2 విమాన తయారీ సంస్థలు ఆసక్తి చూపాయి. వెలగపూడి సచివాలయంలో గురువారం ఆయా సంస్థల ప్రతినిధులతో మంత్రి బీసీ జనార్దనరెడ్డి సమావేశమయ్యారు. రూ.600 కోట్ల పెట్టుబడులకు స్కై బర్డ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆసక్తి చూపింది. రూ.210 కోట్ల పెట్టుబడులకు ఎఫ్‌టీవో అండ్ హెలీ టాక్సీ సంస్థ ముందుకు వచ్చింది. ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటుకు ఫిలెక్స్ ఏవియేషన్ అకాడమీ సంసిద్ధత తెలిపింది.

ఏపీలో పర్యాటకాభివృద్ధికి కేంద్రం నిధులు

న్యూఢిల్లీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకరంగ అభివృద్ధికి గత పదేళ్లలో రూ.కోట్లు కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. గురువారం, రాజ్యసభలో టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. రాజమహేంద్రవరం-అఖండ గోదావరి, గండికోట వంటి ప్రాజెక్టులకు సాస్కి పథకం కింద రూ.113.75 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇటీవల స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు మంజూరు చేశామని, అరకు బొర్రా గుహలు, లంబసింగి ప్రాంతాల్లో కూడా బౌద్ధ పర్యాటక ప్రాజెక్టులను చేపట్టినట్లు తెలిపారు.

సైబర్ మోసాలపై అవగాహన సదస్సులు

▸▸ **ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ**

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఏపీటీఎస్ (ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్) రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తుందని ఆ సంస్థ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. విజయవాడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సత్వరమే రిలయన్స్ సీబీజీ ప్లాంట్లు

- మౌలిక వసతుల ఏర్పాటులో సహకరించండి
- ఇంధన సంస్థలను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్(సీబీజీ) ప్లాంట్లను సత్వరమే ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని విద్యుత్తు సంస్థల అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో గురువారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో కలసి రిలయన్స్ సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు పురోగతిపై మంత్రి సమీక్షించారు. సీబీజీ ప్లాంట్లను సత్వరమే పూర్తి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రిలయన్స్‌కు సంపూర్ణ సహకారం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంపట్ల రిలయన్స్ సంస్థల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. .

కొత్తగా 1.10 లక్షల వితంతు పెన్షన్లు: కొండపల్లి

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించే సామాజిక భద్రతా పెన్షన్‌ను అర్హులైన వారందరికీ అందించాలన్నది ప్రభుత్వం లక్ష్యం. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ జారీ పద్ధతిని సరళీకృతం చేసింది' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన చేశారు. 'పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే భార్యకు వీలైనంత త్వరగా పెన్షన్ ఇచ్చే విధానాన్ని అమల్లోకి తెచ్చాం. మొత్తంగా 1,09,155 మంది కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హత కలిగి ఉన్నారు. ఆగస్టు నుంచి కొత్తగా వారందరికీ స్పౌజ్ కేటగిరీలో వితంతు పెన్షన్ మంజూరుకు విధానపరమైన నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దీనికి ప్రతి నెలా రూ.43.66 కోట్లు అదనంగా ప్రభుత్వం ఖర్చు చేయనుంది' అని మంత్రి తెలిపారు.

తల్లికి వందనం రాలేదన్న ఆందోళన వద్దు

- సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్యవేణి

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 9,10 తరగతులు, ఇంటర్ చదువుతున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు తమకు తల్లికి వందనం రాలేదని ఆందోళన చెందవద్దని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆమె గురువారం ఒక ప్రకటన చేశారు. 'పైన పేర్కొన్న తరగతుల్లో రాష్ట్రంలోఎస్సీ విద్యార్థులు 3.93 లక్షల మంది ఉన్నారు. తల్లికి వందనం పథకంలో వారికి సంబంధించిన కొంత వాటాను కేంద్రం భరిస్తుంది. కేంద్రం వాటా సొమ్ము బ్యాంక్ లింకేజీ అయిన విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో మరో 20 రోజుల్లో జమవుతుంది' అని లావణ్య వేణి తెలిపారు.

హాస్టళ్లలో క్రీడలకు ప్రోత్సాహం: సవిత, డోలా

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ విద్యా సంస్థల్లో క్రీడలను ప్రోత్సహిస్తామని ఆ శాఖల మంత్రులు సవిత, డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. శాప్ చైర్మన్ రవినాయుడు గురువారం సచివాలయంలో మంత్రులిద్దరితో భేటీ అయ్యారు. అనంతరం మంత్రులు వేరు వేరుగా మీడియాతో మాట్లాడారు. క్రీడల్లో బీసీ హాస్టళ్ల విద్యార్థులు రాణించేలా ప్రణాళికలు రూపొందించామని మంత్రి సవిత తెలిపారు. శాప్ సహకారమందిస్తే దేశం గర్వించే క్రీడాకారులను అందించే అవకాశం కలుగుతుందన్నారు. ఇండోర్, ఔట్‌డోర్ స్పోర్ట్స్ కిట్లు అందజేయాలన్నారు. ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులు, బీఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థుల్ని క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆయా ప్రాంగణాల్లో క్రీడా వసతుల కల్పనకు ఎస్సీ కాంపోనెంట్ నిధులు కేటాయించాలని రవినాయుడు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాల దత్తత

- మార్గదర్శుల లక్ష్యాన్ని పూర్తి చేయాలి: సీఎస్

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టు 15నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేవిధంగా లక్ష్యాన్ని పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్, సిటీ గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్ అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, 'ఇప్పటివరకు 6.57లక్షల కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. మిగతా లక్ష్యాన్ని కూడా త్వరగా పూర్తిచేయాలి. నీడ్ అసెస్మెంట్ సర్వేను ఆగస్టు 5లోగా పూర్తి చేయాలి. రాష్ట్రంలో 540 కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను గుర్తించి, ఆయా శాఖలకు పంపాము. వాటిపై జిల్లా అధికారులతో చర్చించి, లక్ష్యసాధనకు చర్యలు తీసుకోవాలి' అన్నారు.

ఏటా 30 వేల క్యాన్సర్ మరణాలు: సత్యకుమార్

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ కారణంగా తల్లినీ, తోబుట్టువునూ కోల్పోయిన తనకు.. ఆ వ్యాధి ఎంత ప్రమాదకరమో అవగాహన ఉందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. స్వానుభవంతో ఈ వ్యాధిని అరికట్టడానికి కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో ఏటా 75వేల కొత్త క్యాన్సర్ కేసులు వెలుగులోకి వస్తుండగా, ఇందులో దాదాపు 30 వేల మంది మరణిస్తున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్సీడీ 4.0 సర్వేను పటిష్ఠంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు మంగళగిరిలో వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. గురువారం ఈ వర్క్‌షాపునకు హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే 70 శాతం స్క్రీనింగ్ లక్ష్యాన్ని చేరుకున్న ఎన్సీడీ 3.0ని ఈ ఏడాది ఆగస్టు వరకూ కొనసాగిస్తామని తెలిపారు. ఇందులో 4.10 కోట్ల మందిని స్క్రీనింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుని, ఇప్పటి వరకూ దాదాపు 3 కోట్ల మందిని పరీక్షించినట్లు తెలిపారు. సెప్టెంబరు నుంచి ఎన్సీడీ 4.0ను మరింత పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. క్యాన్సర్ వ్యాప్తిపై సర్వే చేపట్టిన ఏకైక రాష్ట్రంగా ఏపీకి ఘనత దక్కిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 10 ప్రధాన వ్యాధులు అనారోగ్య భారానికి కారణం కాగా, అందులో 6 అసంక్రమిత వ్యాధులేనని, వీటిని అరికట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్యానికి విఘాతం

- 2014 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోవాలి
- సీఈవోతో సమావేశంలో రాజకీయ పార్టీలు

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): బిహార్ తరహాలో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)ను రాష్ట్రాల్లో అమలుచేస్తే ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందని రాష్ట్రంలోని ప్రధాన పార్టీల ప్రతినిధులు పేర్కొన్నారు. 2002నాటి స్పెషల్ రివిజన్ కాకుండా రాష్ట్ర విభజన సందర్భంగా 2014లో జరిగిన ఎన్నికల ఓటరు జాబితాలను ప్రామాణికంగా తీసుకోవాలని టీడీపీ నేతలు కోరారు. గురువారం అమరావతి సచివాలయంలోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయంలో ఓటరు జాబితాల తయారీ, ఎన్నికల విధివిధానాలపై సూచనలు, సలహాల కోసం జాతీయ, రాష్ట్రస్థాయి రాజకీయ పార్టీల సమావేశాన్ని సీఈవో వివేక్‌యాదవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిపాదించిన అంశాలపై చర్చ జరిగింది. సమావేశానికి టీడీపీ తరఫున ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, ఏపీ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ రాజశేఖర్ హాజరయ్యారు. సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. '2002 ఎస్ఐఆర్‌ను పరిగణలోకి తీసుకుంటే ఉమ్మడి రాష్ట్రంలో, హైదరాబాద్ వలస వెళ్లిన ఆంధ్ర ప్రాంతం వారు తిరిగి ఇక్కడ ఓటు హక్కు పొందటం చాలా శ్రమతో కూడిన పని అవుతోంది. కాబట్టి విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఎస్ఐఆర్‌ను అమలుచేసే పక్షంలో 2014 ఎన్నికల నాటి జాబితాలను పరిగణలోకి తీసుకోవాలి. అన్ని పార్టీ రాజకీయ పార్టీల సలహా, సంప్రదింపులతో మాత్రమే ఇది జరగాలి. బీఎల్ఏలకు గుర్తింపు కార్డులిచ్చి, వారికి మండల, నియోజకవర్గ స్థాయిలో శిక్షణ ఇవ్వాలి. వీవీ ప్యాట్‌లో పార్టీ గుర్తింపు పెద్దగా చేసి, ఎక్కువ సేపు కనబడేలా ఉంచాలి. జీరో డోరు నంబరు విధానాన్ని రద్దు చేసి, తాత్కాలికంగా పక్కింటి డోరు నంబరుతో ఓటరు చిరునామా గుర్తింపు విధానాన్ని అమలు చేయాలి. ఓటర్ల సంఖ్యను బట్టి కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతిబూత్‌లో గరిష్ఠంగా 900 ఓట్లు ఉండేలా చూడాలి' అని కోరినట్లు టీడీపీ నేతలు చెప్పారు. బీజేపీ నేత కిలారు దిలీప్ మాట్లాడుతూ... ఓటర్ల జాబితాను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. వైసీపీ నేత మల్లాది విష్ణు మాట్లాడుతూ... వీవీ ప్యాట్‌లపై అనుమానాలున్నాయని, వాటిని సమీక్షించాలని కోరామన్నారు.



అమరావతిపై కక్షతో..

కేబినెట్ సమావేశంలో మంత్రులు, మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సింగపూర్‌పై బురద!

(మొదటి పేజీ తరువాయి)

వనరులతో రాజధాని నిర్మించాలని తాపత్రయపడ్డాం. సింగపూర్ వంటి దేశాల సలహాలు, సూచనలు కోరాం. మనం చూపిన చొరవతో సింగపూర్ ప్రభుత్వం రాజధాని ప్రాంతంలో సీడ్ కేపిటల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ముందుకొచ్చింది. ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం అవినీతి ముద్ర వేసి దానిని వెళ్లగొట్టింది. ఈ పరిణామంతో అంతర్జాతీయంగా తమ ప్రతిష్ఠకు భంగం కలిగిందని సింగపూర్ ప్రభుత్వం ఆవేదన చెందింది. ఇలాంటి పరిణామాలు రాష్ట్ర ఇమేజ్‌నూ దెబ్బతీస్తాయి. జగన్ నిర్వాకంతో దెబ్బతిన్న రాష్ట్ర ఇమేజ్‌ను సరిచేయడంతోపాటు సింగపూర్ ప్రభుత్వంతో సంబంధాలను పునరుద్ధరించుకోవాలన్న ఉద్దేశంతో సింగపూర్ పర్యటనకు వెళ్తున్నాం' అని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రధానంగా రాజధాని నిర్మాణంలో సింగపూర్ సహకారం, ఏపీఎండీసీ బాండ్లు ఎవరూ కొనకుండా వైసీపీ పన్నిన కుయుక్తుల గురించి సహచరులకు ఆయన వివరించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని.. సీడ్ కేపిటల్ తప్ప ఏ ప్రాంతంలోనైనా అభివృద్ధి ప్రాజెక్టుల్లో భాగస్వాములయ్యేందుకు సింగపూర్ ప్రభుత్వం సుముఖంగా ఉందని చెప్పారు. సీడ్ కేపిటల్‌పై సింగపూర్ ఎందుకు విముఖత చూపుతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించినప్పుడు సీఎం జవాబిస్తూ.. 'అవినీతిరహిత దేశాల జాబితాలో సింగపూర్ 3వస్థానంలో ఉంది. అలాంటి దేశంపై జగన్ ప్రభుత్వం అవినీతి ముద్ర వేసింది. అమరావతిపై కక్షతో సీడ్ కేపిటల్ విషయంలో ఆ దేశ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించడంతో అటువైపు రావడానికి వారు సుముఖత చూపడం లేదు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు మాత్రం సుముఖంగా ఉన్నారు. నా పర్యటనలో పెట్టుబడులు పెట్టేందుకు వారిని ఆహ్వానిస్తా' అని తెలిపారు.

> అక్రమ కట్టడాలకు సంబంధించి పటిష్ఠ చట్టం తీసుకురావాలి. డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్మాణ సమయంలోనే వాటిని కూల్చేయాలి. సంబంధిత ఉద్యోగులపైనా కఠినంగా వ్యవహరించినప్పుడే వాటికి అడ్డుకట్ట వేయగలం.
> - చంద్రబాబు

వైసీపీ కుట్రలు విఫలం..

ఏపీ బ్రాండ్ పునరుద్ధరణలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. జగన్ వెళ్లగొట్టిన పెట్టుబడిదారులందరిలో నమ్మకం పెంచి.. తిరిగి తీసుకొస్తున్నామని తెలిపారు. వైసీపీ దుష్ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మడం లేదని.. ఏపీ ఎండీసీ బాండ్లకు వచ్చిన స్పందనే ఇందుకు నిదర్శనమని తెలిపారు.

భవన క్రమబద్ధీకరణపై చట్టం

ఎల్‌ఆర్‌ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకున్నా.. బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) విషయంలో మరింత అధ్యయనం చేయాలని కేబినెట్‌లో నిర్ణయించారు. బీపీఎస్‌ను అమలు చేస్తే అక్రమంగా భవన నిర్మాణాలు చేసే వారిలో భయం ఉండదని, తన నియోజకవర్గ పరిధిలో 160 గజాల్లో ఆరు అంతస్థులు కట్టేశారని, ఇలాంటి వాటికి బీపీఎస్ ద్వారా లబ్ధి చేకూరితే అక్రమ కట్టడాలను ప్రభుత్వమే ప్రోత్సహించినట్లు అవుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. దీనికి సీఎం కూడా అంగీకరించారు. పకడ్బందీగా అధ్యయనం చేయాలని.. మనం అమలు చేసేదే చివరి బీపీఎస్ కావాలని చెప్పారు. రాష్ట్రంలో ఇల్లులేని పేదలు ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం పేదలకు సెంటు పట్టాల పేరుతో వారిని దగా చేసి కోట్లాది రూపాయల దోపిడీకి పాల్పడిందని కానీ మనం పేదలు గౌరవప్రదంగా ఉండేందుకు గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలాన్ని ఇద్దామని.. ఈ దిశగా మంత్రులు దృష్టి సారించాలని సూచించారు. వెనుకబడిన జిల్లాలు, నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టిపెట్టాలని దిశానిర్దేశం చేశారు. ఆయా జిల్లాల్లో వనరుల ఆధారంగా ప్రాజెక్టులు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేయాలన్నారు. క్వాంటమ్ వ్యాలీ మాదిరి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో కూడా రాష్ట్రం అందరికంటే ముందుండాలని, ఇలాంటి విషయాలపై మంత్రులు తాజా సమాచారంతో అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు.



'హరిహర వీరమల్లు' విజయంపై పవన్ కల్యాణ్‌కు అభినందనలు

మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత సహచర మంత్రులతో కలిసి చంద్రబాబు భోజనం చేశారు. భేటీకి ముందు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పిలిచి మరీ షేక్ హ్యాండ్ ఇచ్చి అభినందించారు. ఆయన నటించిన 'హరిహరవీరమల్లు' విజయవంతంగా ప్రదర్శితమవుతోందని ప్రశంసించారు. లోకేశ్ కూడా సినిమా విజయంపై అభినందనలు తెలుపడంతో పవన్ కల్యాణ్ ఆయన్ను ఆలింగనం చేసుకుని కృతజ్ఞతలు తెలిపారు.

రేపు సింగపూర్‌కు సీఎం

- పెట్టుబడుల సాధనే లక్ష్యంగా 6 రోజులు పర్యటన

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో పర్యటించనున్నారు. శనివారం నుంచి ఆరు రోజులపాటు సీఎం బృందం అక్కడే ఉండనుంది. తన పర్యటనలో భాగంగా దిగ్గజ సంస్థల ప్రతినిధులు, యాజమాన్యాలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు భేటీ అవుతారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెట్టుబడుల ఆకర్షణకు మొదటగా దావోస్‌కు వెళ్లారు. రెండో విదేశీ పర్యటనగా సింగపూర్‌కు సీఎం వెళుతున్నారు. బ్రాండ్ ఏపీ ప్రమోషన్‌తోపాటు రాష్ట్రానికి పెట్టుబడులను సాధించాలన్న లక్ష్యంతో ఈ పర్యటన సాగనుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక పాలసీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను వివరించి పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆహ్వానించనున్నారు. మొదటి రోజు సింగపూర్‌సహా సమీప దేశాల్లో నివసిస్తున్న ప్రవాసాంధ్రుల సంఘం నిర్వహించే తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం పాల్గొంటారు. పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రానికి రావాలని వారిని ఆహ్వానించనున్నారు. నవంబరులో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు సింగపూర్ పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానించనున్నారు. పోర్టు ఆధారిత ప్రాజెక్టులు, సెమీ కండక్టర్లు, ఏఐ, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన అవకాశాలపై చర్చించనున్నారు. సింగపూర్‌లో నిర్వహించే బిజినెస్ రోడ్‌షోకు హాజరవుతారు. ఆ దేశంలో వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కేంద్రాలను సీఎం సందర్శించనున్నారు. చంద్రబాబుతోపాటు సింగపూర్ వెళుతున్న బృందంలో మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్, ఐఏఎస్ అధికారులు కాటమనేని భాస్కర్, ఎన్. యువరాజ్, కె.కన్నబాబు, సాయికాంత్ వర్మ ఉన్నారు.

79,900 కోట్ల పెట్టుబడులకు ఓకే

తద్వారా లక్షన్నర ఉద్యోగాలు: మంత్రివర్గం

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్‌కు పటిష్ఠ పునాదులు వేయాలనే లక్ష్యంతో రూ.79,900కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు లక్షన్నర ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన విలేకరులకు వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకెళ్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం.. భవిష్యత్‌లో పెట్టుబడిదారులందరికీ ఏపీ కేంద్రంగా మారేలా పాలసీలు తెస్తున్నట్లు చెప్పారు. ఈ దిశగానే ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ ఉత్పాదక పాలసీ4.0కి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఇప్పటివరకు ఈ పాలసీ లేకపోవడంతో.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే భారీ, మధ్య, చిన్నతరహా సంస్థలకు ప్రోత్సాహకాలను అందించే వీలు లేకుండా పోయింది. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలు భారీగా ప్రోత్సాహకాలు ఇస్తుండడంతో అవన్నీ అటు వెళ్లిపోతున్నాయి. దీంతో ఏపీలోనూ రూపొందించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీ పాలసీ 2025-30ని రాష్ట్ర కేబినెట్ ఇప్పుడు ఆమోదించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాబోయే కాలంలో విశాఖను సాఫ్ట్‌వేర్, డేటా సెంటర్‌గా తయారీ చేయాలన్న లక్ష్యంతో పలు సంస్థల పెట్టుబడులకు అంగీకారం తెలిపినట్లు మంత్రి చెప్పారు. ఎస్ఐపీబీ సిఫారసుల మేరకు సిఫీ సంస్థకు విశాఖ మధురవాడ ఐటీ హిల్స్‌లో 3.6 ఎకరాల భూమిని ఎకరా రూ.కోటి చొప్పున కేటాయించేందుకు మంత్రివర్గం సమ్మతించినట్లు తెలిపారు. ఇక్కడి ఐటీ టవర్స్‌లో సత్వ కంపెనీకి ఎకరా రూ.కోటిన్నర చొప్పున 30 ఎకరాలు.. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు హిల్స్ నంబర్3లో రెండున్నర ఎకరాలు ఒక చోట, 7.79 ఎకరాలు మరోచోట కేటాయించడానికి అంగీకరించింది. బీవీఎం సంస్థకు ఎకరా రూ.కోటిన్నర చొప్పున ఐటీ పనోరమా హిల్స్‌లో 30 ఎకరాలు ఇవ్వడానికి ఆమోదం తెలిపింది. ఫెనమ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరా రూ.4.05 కోట్ల చొప్పున.. మధురవాడలో ప్లాట్ నంబర్ సీ1ఎ, హిల్స్ నంబర్ 2లో 0.45 ఎకరాలు, రుషికొండ ఐటీ పార్కులోని హిల్స్ నంబర్4లో ప్లాట్ నంబర్ 15బీ, 15సీలో నాలుగు ఎకరాలు ఏపీఐఐసీ ద్వారా అప్పగించాలని నిర్ణయించింది. ఫెనమ్ పీపుల్ రూ.207.5 కోట్ల పెట్టుబడి పెట్టి 2,500 మందికి ఉపాధి కల్పించనుంది. బర్లీ పొగాకు రైతులందరినీ ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలని ఇదివరకే నిర్ణయించగా.. రైతుల నుంచి గరిష్ఠంగా 20 క్వింటాళ్ల చొప్పున కొనాలని ఇప్పుడు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. తిరుపతి తొక్కిసలాట ఘటనపై జస్టిస్ సత్యనారాయణ మూర్తి కమిషన్ సమర్పించిన నివేదికను ఆమోదించినట్లు చెప్పారు. ఈ కేసులో బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని దేవదాయ మంత్రిని సీఎం ఆదేశించారని తెలిపారు.



మంత్రివర్గ సమావేశానికి ముందు డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, మనోహర్, అచ్చెన్న, దుర్గేశ్ మాటామంతి

మరిన్ని నిర్ణయాలు..

- అనకాపల్లిలో గృహనిర్మాణానికి 58.18 ఎకరాలను భూసమీకరణ ద్వారా తీసుకునేందుకు అంగీకారం.
- 1,944.19 ఎకరాల భూమిని విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్ ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించేందుకు ఓకే.
- ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ఆర్థిక సహకారంతో రాష్ట్ర మంచినీటి సరఫరా, మురుగునీటి యాజమాన్య విధానం కింద 20 ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆమోదం.
- ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్స్ కింద టౌన్‌షిప్‌లు, ఎంఐజీ గృహాల నిర్మాణాలకు ఓకే. మారిటైమ్ బోర్డు ద్వారా రూ.5,526కోట్ల బాండ్ల విడుదలకు ఆమోదం.
- విజయనగరం జిల్లా అరసాడలో పీవీఎస్ గ్రూప్ ద్వారా కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు.
- అంతర్రాష్ట్ర వివాదాల కారణంగా నిలిచిపోయిన 1,200 మెగావాట్ల కురుకుట్టి పంప్డ్ స్టోరేజీ ప్లాంట్, కర్రివలస 1,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల కేటాయింపులు రద్దు.
- నంద్యాల జిల్లాలో ఆర్వీఆర్ ప్రాజెక్ట్సు స్థాపించే 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రతిపాదనలకు ఆమోదం.
- శ్రీకాకుళం జిల్లా సంతకవిటిలో పీవీఎస్ రామ్మోహన్ ఇండస్ట్రీస్ ద్వారా 1.5 టీపీడీ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన.
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 300 మెగావాట్ల విండ్ పవర్ ఉత్పత్తికి రెన్యూ వ్యోమన్ పవర్‌కు గ్రీన్‌సిగ్నల్. డోన్ ప్రాంతంలో 600 మెగావాట్ల ప్రాజెక్టు స్థాపనకు రెన్యూ విక్రమ్ శక్తికి అనుమతి. కర్నూలు జిల్లా గుండుతెండ వద్ద శ్రీజా ఇన్‌ఫ్రా ప్రతిపాదనలు రద్దు.
- కేంద్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రాష్ట్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ తీసుకునే రూ.2,724 రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ.
- అనంతపురం జిల్లాలో 'ఆరో' ఇన్‌ఫ్రా (గతంలో అరబిందో రియాల్టీ)కి కేటాయించిన 500 మెగావాట్ల సింగనమల పీఎస్పీ అనుమతులు రద్దు.
- కడప జిల్లా జమ్మలమడుగులో 1,050 మెగావాట్లు, శ్రీసత్యసాయి జిల్లా సున్నపురాయిపల్లెలో 400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను జేఎస్‌డబ్ల్యు సంస్థ స్థాపించేందుకు ఆమోదం.
- అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్‌కు ఆమోద ముద్ర.
- రాష్ట్ర నూర్‌బాషా/దూదేకుల ఆర్థిక సహకార సంస్థ ఏర్పాటుకు ఓకే.
- తల్లికి వందనం పథకం అమలుకు ఆమోదం.
- నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని శ్రీ నరసింహరాయ సాగర్ ప్రాజెక్టు (గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు) రక్షణ చర్యల కోసం రూ.53 కోట్లతో పనులు చేపట్టేందుకు ఆమోదం.
- విశాఖ జిల్లా గోలుగొండ మండలంలోని తాండవ రిజర్వాయరు ఆధునికీకరణ పనుల బాధ్యతల నుంచి మాక్స్ ఇండియా ఇన్‌ఫ్రా తొలగింపు.
- గండికోట ఎత్తిపోతల పథకం స్టేజ్-1, స్టేజ్-2 పంప్ హౌస్‌ల నిర్వహణ బాధ్యత మేఘా ఇంజనీరింగ్‌కు అప్పగింత.

ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి సవరణ

- జూన్ 30కి ముందున్నవాటికి క్రమబద్ధీకరణ

ఆంధ్రప్రదేశ్ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్ అప్రూవ్డ్ లేఅవుట్స్ అండ్ ప్లాట్స్ రూల్స్ 2020(ఎల్‌ఆర్‌ఎస్-2020)కి సవరణలు చేస్తూ మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. 2019 ఆగస్టు 30కు ముందు ఆమోదం పొందని ప్లాట్స్ సబ్‌డివిజన్లు, లేఅవుట్లు, వెంచర్లను క్రమబద్ధీకరించేందుకు 2020జనవరి 8న మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దరఖాస్తుల స్వీకరణకు 2020 డిసెంబరు 31 వరకు గడువిచ్చారు. వాటి పరిష్కార గడువును 2025 జూలై 8 దాకా పొడిగించారు. అనధికార లే అవుట్ల వల్ల ప్రభుత్వం ఆదాయం కోల్పోయిందని, పలువురు అవగాహన లేక దరఖాస్తు చేసుకోలేక పోయారని డీటీసీపీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. తాజా సవరణతో లేఅవుట్లు సబ్‌డివిజన్ క్లియర్ కావడంతోపాటు ప్లాట్లు, రోడ్లకు సరిహద్దులు ఏర్పడతాయి. సవరణ రూల్స్ వచ్చిన 90 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరిస్తారు. 2025 జూన్ 30 వరకు ఉన్న లే అవుట్లను క్రమబద్ధీకరిస్తారు.



మంగళగిరిలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి లోకేశ్

దేశానికే రోల్ మోడల్‌గా జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు

- అధికారులతో సమీక్షలో మంత్రి లోకేశ్

మంగళగిరి, జూలై 24(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యుత్తమ మోడల్ తరహాలో మంగళగిరి జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు నిర్మాణం చేపట్టాలని మంత్రి లోకేశ్ సూచించారు. జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు ఏర్పాటుపై గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంగళగిరిలో ఏర్పాటు చేయబోతున్న జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కుతో పాటు కేంద్ర సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటరు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందులో ఆభరణాల తయారీలో ప్రపంచస్థాయి శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. దేశంలో టాప్ 20 ఆభరణాల తయారీ సంస్థలు మంగళగిరి పార్కులో తయారీ యూనిట్లు, రిటైల్ షాపులు స్థాపించేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఇందుకోసం ఉడుపిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యూయలరీ(ఐఐజీజే) పనితీరును అధ్యయనం చేయాలని ఆదేశించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో గణేష్ కుమార్ స్పందిస్తూ త్వరలో ఏర్పాటు చేసే కామన్ ఫెసిలిటీ సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ఏటా 4వేల మందికి అధునాతన ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. మంగళగిరిలో యువతకు నైపుణ్య శిక్షణ అందించేలా మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)ను కూడా త్వరితగతిన ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆదేశించారు. మంగళగిరిలో ఇప్పటివరకు చేపట్టిన మూడు జాబ్ ఫెయిర్లకు 1,170 మంది హాజరు కాగా, 453 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు తెలిపారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ ఇకపై ప్రతి నెలా జాబ్ ఫెయిర్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, యువతకు నూరు శాతం ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించారు.

యూరియా కొరతను నివారించండి

- కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు టీడీపీ ఎంపీల వినతి

న్యూఢిల్లీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతులకు అవసరమైన యూరియా నిరంతరాయంగా సరఫరా చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు టీడీపీ ఎంపీల బృందం విజ్ఞప్తి చేసింది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి జేపీ నడ్డాను గురువారం కలిశారు. ఏపీలో యూరియా కొరత సంక్షోభాన్ని తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. 'జూలైలో ఏపీకి 80,515 టన్నుల యూరియా కొరత ఉంది. జూలై ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం, కేంద్ర ఎరువుల శాఖ ఏపీకి 1.30 లక్షల టన్నుల యూరియాను కేటాయించింది. అయితే, జూలై 18 నాటికి రవాణాలో ఉన్న మెటీరియల్‌తో సహా కేవలం 49,485 టన్నులు మాత్రమే చేరింది. దీంతో 80 వేల టన్నులకు పైగా కొరత ఏర్పడింది. క్రిబ్‌కో, సీఐఎల్, ఐపీల్ కంపెనీ, గంగవరం పోర్టు నుంచి యూరియా కేటాయింపులు పెంచాలి' అని టీడీపీ ఎంపీలు కోరారు.

అంతరిక్ష రంగంలో ఏపీ పాలసీ ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష రంగం విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల రాష్ట్రస్థాయి విధానాన్ని ప్రకటించిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. గురువారం రాజ్యసభలో టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అంతరిక్ష రంగ తయారీ క్లస్టర్లను ఏర్పాటు చేయడంపై ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ ఆంధ్రప్రదేశ్‌తో సహా వివిధ రాష్ట్రాలను ఇన్-స్పేస్ సంప్రదించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 11 ప్రభుత్వేతర సంస్థలు ఇన్-స్పేస్ వద్ద నమోదయ్యాయి. ఇందులో 9 అంకుర సంస్థలే. వీటిలో ఒకటి మాత్రమే ఇన్-స్పేస్ సహాయాన్ని అందుకుందని కేంద్ర మంత్రి తెలిపారు.

నెల్లూరులో నాణ్యమైన ఇనుప ఖనిజం..!



డ్రిల్లింగ్ అనంతరం పరీక్షల కోసం సిద్ధం చేసిన ఐరన్ ఓర్

కందుకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇనుము తయారీలో మాగ్నటైట్ ఒక ముఖ్యమైన ముడిపదార్థం. దీనిలో ఇనుము శాతం అధికంగా ఉంటుంది. దీన్ని శుద్ధి చేయడం కూడా సులభం. అలాంటి అత్యంత నాణ్యమైన మాగ్నటైట్ ఐరన్ ఓర్ నిక్షేపాలు నెల్లూరు జిల్లా లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో పుష్కలంగా ఉన్నట్టు జేఎస్‌డబ్ల్యూ కంపెనీ తనిఖీల్లో గుర్తించినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ రెండు మండలాల పరిధిలోని 10 గ్రామాల్లో 21.87 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇనుప ఖనిజం నిక్షేపాలున్నట్టు గతంలో నేషనల్ జియోగ్రాఫికల్ సర్వేలో తేలింది. దీంతో ఈ ప్రాంతంలో ఐరన్ ఓర్ శోధన, మైనింగ్ కోసం కాంపోసైట్ లైసెన్సు పొందిన జేఎస్‌డబ్ల్యూ.. వారం రోజులుగా క్వాలిటీ నిర్ధారణకు డ్రిల్లింగ్ పనులు ముమ్మరం చేసింది. సాధారణంగా ఐరన్‌ఓర్ నాణ్యతను నాలుగు రకాలుగా విభజిస్తారు. 70 శాతం కన్నా ఎక్కువ ఇనుము కలిగిన ముడి సరుకును మాగ్నటైట్ ఓర్‌గా, 60 నుంచి 70 శాతం వరకు ఇనుము ఉంటే హెమటైట్ రకంగా, 40 నుంచి 60 శాతం వరకు ఉంటే లైమోటైట్‌గా, అంతకన్నా తక్కువ ఉంటే సైడ్‌రైట్‌గా పరిగణిస్తారు. వీటిలో మాగ్నటైట్, హెమటైట్ రకం ఐరన్‌ఓర్ ఉంటేనే మైనింగ్‌కు ఆసక్తి చూపుతారు. మిగిలిన రెండు క్వాలిటీలకు తగినంత గిట్టుబాటు ఉండదు.



నెల్లూరు జిల్లాలో అయ్యవారిపల్లి, జంగంరెడ్డి కండ్రిక మధ్య కుచ్చులకొండ సమీపంలో డ్రిల్లింగ్ చేస్తున్న దృశ్యం

ప్రస్తుతం వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల పరిధిలో ఉన్న ఐరన్‌ఓర్ మాగ్నటైట్ రకమని సిబ్బంది ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. జేఎస్ డబ్ల్యూ కంపెనీకి 2023లో వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లోని పది గ్రామాల పరిధిలో 21.87 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఐరన్‌ఓర్ క్వాలిటీని చెక్ చేసుకునేందుకు వీలుగా బిడ్డింగ్ పద్ధతిలో కాంపోసైట్ లైసెన్సు మంజూరు చేశారు. లింగసముద్రం మండలం అద్దంకివారిపాలెం ఐరన్‌ఓర్ బ్లాక్ 9.14 కిలోమీటర్లలో విస్తరించి ఉండగా ఇందులో లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం, ఆర్ ఆర్ పాలెం, జంగంరెడ్డి కండ్రిక గ్రామాల పరిధిలోని కొండలు, ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఉన్నాయి. అలాగే వలేటివారిపాలెం మండలంలోని చుండి, అయ్యవారిపల్లి, పోలినేనిచెరువు గ్రామాల పరిధిలోకి వచ్చే కొండలు, ఇనాం భూములు, పట్టా భూములు, ప్రభుత్వ పోరంబోకు భూములను లక్ష్మక్కపల్లి నార్త్ ఐరన్‌ఓర్ బ్లాక్‌గా పరిగణిస్తున్నారు. దీని పరిధిలో వలేటివారిపాలెం మండలంతోపాటు పీసీపల్లి, పామూరు మండలాల్లోని కొన్ని గ్రామాలు ఉన్నాయి. ఈ బ్లాక్ 11.947 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఈ రెండు బ్లాకులు కలిపి 21.87 చదరపు కిలోమీటర్లు కాగా ఇందులో రిజర్వ్ ఫారెస్టు భూములు కూడా ఉన్నాయి.

10 మీటర్ల నుంచే ఐరన్ ఓర్

అద్దంకివారిపాలెం ఐరన్ ఓర్ బ్లాక్, లక్ష్మక్కపల్లి నార్త్ ఐరన్ ఓర్ బ్లాక్‌లలో 10 మీటర్లలోతు నుంచే ఐరన్ ఓర్ నిక్షేపాలున్నట్లు డ్రిల్లింగ్ చేస్తున్న సిబ్బంది గుర్తించారు. 20 మీటర్లు దాటిన తర్వాత నాణ్యమైన ఓర్ పడుతున్నట్టు తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో 150 మీటర్ల లోతు వరకు నిక్షేపాలున్నట్టు గుర్తించారు. తొలుత 100 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేయాలని ఆపై దాన్ని 150-200 మీటర్ల వరకు పెంచాలని ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం.

అప్పుడలా.. ఇప్పుడిలా..

నాడు చంద్రబాబును హింసించారు

ఇప్పుడు మిథున్ కోసం కన్నీరు



రాజమహేంద్రి జైలులోకి వెళ్తున్న చంద్రబాబు(ఫైల్)

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తమదాకా వస్తేగానీ వైసీపీ పెద్దలకు తత్వం బోధపడలేదు. నాడు టీడీపీ అధినేత చంద్రబాబును రాజమండ్రి జైలులో ఉంచిన స్నేహా బ్లాక్‌కే నేడు రూ.వేలకోట్ల మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి చేరుకున్నారు. ఏ సౌకర్యం ఇవ్వకుండా ఆనాడు చంద్రబాబును చాలారోజులు నరకయాతనను గురిచేశారు. కానీ, మిథున్ రెడ్డికి తొలిరోజే జైలులో అన్ని సౌకర్యాలూ లభించాయి. అయినా...చంద్రబాబు ప్రభుత్వంపై మిథున్‌రెడ్డి తండ్రి, వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవేశపడిపోయారు. బుధవారం తన కుమారుడిని జైలులో కలిసి బయటకువచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "వైసీపీ నేతల పట్ల ప్రభుత్వం తాలిబన్లు, టెర్రరిస్టుల మాదిరిగా వ్యవహరిస్తోంది." అని అన్నారు. మరి... చంద్రబాబుపై కక్ష కట్టి అక్రమంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అప్పటి ప్రభుత్వం జైలుకు పంపినప్పుడు.. పెద్దిరెడ్డికి తాలిబన్లు, టెర్రరిస్టులు గుర్తుకు రాలేదా? అని నెటిజన్లు, టీడీపీ శ్రేణులు నిలదీస్తున్నాయి.

అంతులేని దాష్టీకం

14 ఏళ్లపాటు సీఎంగా సేవలందించి, సుదీర్ఘ రాజకీయ జీవితం కలిగిన... 75 ఏళ్ల వయసున్న చంద్రబాబుపట్ల నాటి వైసీపీ సర్కారు క్రూరంగా వ్యవహరించింది. కోర్టుకు తీసుకెళ్లాల్సి వస్తే 'పోలీసు వ్యానులోకి మెడ పట్టుకుని గెంటండి' అని పోలీసు ఉన్నతాధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అనేవారు. అప్పట్లో జైలు లోపలకు వెళ్తున్న చంద్రబాబు వీడియోను నిబంధనలు అతిక్రమించి చిత్రీకరించడమే కాకుండా, జగన్ చానల్‌లో పదే పదే ప్రచారం చేసింది. ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న ఆయనను ఉంచిన స్నేహా బ్లాక్‌లో సౌకర్యాలు అరకొరే. బాత్‌రూమ్‌లో జగ్గు లేకుండా కేవలం ఒక చిన్న బకెట్ పెట్టారు. ఒళ్లంతా దద్దుర్లు వచ్చినా పట్టించుకోకుండా చంద్రబాబు నరకయాతన పడేలా చేశారు.

డెంగీ భయాల మధ్యే..

జైలులో చంద్రబాబు భద్రత, ఆరోగ్యంపై ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే అడుగడుగునా చంద్రబాబును ఇబ్బంది పెట్టాలనే చూశారు. 'పైనుంచి' ఎప్పటికప్పుడు అందుతున్న మౌఖిక ఆదేశాల ఆధారంగా జైలు అధికారులు నడుచుకున్నారు. ఆయన గదిలో కేవలం ఒక కుర్చీ ఉంచారు. భోజనం క్యారేజీ బాక్సులను కింద పెట్టుకొని కుర్చీలో ఆయన కూర్చొని, కిందికి వంగి కష్టంగా కంచంలో పదార్థాలు వేసుకోవాల్సి వచ్చేది. బాత్‌రూమ్ ఇండియన్ టైప్ కాగా..చిన్న బకెట్ ఇచ్చారు. చాలా రోజులు ఇలాగే ఇబ్బంది పెట్టారు. కిటికీలకు తెరలు కూడా లేకపోవడంతో దోమలతో చంద్రబాబు ఇబ్బంది పడేవారు. ఆ సమయంలో జైలులోని ఒక ఖైదీకి డెంగీ వచ్చింది. చంద్రబాబును ములాఖత్ ద్వారా కలిసిన లోకేశ్ ఆ విషయం తెలుసుకుని భయాందోళనకు గురయ్యారు. జైల్లోనే బాబును అంతం చేసే కుట్ర జరుగుతోందని ఆవేదనతో మీడియాకు తెలిపారు.

రెండు రోజులు కంటిపై కునుకులేదు

చంద్రబాబుకు అప్పట్లో రెండురోజులపాటు కంటిమీద కునుకులేకుండా చేశారు. 2023 సెప్టెంబరు 8న అర్ధరాత్రి తర్వాత 2.30గంటల ప్రాంతంలో అప్పటి సిట్ చీఫ్, ఇంటెలిజెన్స్ డీఐజీ రఘురామిరెడ్డి, డీఎస్పీ ధనుంజయుడు నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేశారు. ఉదయం 7.40గంటలకు రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరారు. 10వతేదీ తెల్లవారుజామున ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం మళ్లీ సిట్ కార్యాలయానికి తీసుకెళ్లి సరిగ్గా ఉదయం ఆరు గంటలకు ఏసీబీ కోర్టులో జడ్జి హిమబిందు ముందు హాజరుపర్చారు. రిమాండుపై ఆరు గంటలపాటు విచారణ జరిగింది. చంద్రబాబుకు జ్యుడిషియల్ రిమాండు విధిస్తూ సాయంత్రం 6.45 గంటలకు తీర్పు వెలువడింది. ఆ తర్వాత రిమాండ్‌ను గృహనిర్బంధంగా మార్చాలనే పిటిషన్‌పై వాదనలు జరిగాయి. దీంతో రాత్రి9.45 గంటల వరకూ చంద్రబాబు కోర్టుఆవరణలోనే ఉన్నారు. ఆ తర్వాత రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. అర్ధరాత్రి 1.20గంటలకు ఆయన జైలులోకి వెళ్లారు. ఇలా రెండు రోజులపాటు కంటిపై కునుకు లేకుండా చేశారు.

నివేదికలు తారుమారు..

చంద్రబాబుకు ఆరోగ్య కారణాల రీత్యా చల్లటి వాతావరణం అవసరం. కానీ గదిలో ఫ్యాను మాత్రమే ఉండేది. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకూ ఉండడంతో తీవ్రమైన ఉక్కపోత, వేడితో ఒళ్లంతా బొబ్బలెక్కేది. అప్పుడు వైద్యం అందించడంలోనూ అలసత్వం వహించారు. ఆ తర్వాత కోర్టు ఆదేశంతో టవర్ ఏసీ బిగించారు. కంటికి ఆపరేషన్ అవసరమని వైద్య నిపుణులు తేల్చగా.. కొద్ది గంటల్లోనే ఇప్పుడే అవసరం లేదంటూ వైద్యుడితో ఆ నివేదికను మార్పించారు.

దోస్త్ మేరా దోస్త్!

(మొదటి పేజీ తరువాయి)

సహకారమూ అందించింది. కేసీఆర్ తనకు 'పెద్దన్న' అని జగన్ ఎన్నోసార్లు చెప్పకనే చెప్పారు. వారిద్దరి మధ్య రాజకీయాలకు మించిన బంధం! అదికాస్తా... అక్రమాల్లో సహకరించుకునేదాకా వెళ్లిందని ఇప్పుడు స్పష్టమవుతోంది. ఇప్పటికీ పరస్పర అవసరాల కోసం ఇద్దరి మధ్య సహకారం కొనసాగుతున్నట్లు చెబుతారు.

జగన్ కోసం షర్మిలపై నిఘా...

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరుపుతోంది. బీఆర్ఎస్ హయాంలో వైఎస్ షర్మిల ఫోన్‌పైనా నిఘా పెట్టినట్లు ఇప్పటికే స్పష్టమైంది. అప్పటికే సోదరుడు జగన్‌తో షర్మిలకు ఆస్తి విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఆమె ఎవరితో మాట్లాడుతున్నారు, ఏం మాట్లాడుతున్నారో తెలుసుకునేందుకు జగన్ కోరిక మేరకే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం షర్మిల ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు భావిస్తున్నారు. 'నాడు షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టినందున... ఆ వివరాలపై కూపీ లాగేందుకే ట్యాపింగ్ చేసి ఉండొచ్చు' అంటున్న వైసీపీ వాదనలో ఏమాత్రం పసలేదు. షర్మిల పార్టీని కేసీఆర్ అసలు లెక్కలోకే తీసుకోలేదు. కాంగ్రెస్‌పైనే ఆయన గురిపెట్టారు. కొందరు మీడియా ప్రముఖులపైనా నిఘా వేశారు. వెరసి...కేవలం జగన్ కోసమే షర్మిల ఫోన్‌ను ట్యాప్ చేశారనడంలో ఏమాత్రం సందేహంలేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇలా...ఒక చట్టవిరుద్ధచర్యలోనూ బీఆర్ఎస్, వైసీపీ చేతులు కలిపాయి.

మద్యంతో 'ట్యాప్' లింకులు...

తెలంగాణలో నమోదైన ట్యాపింగ్ కేసులో నిందితుడైన శ్రవణ్‌రావు బీఆర్ఎస్ పెద్దలకు సన్నిహితుడు. ట్యాపింగ్‌కు అవసరమైన సాంకేతిక పరికరాలను శ్రవణ్‌రావు కంపెనీ పేరుమీదే కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆయనను కూడా ట్యాపింగ్ కేసులో నిందితుడిగా చేర్చారు. విచిత్రమేమిటంటే... ఇదే శ్రవణ్‌రావు ఏపీలో మద్యం స్కామ్ నిందితులకు దుబాయ్‌లో తన ఫ్లాట్‌లో ఆశ్రయం ఇచ్చారు. నెలకు సుమారు రూ.5 లక్షల అద్దె వదులుకుని మరీ... ఫ్లాటులో ఆతిథ్యం ఇచ్చారు. శ్రవణ్ రావు కూడా కొన్నాళ్లు వారితో కలిసి అదే ఫ్లాటులో ఉన్నారంటే... 'ట్యాపింగ్, లిక్కర్' బంధం ఎంత బలమైనదో అర్థం చేసుకోవచ్చు. రాజ్ కసిరెడ్డి, శ్రవణ్‌రావు ఇద్దరూ సన్నిహితులని... ఈ క్రమంలోనే ఇతర నిందితులు కిరణ్‌కుమార్ రెడ్డి, వరుణ్, చాణక్య దుబాయ్‌లోని ఫ్లాటులో ఆశ్రయం పొందారని తెలుస్తోంది. బీఆర్ఎస్ సిఫారసుచేసిన కాంట్రాక్టర్లకు ఏపీలో పనులు అప్పగించడం, ఏపీలో వైసీపీ నేతలకు తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల కాంట్రాక్టులు దక్కడం... ఆ రెండు పార్టీల మధ్య 'క్విడ్‌ప్రో కో'కు మరో ఉదాహరణ. ఒకే సమయంలో రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న దర్యాప్తులో ఇప్పటికి ఈ సంగతులు బయటపడ్డాయి. లోతుకు వెళ్లేకొద్దీ మరెన్ని మిలాఖత్‌లు వెలుగులోకి వస్తాయో!

ఏపీ లిక్కర్ సొమ్ముతో తెలంగాణలో ఆస్తులు

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ నిందితుడు దుబాయ్‌లో స్థిరాస్తులు కొనుగోలు చేస్తే.. ఏపీలో లిక్కర్ స్కామ్ కింగ్‌పిన్ రాజ్ కసిరెడ్డి తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. రాజ్ కసిరెడ్డి హైదరాబాద్ సమీపంలో పారిశ్రామిక కారిడార్‌లో రూ.150 కోట్లతో 90ఎకరాల భూమి, ఖరీదైన ప్రాంతంలో స్థిరాస్తి కొనుగోలు చేసినట్లు సిట్ గుర్తించింది. మనీరూటింగ్‌లో భాగంగా స్కాంలో సంపాదించిన మొత్తంతో భూములు కొని... అందులో కొన్ని తిరిగి విక్రయించారు. రాజ్ కసిరెడ్డి సంస్థల పేర్లతో ఆ భూములు ఎలా కొనుగోలు చేశారు? విక్రయంతో వచ్చిన సొమ్ము ఎక్కడికి దారిమళ్లించారు? అనే కోణంలో 'సిట్' ఆరా తీసింది. ఈ లావాదేవీలకు అప్పటి బీఆర్ఎస్ సర్కారు సహకరించిందని అనుమానిస్తోంది.

అది లక్ష కోట్ల లిక్కర్ స్కాం!

- జనం ఆరోగ్యంతో జగన్ చెలగాటమాడారు
- అమ్మకాలు నగదు లావాదేవీల్లోనే ఎందుకు?
- దీనికి జగన్ సూటిగా జవాబు చెప్పాలి
- వివేకా గుండెపోటుతో చనిపోయారని తన చానల్‌లో ఎందుకు ప్రసారం చేశారో కూడా జగన్ నోరు విప్పాలి
- సిట్ దర్యాప్తు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉంది
- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజం



అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేవలం మూడున్నర వేల కోట్ల అవినీతి కాదని, అది లక్ష కోట్ల స్కాం అని పీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. ఇదో పెద్ద ఆర్థిక నేరమని ఆమె వ్యాఖ్యానించారు. దేశమంతా డిజిటల్ పేమెంట్స్ చేయాలంటూ ప్రచారం చేస్తుంటే, రాష్ట్రంలో మద్యం అమ్మకాలు మాత్రం నగదు లావాదేవీల్లోనే ఎందుకు చేశారో వైసీపీ అధినేత జగన్ సూటిగా సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. పన్ను రహిత మద్యాన్ని భారీగా అమ్మడం కోసమే నగదు లావాదేవీల్లో విక్రయాలు చేశారని షర్మిల అన్నారు. ఇది లక్ష కోట్ల రూపాయల స్కాం అని ముఖ్యమంత్రి చంద్రబాబే అసెంబ్లీలో ప్రకటించిన శ్వేతపత్రంలో పేర్కొన్నారని షర్మిల గుర్తు చేశారు. ఇప్పుడు మూడున్నర వేల కోట్ల రూపాయల అక్రమాలని చెబుతున్నారని దీనిపై ప్రభుత్వం స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన మద్యం బ్రాండ్లను ప్రోత్సహించిన జగన్ ప్రభుత్వం తీరుతో లక్షలాది మంది... కిడ్నీ, లివర్‌లు చెడిపోవడం, నరాల బలహీనత తదితర వ్యాధులకు గురయ్యారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 30 వేల మంది నాసిరకం మద్యం తాగి అనారోగ్యానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నారని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయని షర్మిల అన్నారు. దీనిపై సిట్ ఎందుకు దృష్టి పెట్టడం లేదని ఆమె ప్రశ్నించారు. ట్రస్టెడ్ కంపెనీల లిక్కర్‌ను ఎందుకు నిషేధించారో ప్రజలకు తెలియాల్సి ఉందని అన్నారు. తనకు అనుకూలమైన విషయాలను మాత్రమే మాట్లాడే జగన్... రుషికొండను ఎందుకు తవ్వారో.. భవనాలు ఎందుకు కట్టారో ఏనాడూ చెప్పలేదని షర్మిల వ్యాఖ్యానించారు. వివేకానందరెడ్డి హత్య విషయంలోనూ సాక్షి పత్రిక గుండెపోటు అని చెబితే.. దానిపై కూడా జగన్ ఏనాడూ నోరు విప్పలేదని, గంగవరం పోర్టును ఎందుకు అదానీకి అమ్మారని ప్రశ్నిస్తే ఆయన సమాధానం చెప్పలేదని షర్మిల ధ్వజమెత్తారు. మద్యం కేసులో జగన్‌ను అరెస్టు చేస్తారా లేదా అనేది చూడాలని, మద్యం కేసులో సిట్ విచారణ కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉందని ఆమె అన్నారు. ఎంతసేపూ డిస్టిలరీల చుట్టే విచారణ సాగుతోందని ఆమె అసహనం వ్యక్తం చేశారు. నెలకు రూ.50 నుంచి రూ.60 కోట్ల దాకా ముడుపులు అందాయని సిట్ అధికారులు చెబుతున్నారని, అయితే, లిక్కర్ స్కామ్ రూ.3500 కోట్లకే పరిమితం కాదని, డిస్టిలరీ నుంచి వినియోగదారుడికి మద్యం చేరే వరకూ ప్రతి విషయంపైనా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

నా ఫ్లాట్‌కు వచ్చి వెళ్లే వారు!

- తెలుగు వాళ్లు అని రానిచ్చాను
- వరుణ్, చాణక్య తెలుసు.. సిట్ విచారణలో శ్రవణ్ రావు

మద్యం కుంభకోణంలో కీలక నిందితులైన చాణక్య, వరుణ్ పురుషోత్తం దుబాయ్‌లో యాభై రోజుల పాటు ఉన్నట్లు తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు శ్రవణ్ రావు వెల్లడించారు. ఏపీలో లిక్కర్ స్కామ్ దర్యాప్తు చేస్తున్న సిట్ నోటీసు ఇవ్వడంతో గురువారం ఆయన విజయవాడకు వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకూ సిట్ అధికారులు ఆయనను ప్రశ్నించి, వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. 'తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిలు కోసం సుప్రీం కోర్టులో పిటిషన్ వేశాను. ఆ సమయంలో దుబాయ్‌లోని పారమౌంట్ రెసిడెన్సీలోని నా ఫ్లాట్‌లో ఉన్నా. ఒక కామన్ ఫ్రెండ్ ద్వారా వరుణ్ పురుషోత్తం, చాణక్య నాకు పరిచయమయ్యారు. తరచూ నా ఫ్లాట్‌కు వచ్చి వెళుతుండేవారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో యాభై రోజుల పాటు ఉన్నారు. దుబాయ్‌లో వాళ్లు వేరే చోట ఎక్కడో ఉండేవారు. పూర్తిగా నా ఫ్లాట్‌లో ఉండే వారు కాదు. తెలుగు వాళ్లం కావడంతో అక్కడ ఏదో ఊసులు మాట్లాడుకునే వాళ్లం. అప్పటికి ఏపీ మద్యం కుంభకోణంలో ఈ ఇద్దరూ నిందితులు కాదు. నాకు వాళ్లతో ఎటువంటి ఆర్థిక లావాదేవీల్లేవు' అని సిట్ అధికారులకు శ్రవణ్ రావు చెప్పినట్లు తెలిసింది.

ఏసీబీ కోర్టులో మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్

- మరో ముగ్గురి పిటిషన్లపై విచారణ వాయిదా

విజయవాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో నిందితుడు(ఏ4)గా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడ ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున న్యాయవాదులు కోర్టులో గురువారం ఈ పిటిషన్ వేశారు. కాగా, మద్యం కేసులో నిందితులుగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ ఈనెల 29వ తేదీకి వాయిదా పడింది. వాటిపై ఏసీబీ కోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ మూడు పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయాధికారి భాస్కరరావు ప్రాసిక్యూషన్‌ను ఆదేశించారు. కాగా, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జైలులో వంట చేసుకుంటానని దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును ఈనెల 30వ తేదీకి ఆయన వాయిదా వేశారు.

విజయ్ దేవరకొండ, రానాకు ఈడీ పిలుపు

- వచ్చేనెల 11న విచారణకు రావాలని నోటీసు

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బెట్టింగ్ యాప్స్ కేసుకు సంబంధించి ప్రకటనల్లో నటించిన సినీనటులు విజయ్ దేవరకొండ, దగ్గుబాటి రానాలను ఆగస్టు 11న విచారణకు హాజరుకావాలని ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. విజయ్ దేవరకొండకు తొలుత జారీ చేసిన నోటీసులో ఆగస్టు 6న హాజరు కావాలని ఈడీ అధికారులు కోరగా, ఆ రోజున తనకు వీలుకాదని, మరో తేదీ కావాలని విజయ్ ఈడీని అభ్యర్థించడంతో 11న విచారణకు రావాలని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

నిమ్మలపై దాడి కేసు సీఐడీకి అప్పగింత

- గత వైసీపీ ప్రభుత్వంలో కేసు నమోదు చేయని పోలీసులు

పాలకొల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మంత్రి నిమ్మల రామానాయుడుపై గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దాడికి సంబంధించిన కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఘటనపై అప్పట్లో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వైసీపీ రాజకీయ ప్రమేయంతో కేసు నమోదు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేసు నమోదు చేశారు. లోతుగా దర్యాప్తు జరిపేందుకు తాజాగా ఆ కేసును సీఐడీకి బదలాయిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ సీఐడీ డీఎస్పీ మోహన్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేశారు. 2022లో వైసీపీ ప్రభుత్వం పాలకొల్లు పట్టణంలో టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించింది. ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆ సభకు అధ్యక్షత వహించాల్సి ఉంది. అధికారుల ఆహ్వానం మేరకు సభావేదికపైకి వచ్చిన నిమ్మల రామానాయుడు, అప్పటి ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌లను వైసీపీ నాయకులు అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. నిమ్మలకు రక్షణగా నిలిచిన వారిపై కూడా భౌతిక దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో వైసీపీ కార్యకర్తలు ఉపయోగించిన బటన్ నైఫ్‌ను నాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అప్పట్లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ, డీజీపీ, డీఐజీ, ఎస్పీ, కలెక్టర్‌లకు రామానాయుడు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోలేదు. పైగా నాటి ప్రభుత్వం బాధితులపైనే కేసులు నమోదు చేసింది.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.